ప్రజాపక్ష

సమీక్ష

అగస్టు 15-31, సెప్టెంబర్ 1-15, 2003 సమతా పబ్లికేషన్స్ ప్రచురణ వెల: రూ. 10-00

గౌరవ సంపాదకులు :
ఎబికె ప్రసాద్

సంపాదకులు :
వి. హనుమంతరావు

సహాయ సంపాదకులు :
ఇప్ప వీరారెడ్డి

సలహా మండలి :
ప్రొ॥ ఆర్.వి.ఆర్. చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ. పి. నారాయణరెడ్డి
డి. పాపారావు
బి. సాంబశివరాజు
ఎన్. వేణుగోపాల్

లోపలి పేజీల్లో...

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, Printed and Published by
V. Hanumantha Rao
for **Samata Publications**
D.No. 8-3-898/22, Road No. 3,
Nagarjuna Nagar, Hyderabad-73.
Phone : 23748672

Designed & Printed at :
Nutan Art Printers
Lakdi-ka-pool, Hyderabad.

సంపాదకీయం:

సమస్యల సుడిగుండంలో.....

ఇటీవల రాష్ట్రంలో, *అక్కడ కేంద్రంలో సమస్యలు, సంఘటనలు ఒకటి తర్వాత ఒకటి ఉప్పెనలా వచ్చిపడి ఊపిరి సల్పనీయకుండా చేస్తున్నాయి.*

గత సంవత్సరం అంతా రాష్ట్రం కరువుతో అల్లల్లాడిపోయింది. ఊపిరి పీల్చుకోకుండానే మండే ఎండలతో వెయ్యిమందికి పైగా చనిపోయారు. తాగేనీటికి కూడా కరువు ఏర్పడడం, అపరిశుభ్రమైన నీరు తాగి గ్రామాలు రోగాలతో, చావులతో మార్మోగిపోయాయి. సకాలంలో వర్షాలుపడక మరో కరువుసంవత్సరమా అని ఆకాశంవైపు కొన్నాళ్ళు చూసాస్తూ కూర్చోవాల్సివచ్చింది. వర్షాలు పడుతున్నాయను కుంటే కల్తీ విత్తనాల బెడద ఏర్పడింది. పాఠశాలలు తెరిచారనుకొంటే కాలేజీ సీట్లకు ఫీజుల విషయమై ప్రైవేటు కాలేజీల లాబీ లొల్లి ప్రారంభమైంది. వేలసీట్లు భర్తీకాక ప్రైవేటు యాజమాన్యాలు ముఖాలు తేలవేశాయి. ప్రత్యేక తెలంగాణా నినాదం రానురాను మరింత గట్టిగా వినిపిస్తుంది. తెలంగాణాలో ఉన్న తెలంగాణేతర ఉద్యోగులను ఉపసంహరించాలనే ఉద్యమాల ఒత్తిడి, రాజకీయ ఒత్తిడి పుంజుకొంది. ప్రైవేటుపాఠశాల బస్సు ఒకటి ప్రమాదానికిగురై పిల్లలు చనిపోవటంతో తల్లిదండ్రుల ఆందోళన సహజంగానే ఎక్కు వైంది. కల్తీమద్యం తాగి కొంతమంది చనిపోవటంతో, వ్యవహారం వీధినపడింది. సరే, కాంగ్రెస్‌లెజిస్లేచర్‌పార్టీ నాయడుకు రాజశేఖరరెడ్డి పాదయాత్రకు వచ్చిన అపూర్వ స్పందన తెలుగుదేశం పార్టీలో పుట్టించిన ప్రకంపనలతో పాటు గ్రామాల్లో పేరుకొన్న వేలాది అపరిష్కృత సమస్యలు పత్రికలకెక్కి ప్రభుత్వ ప్రచారంలో బండారాన్ని ఎండగట్టింది. దీనికి జవాబుగా అన్నట్లు తిరుపతి తిరునాళ్ళ సందర్భంలో కోటివరాలను ప్రకటిస్తే, దానికి స్పందనగా అన్నట్లు 19వ విడత జన్మభూమిలో 50 లక్షల విన్నపాలు వచ్చాయి. వాటిని లెక్కపెట్టడమే, సమస్యలవారిగా విభజించటమే ఒక పెద్దసమస్యగా మారింది. నీటిసమస్య ఇదివరకు అంతర్రాష్ట్ర సమస్యగానే వుండగా, ఇపుడు ఈ ప్రభుత్వ పరిపాలనలో అంతర్‌జిల్లాల వివాదాలుగా విస్తరించింది.

పైన ఉదహరించిన ఏ ఒక్క సమస్యా ప్రతిపక్షాలు సృష్టించినది కాదు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వయంత్రాంగం అసమర్థత, అవినీతి, లంచగొండితనం సృష్టించిన సమస్యే.

ఆర్థికంగా చూస్తే పిట్టనుకొట్టు, పొయ్యిలో పెట్టు అన్నట్లుంది. బడ్జెట్ లోటు-ద్రవ్యలోటు షరామామూలే. ప్రణాళికా కేటాయింపు గురించి ఇల్లెక్కి కూసేటంత గొప్పగా ఏమీలేదు. వ్యవస్థాగత సర్దుబాటురుణం ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చే సూచనల్లేవు. కొన్ని పథకాలకు కేంద్రం వాటాకే ఖర్చును పరిమితం చేయవలసివస్తుంది. ఇదివరకిచ్చిన సొమ్ముకు లెక్కలు చెబితేకాని ఈ సంవత్సరం నిధులు విడుదల కావాలంటుంది కేంద్రం. ఏం చేయాలో తెలియక తలపట్టుక్కూర్చోవలసిన పరిస్థితి.

ఇన్ని సమస్యలను సృష్టించుకోవటంలో మన ముఖ్యమంత్రే దేశంలో ఫస్ట్. ఈమధ్య ముఖ్యమంత్రి అధికారులమీద తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. పార్టీ అనుయాయులను హెచ్చరిస్తున్నారు. చిక్కుల ముడుల్లో చిక్కుకు పోయినవారి స్పందన ఇది; దారీతెన్నూ తోచక తన తప్పులను ఇతరుల నెత్తిన రుద్దేవారి మనఃస్థితి; తన పాచికలు పారక, ఏమిచేయాలిఅని తలపట్టుకున్నవారి స్థితి ఇది; ప్రజలను పక్కనపెట్టి, హైటెక్కే శరణ్యమనుకొన్నవారి దుస్థితిఇది.

ఈమధ్య సెక్రటేరియట్‌లో రెండు చెట్లు కూలిపోయాయి. ఇది రేపటి సాధారణ ఎన్నికల్లో జరగనున్న పరిణామానికి సూచన కాదుకదా.

స్థూల రాష్ట్రాదాయంలో రెవెన్యూ పద్దుకింద ఆదాయ, వ్యయాల శాతం

	రాష్ట్ర సొంత పన్ను	రాష్ట్ర సొంత పన్నేతర	రాష్ట్ర పన్ను, పన్నేతర	కేంద్రం నుండి ఆదాయం	మొత్తం రెవెన్యూ ఆదాయం	మొత్తం రెవెన్యూ ఖర్చు	పెట్టుబడి ఖర్చు	మొత్తం ఖర్చు
1980-81	7.11	2.72	9.83	5.61	15.44	14.17	3.03	17.20
1981-82	7.00	2.62	4.98	14.60	13.81	2.56	2.56	16.37
1982-83	7.45	2.40	9.85	5.26	15.12	13.89	2.24	16.14
1983-84	7.68	2.46	10.15	5.40	15.55	16.25	2.43	18.69
1984-85	8.64	2.74	11.38	5.52	16.90	18.14	2.65	20.79
1985-86	9.42	2.56	11.98	6.18	18.17	19.78	2.87	22.65
1986-87	9.51	2.48	11.98	6.65	18.63	17.55		
1987-88	9.28	2.57	11.85	5.89	17.74	17.55		
1988-89	8.58	3.33	11.91	5.39	17.30	17.17		
1989-90	8.43	2.53	10.96	4.87	15.83	16.17		
1990-91	7.94	2.33	10.27	5.77	16.04	16.51		
1991-92	7.51	2.41	9.93	5.52	15.45	15.87		
1992-93	7.63	2.43	10.06	5.85	15.92	16.20	1.81	
1993-94	6.62	2.34	8.96	5.30	14.26	13.86	2.36	
1994-95	6.13	2.22	8.35	4.39	12.75	13.80	2.79	
1995-96	5.16	2.01	7.17	5.20	12.37	13.29	3.03	
1996-97	5.42	1.80	7.22	5.20	12.42	15.97	0.15	
1997-98	7.43	1.87	9.29	5.16	14.45	15.18	1.13	
1998-99	6.93	1.61	8.53	3.87	12.41	14.74	1.21	
1999-00	7.28	1.97	9.25	4.33	13.58	14.58	1.61	
2000-01	7.58	1.97	9.56	4.44	14.00	16.35	1.67	
2001-02	7.70	1.94	9.64	4.91	14.55	16.47	2.02	

ఆధారం: బడ్జెట్–ఇన్ బ్రీఫ్, రాష్ట్ర అర్థ, గణాంక శాఖ

కీలక మౌలిక సౌకర్యాలపై పెట్టుబడి ఖర్చు ధోరణుల శాతం

	పెట్టుబడి ఖర్చులో శాతం				స్థూల రాష్ట్రాదాయంలో శాతం				
	విద్యుచ్ఛక్తి	నీటిపారుదల వరదనివారణ	ఇందులో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు	రవాణా (రహదారులు వంతెనలతో సహా)	విద్యుచ్ఛక్తి	నీటిపారుదల వరదనివారణ	ఇందులో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు	రవాణా (రహదారులు వంతెనలతో సహా)	పెట్టుబడి ఖర్చు
1980-81	9.71	58.60	51.93	9.54	0.29	1.77	1.57	0.29	3.03
1981-82	12.50	57.21	50.74	8.99	0.32	1.47	1.30	0.23	2.56
1982-83	11.03	64.08	55.61	8.08	0.25	1.44	1.25	0.18	2.24
1983-84	12.61	53.39	46.45	7.86	0.31	1.30	1.13	0.19	2.43
1984-85	7.98	60.06	51.11	7.26	0.21	1.59	1.36	0.19	2.65
1985-86	2.35	62.80	53.22	8.81	0.06	1.56	1.32	0.22	2.48
1986-87	3.32	63.18	55.01	7.94	0.10	1.81	1.58	0.23	2.87
1987-88	3.29	70.45	61.71	5.58	0.07	1.49	1.30	0.12	2.11
1988-89	2.97	68.21	57.88	7.22	0.06	1.38	1.17	0.15	2.02
1989-90	2.24	70.18	60.62	5.31	0.04	1.12	0.97	0.08	1.59
1990-91	2.24	66.19	54.03	7.24	0.03	0.92	0.75	0.10	1.39
1991-92	-25.98	88.96	67.11	8.85	-0.27	0.92	0.69	0.09	1.03
1992-93	1.47	63.42	41.29	13.00	0.03	1.15	0.75	0.24	1.81
1993-94	3.63	57.30	40.89	16.61	0.09	1.35	0.97	0.39	2.36
1994-95	49.81	38.41	31.52	7.23	1.39	1.07	0.88	0.20	2.79
1995-96	57.77	26.21	22.30	7.79	1.75	0.80	0.68	0.24	3.03
1996-97	-690.64	483.65	418.45	149.28	-1.01	0.70	0.61	0.22	0.15
1997-98	2.91	67.90	57.65	9.33	0.03	0.77	0.65	0.11	1.13
1998-99	1.28	58.03	45.63	18.86	0.02	0.70	0.55	0.23	1.21
1999-00	8.88	54.13	45.64	17.39	0.14	0.86	0.73	0.28	1.59
2000-01	1.95	47.32	39.47	33.61	0.03	0.79	0.66	0.56	1.67
2001-02	0.72	36.99	30.41	24.56	0.01	0.76	0.63	0.51	2.06
2002-03(RE)	0.52	38.56	33.16	24.92					

ఆధారం: మూడవ పట్టిక ఆధారాలే

అనివార్య కారణాల వల్ల రెండు సంచికలు (ఆగస్టు 15-31, సెప్టెంబరు 1-15) కలిపి ఒకే సంచికగా అందించడం వల్ల పాఠకులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నాము - ఎడిటర్

న్యాయస్థానాలు కుటుంబ గుత్తసంస్థలా?

చట్టాలు ఉల్లంఘించినవారు నేరస్థులు. తప్పుచేస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టేదిలేదని ముఖ్యమంత్రి అంటూంటారు. అలా ఉల్లంఘించినవారిని కోర్టు శిక్షిస్తుంది. కాని కోర్టులో జడ్జీలే నేరస్థులైతే? ముందు ఈ సమాచారాన్ని వినండి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఏ న్యాయాధికారి అయినా తన బంధువైతే అదే కోర్టులో ఆ అడ్వకేటు ప్రాక్టీస్ చేయకూడదు. ఆ బంధువుల పట్టికలో 21 రకాల బంధువులున్నారు (భార్య, కొడుకు, తండ్రి వగైరా). ఈ నిబంధనను ఉల్లంఘించి, నేరుగా రాజధాని నగరం ఢిల్లీలోని హైకోర్టులోనే ఏడుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు వారి తండ్రులు జడ్జీలుగా వుండగానే పనిచేస్తున్నారు. అయిదుగురు జడ్జీల సోదరులు పనిచేస్తున్నారు. ఎక్కువలో ఎక్కువగా కర్నాటక రాష్ట్రంలో 17 జడ్జీల బంధువులు ఆకోర్టుల్లోనే కేసులు వాదిస్తున్నారు. అసలు ఈ విషయాన్ని మన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుడు సి. రామచంద్రయ్య పార్లమెంట్‌లో లేవనెత్తారు. వివరాలడిగితే బార్ కౌన్సిల్ పై పట్టికను పార్లమెంటుకు అందచేసింది. దీనిమీద న్యాయశాఖమంత్రి అరుణ్ జైట్లీ నేరుగా జవాబివ్వకుండా ఏదోచెప్పి తప్పించుకున్నారు. ఈ జడ్జీలను రెండునెలల్లో మరోచోటకు బదిలీచేయకపోతే, వారి అడ్వకేట్ బంధువులమీద చర్యతీసుకుంటామని బార్ కౌన్సిల్ హెచ్చరించింది.

జడ్జీలు ఇటీవల వార్తల్లోకి ఎక్కుతున్నారు. లంచగొండితనానికి సంబంధించిన ఆరోపణలకు, సెక్స్‌పరమైన ఆరోపణలకు గురవుతున్నారు. వారు న్యాయం చేస్తారనే విషయంలో ప్రజలకు విశ్వాసం సడలిపోయింది. ఇపుడు బంధుప్రీతి కూడా తోడైంది. రాజకీయ నాయకుల మీద వస్తున్న ఆరోపణలే జడ్జీలమీద కూడా వస్తున్నాయి. బ్యూరోక్రసీమీద విశ్వాసం ఎపుడూలేదు. పార్లమెంటులో, శాసనసభలో అసాంఘిక శక్తులు ప్రవేశించాయి. అయినా మన డెమోక్రసీ క్షేమంగానే ఉందంటున్నారు.

* * * *

భారతదేశంలో కంపెనీలు విదేశీ కంపెనీలకు డబ్బు ఏమైనా చెల్లించాల్సివస్తే, డాలర్లలోచెల్లించాలి. కాని అమెరికాకు, బహుళజాతి సంస్థలకు గులాంగిరీ చేస్తున్న వాజ్‌పేయి ప్రభుత్వం ఈ నిబంధనను మార్చి, డాలర్లలో చెల్లించనక్కర్లేకుండా ఆ విదేశీ కంపెనీలకు తమ తమ కంపెనీల్లో షేర్లు ఇవ్వటం ద్వారా చెల్లింపులు చేయవచ్చునని నిర్ణయించింది. అంటే మనదేశంలోని కంపెనీల్లో వాళ్ళకు వాటా ఇవ్వటం జరుగుతుంది. ఇప్పటికే విదేశీ కంపెనీలకు మన కంపెనీల్లో 40 శాతం ఈక్విటీ ఇవ్వటంతో ప్రారంభించి, కొన్ని కంపెనీల్లో నూరుశాతం వరకూ వాటా పెంచుకుంటూ వచ్చింది. ఇపుడు మరో అడుగు ముందుకు వేసింది. ఈ లెక్కన మొత్తం దేశాన్నే వాళ్ళకు అమ్మేసేరోజు ఎంతో దూరంలో లేదు. స్వదేశీ స్వదేశీ అనే నినాదం ఇచ్చి ఎన్నికల్లో గెలిచి ఇపుడు విదేశీ జపంచేసే కాషాయ ప్రభుత్వంగా మారింది. ఇలాంటి ప్రభుత్వాలను ఏం చేసినా పాపంలేదు.

* * * *

కరువొచ్చింది, పంటలు పండలలేదు, రైతు నడ్డి విరిగింది, గ్రామాలు ఎండుపుల్లలయ్యాయి, తాగటానికి నీరులేదు, జనాలు పొట్టపట్టుకొని పట్టణాలకు తరలిపోతున్నారు. కాని పారిశ్రామిక వేత్తలకు ఆ గాలికూడా సోకలేదు. రెండు చేతులతో లాభాలు చేసుకొన్నాయి. నడుస్తున్న సంవత్సరంలో కూడా టింగురంగా అంటూ ఆనందంలో ఎగిరి గంతులు వేస్తున్నాయి. ఎకనామిక్ టైమ్స్ పత్రిక 43 రకాల పరిశ్రమలు ఈ సంవత్సరం మొదటి మూడునెలల కాలంలో ఎలా పనిచేశాయని వారి ఎకౌంట్లను పరిశీలించింది. గత సంవత్సరం జూన్ నాటితో పోల్చిచూస్తే ఈ జూన్ నాటికి వాళ్ళ అమ్మకాలు 12.2 శాతం మాత్రమే పెరగగా, వారి నికర లాభాలు 39.4 శాతం పెరిగాయి. వడ్డీ చెల్లింపులు 8.1 శాతం తగ్గాయి. కాని ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు మాత్రం 26.4 శాతం తగ్గాయి. అంకెల్లో చూస్తే చెల్లించిన పన్నులు రూ.8514 కోట్ల నుంచి రూ.6268 కోట్లకు తగ్గిపోయాయి. ప్రభుత్వ ఖజానాకు చిల్లులు పొడుస్తున్నదెవరో ఈ గుణాంకాలు తెలియజేస్తున్నాయి. అయినా వారే ప్రభుత్వానికి దగ్గర చుట్టాలు.

* * * *

నూరుకోట్ల జనాభాగల భారతదేశంలో కాంగ్రెస్‌పార్టీకి నాయకుడే దొరక్క విదేశీ వనిత సోనియాను తెచ్చుకొన్నారని ముఖ్యమంత్రి విమర్శ. ఈ వాదననే బిజెపి నుంచి అరువుతెచ్చుకున్న ముఖ్యమంత్రి తనకింద నలుపును తానే ఎరుగని గురివింద గింజను గుర్తుకు తెస్తున్నారు. రాష్ట్రాన్ని విదేశీ రుణాలతో నడిపిస్తున్నది ముఖ్యమంత్రి. ప్రపంచ బ్యాంకు ఏ పథకాలను ఎలా అమలు చేయాలో చెపితే, తు.చ.తప్పకుండా అమలుచేస్తున్నది ముఖ్యమంత్రి. తన పరిపాలనా యంత్రాంగంలో సీనియర్ అధికారులను విశ్లేషించకుండా చాలా శాఖలకు విదేశీ, స్వదేశీ కన్సల్టెంట్లను నియమించింది ముఖ్యమంత్రి. ప్రభుత్వరంగ సంస్థలను ఎలా ప్రైవేటీకరించాలో తెలియక విదేశీసంస్థ డి.ఎఫ్.ఐ.డి.గ్రాంటుతో ఒకశాఖనే నడిపిస్తున్నది ముఖ్యమంత్రే. ప్రపంచ బ్యాంకు ఇస్తానన్న వ్యవస్థాగత సర్దుబాటు రుణం ఇవ్వనంటే గుడ్లు తేలేసింది ముఖ్యమంత్రి. ఆఖరుకు 2020 నాటికి అవతరిస్తుందని చెబుతున్న స్వర్ణాంధ్ర పథకాన్ని తయారుచేయడానికి దేశంలో ఆయనకు ఎవరూ దొరకలేదు. మెకన్సీ అనే విదేశీసంస్థను తెచ్చుకున్నది ముఖ్యమంత్రి. రాష్ట్ర

పారిశ్రామికాభివృద్ధికి తన రాష్ట్రంలో, తన దేశంలో పెట్టుబడి పెట్టేవారే దొరక్క, విదేశాలకు కాలికి బలపం కట్టుకున్నది ముఖ్యమంత్రి. విదేశీ నాయకులు వస్తే మర్యాదకు పరిపాలన బాగుంది అని అంటే (విమర్శిస్తే అది మన అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం అవుతుంది) ఆ సర్టిఫికెట్లు పట్టుకొని ప్రచారం చేయించుకునేది ముఖ్యమంత్రి. అలాంటి ముఖ్యమంత్రి, విదేశాలు భిక్షం వేస్తేతప్ప రోజు గడవలేని ముఖ్యమంత్రి అప్పు చేయనిదే అభివృద్ధి సాధ్యం కాదనే ముఖ్యమంత్రికి సోనియా విదేశీ పుట్టుకమీద విమర్శా?

* * * *

లంచగొండులు ఎంతటివారైనాసరే కఠినంగా శిక్షిస్తాం అంటారు ముఖ్యమంత్రి. కాని స్వయంగా ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో, కిందిస్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులు, స్థానిక తెలుగుదేశం నాయకులు తినేస్తున్నదెంతో మహానాయకుని దృష్టికి ఆయన చాలా ఇష్టపడే "ఈనాడు" పత్రిక (27-8-03) స్వయంగా అందజేసింది.

"19వ విడత జన్మభూమి సందర్భంగా జూలై 4న ముఖ్యమంత్రి ప్రకాశంజిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామ సభకు విచ్చేశారు. ఏర్పాట్లకు రూ. 2,81,917లు వ్యయమైనట్లు అధికారులు చూపారు". ఒకేఒక గ్రామంలో సభకు ఇంత ఖర్చు. ఇదికాక ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఖర్చు, కొన్ని వందల కార్ల పెట్రోలు ఖర్చులు అదనం.

'ఈనాడు' ఇంకా ఏం వ్రాసిందో చూడండి. "ఈ ఏడాది ఏప్రిల్ 12న చీమకుర్తి మండలం పల్లామల్లి 29వ తేదీన కనిగిరి, నందనవనంలో ముఖ్యమంత్రి పర్యటించారు. రెండు సభలకు రూ.28 లక్షలు ఖర్చయింది. ప్రజలను తీసుకొనిరావడానికి 250 ఆర్.టి.సి. బస్సులను ఏర్పాటుచేశారు. వాటికి రూ. 15.73ల అద్దె చెల్లించారు. కనిగిరిలో షామియానాల అద్దె రూ.2.82ల, కార్పెట్లకు రూ.57 వేలు, వేదిక అలంకరణకు రూ.42 వేలు, కుర్చీలు, పరదాలకు రూ.57 వేలు, రవాణాకు అరలక్ష చూపారు. నందనవనంలో ఏర్పాట్లకు రూ.1.31 లక్షలు, పల్లామల్లి సభకు రూ.3.13 లక్షలు వ్యయమైనట్లు బిల్లులు రూపొందించారు". ఇదంతా ప్రభుత్వ ఖజానా నుంచి చేసిన ఖర్చే. తనది కాకపోతే తాటిమట్టకు ఎదురు దేకమన్నాడట. ప్రభుత్వ ఖర్చులు తగ్గించుకోమని ఆడిటర్ జనరల్ ప్రతి వార్షిక నివేదికలో హెచ్చరిస్తున్నారు. కాని ముఖ్యమంత్రి నోట ఎప్పుడైనా, ఒక్కసారైనా, ఖర్చు తగ్గించుకోమని పరిపాలన వ్యవస్థను హెచ్చరించిన దాఖలాలులేవు. ఎందుచేతనో పైవార్తే తెలియచేస్తుంది.

* * *

మన పాలకులకు, పారిశ్రామికవేత్తలకు వాళ్ళు కష్టాల్లో వున్నపుడే వ్యవసాయం గుర్తుకు వస్తుంది. దేశంలో వర్షాలులేక రైతు అల్లల్లాడిపోతుంటే, అయ్యో వ్యవసాయదారుడికి సాయంచేసి గట్టెక్కిద్దాం అనే ఆలోచన వారికి తట్టలేదు. ఇప్పుడు మంచి వర్షాలు పడి, పరిశ్రమలకు మళ్ళీ మంచిరోజులొస్తున్నాయని వ్యవసాయానికి హారతులు పడుతున్నారు. పదవ ప్రణాళిక ఎనిమిది శాతం అభివృద్ధి సాధించాలంటే, వ్యవసాయాభివృద్ధిని గణనీయంగా పెంచాలి" అని ప్రణాళికా సంఘం అంటోంది. వ్యవసాయం పుంజుకొంటుంటే పారిశ్రామికవేత్తల కళ్ళు మిలమిలలాడుతున్నాయి. పరిశ్రమలు జోరందుకున్న తర్వాత చూడండి, వ్యవసాయం ఊసెత్తితే ఒట్టు. రాష్ట్రంలో ముఖ్యమంత్రికి వ్యవసాయం ఇప్పుడు గుర్తొచ్చింది. పలుగేమిటి, పారేమిటి, దున్నడమేమిటి అని పాఠాలు నేర్చుకోమని తన పార్టీ శ్రేణులకు సుద్దులు చెబుతున్నారు. హైటెక్ మాటల్ని కాసేపు పక్కన పెట్టారు. ఎన్నికలైపోనివ్వండి, పొరపాటునో, గ్రహపాటునో ఈయనే మళ్ళీ ముఖ్యమంత్రి అయితే, వ్యవసాయం మళ్ళీ అటకెక్కుతుంది. పాలకులు ఇపుడు వ్యవసాయాన్ని, పరిశ్రమల్ని రెండింటినీ మరిచిపోయారు. అంతా సేవారంగం మీద బండి నడుస్తుంది. ఇది పునాదుల్లేకుండా భవనం కట్టడం లాంటిది. ఇది ప్రధానంగా వ్యవసాయ దేశమని ఎద్దును ముల్లుకర్రపెట్టి పొడుస్తున్నట్లు ఈ ప్రభుత్వాన్ని పొడుస్తుండాలి. రైతును మర్చిపోతే ఏ ప్రభుత్వమూ నిలవదు.

* * *

ముంబైలో మొన్న జరిగిన దుర్ఘటనకు అంతకుముందు గుజరాత్‌లోని అక్షరధామ్‌హింసాకాండకు పథకాలు హైదరాబాద్‌లోనే రచించబడ్డాయని ముంబై నుంచి వార్తలు పత్రికల్లో వచ్చాయి. మరి మన ఇంటెలిజెన్స్ ఏం చేస్తున్నట్లు? ఇది మన రాష్ట్రానికే తలవంపులు తెచ్చే పరిణామం. రాష్ట్రంలో నక్సలైట్లను ఏరిపారవేయటంలో మాత్రం ఘనాపాటీలు. ఇలా ఎన్‌కౌంటర్‌లో చనిపోతారో లేదో, అలా వారి పేరు, ఊరు, వాళ్ళు ఎవరెవరిని చంపారు, ఎన్ని కేసులున్నాయి అన్నీ గడగడా పాఠం అప్పచేప్పేస్తారే? మన వేగుల వాళ్ళు అంత ఘటికులైతే, ముంబై, అక్షరధామ్ సంఘటనల విషయంలో వారి ఇంటెలిజెన్స్ ఎందుకు పనిచేయలేదు? పోలీసులు అడవుల్లో కూంబింగ్ చేస్తుండగా నక్సలైట్లు తారసపడ్డట్లు, కాల్పులు జరిపినట్లు, పోలీసుల ఎదురుకాల్పుల్లో ఫలానా నక్సలైట్ చనిపోయినట్లు పోలీసుశాఖ ప్రకటనలు తప్పుడు ప్రకటనలని, ఇళ్ళల్లో నుంచి తీసుకొనివెళ్ళి కాల్చిచంపేశారనే కథనాలు పత్రికల్లో చదువుతున్నాం. అవి నిజమేనని అనిపిస్తుంది. ఎందుచేతనంటే అంత ఇంటెలిజెన్స్ శక్తి వుండివుంటే, ముంబై, అక్షరధామ్ పథకాలను వేసినవారిని పట్టుకొని వుండేవారు. ఆ ఘటనలు జరగకపోయి వుండేవి. పదుల కొద్దీ ప్రాణాలు పోయివుండేవి కావు. హైదరాబాద్‌లో పథకాలు తయారయ్యాయి అనేది పుకారు కాదు, అక్కడి ఇంటెలిజెన్స్ వర్గాలు చెపుతున్న విషయం. ○

సెక్యులరిజాన్ని గోదాట్లో ముంచిన ముఖ్యమంత్రి

— ఎన్. ఇన్నయ్య

ప్రజలలో అనేక మతవిశ్వాసాలున్నాయి. అందులో పుష్కరాలు కూడా ఒకమూఢనమ్మకమే. ఇది చిరకాలంగావస్తున్న ఆచారంకూడా.

2003లో గోదావరి పుష్కరాలు హఠాత్తుగా రాలేదు. కొత్తగా ప్రారంభం కాలేదు.

కాని, గోదావరి పుష్కరాల పట్ల రాష్ట్రప్రభుత్వం చూపిన శ్రద్ధ, ప్రత్యేక ప్రచారం, భక్తి ప్రదర్శన అనూహ్యంగా కనిపించాయి. ఆ విషయం గమనార్హం.

పుక్కిటి గాధలు

పుష్కరుడు చరిత్ర కాదు, పుక్కిటి గాధ. సింహరాశి అనేది వాస్తవం కాదు. నమ్మకంతో ఊహించిన జ్యోతిష్య సృష్టి. మతపరంగా వచ్చిన యీ అంధ విశ్వాసానికి గట్టి పునాదులు వేసి, పురోహితవర్గం వ్యాపారం చేసుకుంటున్నది. హిందూ నమ్మకస్తులను మానసికంగా నిర్వీర్యులను చేసే రీతులలో ఇదొకటి. ఇలాంటి వాటిలో ఆధారాలు, రుజువులుఉండవు. చదువుకున్నవారు ఈవిషయంలో మినహాయింపు కాదు. హిందూత్వంలో యివన్నీ సంస్కృతి పేరిట నడుస్తున్న తతంగాలే.

దేశంలోని ప్రజలలో ఈ గుడ్డినమ్మకాలను పోగొట్టి, వైజ్ఞానిక దృష్టితో నడిపించాలని ప్రభుత్వాలు ఉద్దేశించాయి. రాజ్యాంగంలో ప్రాథమికహక్కు(51-ఎ)లో శాస్త్రీయ దృష్టికోసం కృషిచేయాలన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వం వివిధ సందర్భాలలో అసెంబ్లీలోనూ, బయటా కూడా తమది సెక్యులర్ అని చాటుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టంగా సెక్యులర్ రీతుల్ని ప్రకటించుకున్నారు. అంతవరకు సంతోషించదగిన సంగతే.

హిందూత్వం కోసం కంకణం కట్టుకున్న భారతీయ జనతాపార్టీ చేతులు కలిపిన తెలుగుదేశం, ఒక్క మతవిషయంలో సెక్యులర్‌గా వుంటానంటే, హేతువాదులు, మానవవాదులు సంతోషించారు. కాని ఆచరణలో అది కనబడలేదు.

ఇక్కడ ఒక తిరకాసు ఉంది.

సెక్యులరిజం అంటే?

సెక్యులరిజం అంటే అన్నిమతాలకూ ప్రభుత్వం సమాన దూరంగా వుంటూ, ఏ మతాన్నీ వెనకేసుకురాకుండా, కేవలం వ్యక్తిగత నమ్మకంగా మతాన్ని చూడడమే అసలైన సెక్యులరిజం.

తెలుగుదేశం ప్రభుత్వం సెక్యులరిజం పేరిట అన్ని మతాచారాలను అధికార ముద్రతో పాటించడం కొత్త వింతగా వుంది. అది మతరాజ్యం అవుతుందే గాని, సెక్యులర్ ప్రభుత్వం కాజాలదు.

వెనక్కు నడిపించడం

పుష్కరాలలో ప్రజలతో కలిసి గోదావరి నీళ్ళలో మునగడం వలన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలుగుదేశ ప్రభుత్వ మంత్రులు, అధికారులు-సెక్యులర్ వ్యతిరేక విధానాలను అవలంబించారు. బి.జె.పి. హిందూత్వానికి దగ్గరగా జరగడంతో మత నమ్మకస్తులలో దీనివలన వారికి ప్రచారం లభించి వుండవచ్చు. కాని దీర్ఘకాలికంగా యివన్నీ దుష్ట సంప్రదాయాలే. ప్రజల్ని వెనక్కు నడిపించే తీరుతెన్నులే. పుష్కరాలకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించడం ఒక ఎత్తు. వాటి ఖర్చులను ప్రభుత్వమే భరించడం తప్పు. అవి మత విశ్వాసం గలవారు భరించవలసిన ఖర్చులు. అలాగే టూరిజం పెంపొందించడం ఒక ఎత్తు. అది మత ప్రచారానికి వినియోగించడం మరొకతీరు. గోదావరి పుష్కరాల సందర్భంగా తెలుగుదేశం ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యాన మత మూఢ నమ్మకాలకు దిమిసె కొట్టింది.

జన్మభూమి హామీ ఏమైంది?

మూఢ నమ్మకాలు పోగొట్టి శాస్త్రీయ పద్ధతులు ప్రజలలో ప్రచారం చేయడానికి జన్మభూమి కార్యక్రమాలు వినియోగిస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. అందుకు విరుద్ధంగా గోదావరి పుష్కరాలలో ప్రవర్తించింది.

వ్యక్తిగత హోదాలో చంద్రబాబునాయుడు, కందా మోహన్, బర్నాలా, ప్రధాన న్యాయమూర్తి గోదావరి పుష్కరాలలో పాల్గొనే హక్కును ఎవరూ కాదనరు. అది ప్రభుత్వ బాధ్యతగా మార్చడం, కేవలం పునర్వికాసానికి, పురోభివృద్ధికి వ్యతిరేకంగా నడవడమే.

ప్రజలకు ప్రశ్నించడం నేర్పాలి. తెలియని విషయాలు తెలియజెప్పాలి. గుడ్డి నమ్మకాలు అడ్డొస్తుంటే ఆపాలి. అలా చేయాల్సిన ప్రభుత్వం, ప్రజల్ని ఇంకా మభ్యపెట్టి, అజ్ఞానాన్ని అట్టిపెట్టి, అదే గొప్ప విషయంగా చాటుకోవడం దారుణం.

ప్రతిపక్షాల పాత్ర

అధికార పార్టీ చేస్తున్న గోదావరి పుష్కర ప్రచారం సెక్యులర్ వ్యతిరేకమని కాంగ్రెస్, తెలంగాణా రాష్ట్ర సమితి, చివరకు నక్సలైట్ పార్టీలు సైతం అనకపోవడం గమనించాల్సిన అంశం.

మతం మత్తుమందు అనీ, మత విమర్శలో ప్రారంభించాలనే విషయాన్ని వామపక్షాలు మరచిపోవడం మామూలు విషయంకాదు.

తెలుగుదేశ ప్రభుత్వం మతపరంగా యాంటి సెక్యులర్ అనేది ఆచరణలో రుజువైంది. అందుకు గోదావరి పుష్కరాలు పరాకాష్ట. అంతకుముందు యిలాంటివి చాలా వున్నాయి.

ముస్లింలను మతపరంగానూ, అల్పసంఖ్యాక వర్గాలుగానూ అనుకూలం చేసుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యాన తెలుగుదేశ ప్రభుత్వం అధికారికంగా ఆర్థిక సహాయాన్ని మతానికి యిచ్చింది. నమాజ్‌లకు వెళ్ళి ముస్లిం టోపీ ధరించడం కూడా వారిని మతపరంగా సంతృప్తిపరచడానికే. మైనారిటీలుగా

చూడడం, రక్షణ కల్పించడం వేరు. మతాన్ని వెనకేసుక రావడంవేరు. అదే తప్పు ముఖ్యమంత్రి, తెలుగుదేశంప్రభుత్వం ఇప్పుడు చేస్తున్నది.

క్రైస్తవులు స్వస్థతకూటమి పెట్టి, మూఢవిశ్వాసాలపేరిట, రోగాలు ప్రార్థనలతో నయం చేస్తామని అమాయకులను ఆకట్టుకుంటుంటే ముఖ్యమంత్రి అధికారికంగా అక్కడకు వెళ్ళారు. ఫలితం ఏమైంది? క్రైస్తవులు అదే సమయం అనుకొని వారి దేవాలయాలను మరమ్మత్తు చేసుకోవడానికి ప్రభుత్వ నిధులడిగారు.

అల్పసంఖ్యాక మతాలకు ప్రోత్సాహం ఇస్తూ, అధిక సంఖ్యాక మత ఉత్సవాలను, జాతరలను, బోనాల పండుగలను, తిరుమలలో, భద్రాద్రిలో దేవాలయ ఉత్సవాలలో అధికారికంగా పాల్గొంటున్నారు.

మతాన్ని ప్రభుత్వంలోకి

చివరకు మతపరమైన స్వామీజీలు సెక్రటేరియట్‌కు వచ్చే పరిస్థితి కల్పించారు. శివశంకర్ అనే స్వామిని మానసిక శాంతి శిక్షణఇచ్చే నెపంతో ముఖ్యమంత్రి కార్యక్రమాలు చేబట్టారు. బ్రహ్మకుమారీల కార్యక్రమాలను ఆఫీసులో అనుమతిస్తూ 30 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ముఖ్యమంత్రి మతధోరణి ఆసరాగాతీసుకొని, దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇటీవల విశ్వనాథ్‌జీ అనే స్వామి యజ్ఞానికి అధికారిక మద్దతు ఇచ్చింది. అది దుర్వినియోగపు గొడవకాగా, ఆపేశారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలుగుదేశం ప్రభుత్వం అమలుపెడుతున్న మత విధానమే. ఇందులో సెక్యులరిజం లేదు.

లోగడ కాంగ్రెసుప్రభుత్వాలు చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా వుండగా, ఇళ్ళల్లో జరిగే గణేష్ పండుగను వీధుల్లోకి తెచ్చారు. విజయభాస్కర రెడ్డి ముఖ్యమంత్రిగా దిగంబర మాతల దర్శనం మొదలు అన్ని మొక్కులూ పాటించారు. పుట్టపర్తి సాయిబాబాకు సూపర్‌బాబా స్థాయి కల్పించడంలో ప్రభుత్వాలు పోటీపడ్డాయి. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పి.వి.నరసింహారావు ప్రభుత్వాలలో సెక్యులరిజం బాగాహరించిపోయింది. ధీరేంద్రబ్రహ్మచారి, చంద్రస్వామి మొదలైన వారు ఇష్టారాజ్యాన్ని నడిపారు.

నేడు ప్రభుత్వాలు కావాలని మతగురువుల్ని రాజకీయాల్లోకి తెస్తున్నారు. జయేంద్ర సరస్వతి దగ్గరకు ఫెర్నాండెజ్, సోనియాగాంధీ, వాజ్‌పాయిలు వెళ్ళారు. మతం-రాజకీయం వేరుగావుంటూ, కేవలం వ్యక్తిగత విశ్వాసంగా వుండాల్సిన మతం ఇప్పుడు కీలక స్థానంలోకి వచ్చింది. ఇదంతా సెక్యులర్ వ్యవస్థకు ప్రమాదం. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పాత్ర ఇటీవల గోదావరి పుష్కరాలలో చాలా చౌకబారు ప్రజాకర్షణరీతులలో సాగింది. ఎన్నికలలో తాత్కాలికప్రయోజనాలకు ఇది అక్కరకు రావచ్చు గాని, ప్రజోపయోగం ఇందులో లేదు. తెలుగుదేశం ప్రభుత్వం పుష్కరాల విషయమై ప్రజలకు చెప్పాల్సిన విద్య ఏమాత్రం చెప్పలేదు.

పిల్లలకు శాస్త్రీయ పంథా నేర్పాల్సిన ప్రభుత్వం, పుష్కరాలలో ఆ పనిచేయలేకపోయింది. కనీసం ఇకముందైనా ఈ మతప్రచారాలు ఆపి, వాటిని వ్యక్తిగత విశ్వాసాలుగా భావించాలి.

గాంధీజీ ఏమన్నారు?

గాంధీజీ సైతం చివరిదశలో (1947) మతాన్ని-రాజ్యాన్ని వేరుచేయాలని చెప్పారు, హరిజన్ పత్రికలో రాశారు. అది గొప్ప విషయం. గాంధీజీపేరిట భజనచేసేవారు ఆయన చెప్పిన సెక్యులరిజాన్ని పాటిస్తే ఎంత బాగుంటుంది.

చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన "పుష్కరాల ప్రభుత్వ పాత్ర" విషవలయానికి దారితీస్తుంది. ప్రతి పండగకూ, ప్రతి మూఢ నమ్మకానికీ ప్రభుత్వం మద్దతు కోరే అవకాశం ఇచ్చారు. మతం పేరిట జరిగే ఖర్చులకు మినహాయింపులు అడిగే హక్కు కల్పిస్తున్నారు. మతాన్ని ఎంతవెనకేసుకొస్తే అంత మభ్యపెట్టవచ్చుననే ధోరణి ప్రభుత్వాలకు సూచిస్తున్నారు. ఇది యాంటి సెక్యులరిజం.

ఎన్.టి.రామారావు తెలుగుదేశం ప్రభుత్వాధినేతగా యాంటి సెక్యులర్ పాలసీని బాహాటంగా ఆరంభించారు. ఈ విషయంలో ఆయన కాంగ్రెస్‌కు మించిపోయారు. తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్యాన్ని ఒక కోర్సుగా పెట్టించి, విద్యారంగంలో ద్రోహంచేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఇంకెంతో ముందుకు పోయి, వాస్తు ప్రకారం సెక్రటేరియట్ స్థాయిలో మార్పులు చేసేవరకూ పోయారు. ఈ ధోరణికి తుది మెరుగులు దిద్దడమే పుష్కరాలలో చేసిన పని. ఇందులో హైటెక్ ధోరణి ఏమీలేదు. ప్రభుత్వాధికారాన్ని యాంటి సెక్యులర్ విధానాలకు ఏమేరకు దుర్వినియోగం చేయవచ్చు అనేది పుష్కరాలలో స్పష్టపడింది.

దేశంలో సెక్యులరిజం బాగా దెబ్బతిన్నదని ఇటీవలే అమర్త్యసేన్ అనడం కూడా ఇలాంటి ప్రభుత్వాల ధోరణి గమనించే మరి!

ప్రభుత్వాధినేతలు ప్రజల్ని దారిమళ్ళించడం, సమస్యల్ని పరిష్కరించలేనప్పుడు ఆకర్షణీయనినాదాలతో కప్పిపుచ్చడం ఆనవాయితీగా వస్తున్నదే. ఇలాంటి ఉదాహరణలు చరిత్రనిండా వున్నాయి. ప్రజలు తిరగబడకుండా రామనాథ్‌రాజా, క్షత్రి జమీందార్లు రామకృష్ణ పరమ హంసను, వివేకానందను అడ్డం పెట్టుకున్నారు. దేవుడు లేకపోతే సృష్టించమన్నాడొక ఫ్రెంచి తాత్వికుడు.

మనదేశంలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు నేడు మతాన్ని తమ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి బాగా వాడుకుంటున్నాయి. చంద్రబాబునాయుడు అదేచేస్తున్నారు. అందుకే గోదావరిపుష్కరాలలో ఆయన్నుగాని, ఆయన ప్రభుత్వాన్ని గాని ప్రతిపక్షాలు సైతం ఏమీ అనకపోగా, ఇంకా బాగా చేయాల్సిందన్నారు. అంటే వారు అధికారానికి వచ్చినా ఇలాగే చేస్తారన్నమాట!

వర్షాలు లేకుంటే ప్రభుత్వమే పూనుకొని యజ్ఞాలు, పూజలు చేయించడం చంద్రబాబు హైటెక్ గవర్నమెంట్ చేయగలదు.

మూఢ నమ్మకాలు పోవాలనిరాసి, ప్రచారంచేసిన కందుకూరి వీరేశలింగం స్థలంలోనే తిరోగమన పలాయన వాదంలోకి పయనిస్తున్నాం.

గత రెండు దశాబ్దాల్లో రాష్ట్ర ఆర్థిక ధోరణులు

— ఎన్. శ్రీదేవి
రిసెర్చి అసిస్టెంట్, సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్, హైదరాబాద్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టడమే ఒకరకమైన అంగవైకల్యంతో పుట్టింది. వెనుకబడిన నైజాం సంస్థానంలో మరీ వెనుకబడిన తెలంగాణా జిల్లాలు, ఆంధ్ర ప్రాంతంలో కరువుకాటకాలకు నిలయమైన రాయలసీమ జిల్లాలు, మరోపక్క అంతే వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా-ఇది కేవలం భౌగోళిక చిత్రం మాత్రమే కాదు. ఆర్థిక చిత్రం కూడా. నాలుగు ధనవంతమైన సర్కారు జిల్లాలకు ఇన్ని వెనుకబడిన ప్రాంతాలు తోడైనపుడు పుట్టిన బిడ్డకు ఏర్పడిన బలహీనత, అపుడేకాదు, ఇప్పటికీ వెన్నాడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు వివిధ కమీషన్లు చేసిన అధ్యయనాల ప్రకారం ఏర్పడనున్న రాష్ట్రం బడ్జెట్‌రీత్యా తరుగు రాష్ట్రంగా ఉద్భవిస్తుందని జోస్యం చెప్పారు. ఎంత సాగదీసినా సాగని భూమిశిస్తు ఆదాయం, మద్యపాన నిషేధం వల్ల పోగొట్టుకున్న ఆదాయం, పరిశ్రమలు లేకపోవడం వల్ల నీరసంగా వున్న అమ్మకం పన్ను వసూళ్ళు-ఇవన్నీ ఆంధ్ర రాష్ట్రం లోటు రాష్ట్రం ఏర్పడటానికి కారణాలయ్యాయి.

అరవయ్యవ దశకంతో పోల్చిచూసుకుంటే 70వ దశకంలో రాష్ట్ర సొంత ఆదాయం పెరుగుదల రేటు 12.27 శాతం నుండి 14.92 శాతానికి పెరిగింది. అదేసమయంలో రెవెన్యూపద్దుకింద ఖర్చు 13.73 శాతం నుంచి 13.89 శాతం వరకు మాత్రమే మార్జినల్‌గా పెరగటంవల్ల మిగులు బడ్జెట్లు ఏర్పడటమే కాక, ఆ మిగుళ్ళను పెట్టుబడి పద్దుకింద ఖర్చుచేసి ఆస్తుల సృష్టికి తోడ్పడింది. అందుకనే పెట్టుబడి ఖర్చు కేవలం 3.68 శాతం వుండగా, అది 70వదశకంలో 28శాతానికి పెరిగింది. 1982- 83 వరకూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆరోగ్యంగానే వుండింది. అయితే 80, 90వ దశకాల్లో కథ అడ్డం తిరిగింది. రెవెన్యూ పద్దుకింద లోటు పెరగటం మొదలు కావటంతో పెట్టుబడి పద్దుకింద ఆదాయాన్ని అంటే అభివృద్ధి కోసం ఖర్చు పెట్టాల్సిన నిధులను ఈ లోటు పూడ్చటానికి వినియోగించటం ప్రారంభమైంది. సంక్షేమ పథకాల ఖర్చు, రెండు రూపాయలకు కిలో బియ్యంపథకం అమలు, జీతభత్యాల పెరుగుదల వంటి పద్దుల కింద ఖర్చు పెరగటం వల్ల, మద్యనిషేధంలో ఆదాయం తగ్గటంవల్ల లోటు పెరిగిందని చెప్పబడింది. రుణాల ఊబిలో అడుగుపెట్టింది.

రెవెన్యూ ఆదాయ ధోరణులు

90వ దశకం ఉత్తరార్థ భాగంలో స్థూల రాష్ట్రాదాయంలో రెవెన్యూ పద్దుకింద ఆదాయ శాతం 1987-88 నుంచి అంతకు ముందున్న 19 శాతం నుంచి 12 శాతానికి పడిపోయింది (మధ్య ఓ రెండు సంవత్సరాలు తప్ప). అలాగే స్థూల రాష్ట్రాదాయంలో రాష్ట్ర సొంత పన్ను ఆదాయ శాతం 94-95 నాటికి 6 శాతానికి, మద్యపాన నిషేధం ప్రవేశపెట్టిన తర్వాత 95-97 మధ్యకాలంలో 5 శాతానికి తగ్గిపోయింది. అయితే నిషేధం తొలగించిన తర్వాత సుమారు 7 శాతానికి పెరిగింది. దీని అర్థం ఏమంటే నిషేధం తొలగించిన తర్వాత కూడా రాష్ట్ర పన్నుల ఆదాయం పెరగలేదు. 95-96 వరకు ఈ ఆదాయం శాతం స్థూల రాష్ట్రాదాయంలో 2 నుంచి 3 శాతం వుంటూరాగా, ఆ తర్వాత రెండు శాతానికి లోపే వుంటూవచ్చింది. అలాగే సగటు వార్షిక అభివృద్ధిరేటు కూడా అవే ధోరణులను తెలియచేస్తుంది. ఆదాయాలు ఇలా పడిపోతూండగా రెవెన్యూ పద్దుకింద ఖర్చు మాత్రం 80వ దశకంలో, అంతకుముందు దశకంలో కన్నా 3 శాతానికి పెరుగుతూ వచ్చింది. కాగా రెవెన్యూపద్దుకింద మిగుళ్ళు లేకుండాపోయాయి. అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత ఏర్పడింది. అప్పుచేసి లోటు పూడ్చటం ప్రారంభించడంతో, పెట్టుబడి పద్దుకింద ఖర్చు 70వ దశకంలో 28 శాతం నుంచి 80వ దశంకలో తొమ్మిది శాతంకు తీవ్రంగా పడిపోయింది. 90వదశకంలో రెవెన్యూఖర్చు, మొత్తం ఖర్చు తగ్గినా, మొత్తం ఆదాయం పెరుగుదల రేటుకన్నా ఎక్కువగానే వుంటూ వచ్చాయి.

ఖర్చుల ధోరణులు

రెవెన్యూ ఖర్చు, పెట్టుబడి ఖర్చు కలిపి మొత్తం ఖర్చు 82-83లో 16.14 శాతం నుంచి 86-87లో 22.65 శాతానికి పెరిగి 90వ దశకంలో 92-93 వరకు 18 శాతంగా వుండింది. ఇందులో పెట్టుబడి ఖర్చు 80వ దశకం కన్నా 90వ దశకంలో స్థూల రాష్ట్రాదాయంలో శాతంగా తక్కువగా వున్నా, రెవెన్యూ ఖర్చుమాత్రం పెరుగుతూవచ్చిందంటే, పెట్టుబడిఖర్చు తగ్గించటం వచ్చిందన్నమాట. స్థూల రాష్ట్రాదాయంలో పెట్టుబడి ఖర్చుశాతం 80-81లో మూడుశాతం నుంచి 88-89లో 2.02 శాతానికి, 92-93 వరకు రెండుశాతంకన్నా తక్కువస్థాయికి పడిపోయింది. ఆ తర్వాత 95-96 వరకు 3.03 శాతం వరకూ పెరిగి 98-99 నాటికి 1.21 శాతానికి దిగజారింది. ఆ తర్వాత కాస్త పుంజుకున్నా, 80-81 స్థాయికి చేరుకోలేదు. దీని అర్థం ఏమంటే రుణభారం పెరుగుతూంది, పెట్టుబడి ఖర్చు తగ్గుతూంది. రుణంగా తీసుకొనివచ్చిన నిధులు రోజువారీ ఖర్చుకు చెల్లయిపోతున్నాయి, మౌలిక సౌకర్యాల అభివృద్ధి కుంటుపడింది.

స్థూల రాష్ట్రాదాయంలో అభివృద్ధిఖర్చు (రెవెన్యూ, పెట్టుబడి పద్దులు కలిపి) శాతం 80వ దశకంలో 80-87 వరకు 13 నుంచి 18 శాతానికి పెరిగి 98-01లో 11 శాతానికి తగ్గిపోతూ

వచ్చింది. 01-02లో 12శాతానికి పెరిగినా, 80-81నాటి స్థాయికి చేరుకోలేకపోయింది. ఈతగ్గుదల సామాజిక, ఆర్థికసేవలపద్దుల్లో కూడా కనిపిస్తుంది. మొత్తంమీద చూస్తే స్థూల రాష్ట్రాదాయంలో మొత్తం ఖర్చు 80-87 మధ్య పెరుగుతూ వచ్చినా, ఇటీవలి సంవత్సరాల్లో 16 నుంచి 18 శాతానికి తగ్గిపోయింది (పట్టిక 1.2 కోసం రెండురెళ్ళు నాలుగు శీర్షిక చూడండి).

సంక్షేమ కార్యక్రమాలు

80వ దశకంలో విద్య, వైద్యరంగాలకు చేసిన రెవెన్యూఖర్చు తగ్గింది, సంక్షేమ కార్యక్రమాల ఖర్చు పెరిగింది. ఈ ధోరణి సంస్కరణలు ప్రవేశపెట్టిన 90వ దశకంలో కూడా కొనసాగింది. స్థూల రాష్ట్రాదాయంలో రెవెన్యూ పద్దుకింద ఖర్చుశాతం 90-91 తర్వాత కొన్నాళ్ళు తగ్గుతూ, కొన్నాళ్ళు పెరుగుతూ వచ్చింది. ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యానికి చేసిన ఖర్చు ఏమంత గొప్పగా లేదు.

మొత్తం ఖర్చు (రెవెన్యూ, పెట్టుబడి) స్థూల రాష్ట్రాదాయంలో శాతం

		అభివృద్ధి ఖర్చు				
	సాధారణ సేవలు	సోషల్ సర్వీసెస్	ఆర్థిక సేవలు	మొత్తం	స్థానిక సంస్థలకు గ్రాంట్లు	మొత్తం ఖర్చు
1980-81	3.42	6.57	6.92	13.48	0.30	17.20
1981-82	3.32	6.06	6.72	12.77	0.28	13.37
1982-83	3.54	6.43	5.89	12.32	0.27	16.14
1983-84	3.64	7.93	6.83	14.76	0.29	18.69
1984-85	4.19	7.89	8.41	16.30	0.30	20.79
1985-86	4.50	7.84	8.09	15.93	0.27	20.69
1986-87	4.67	8.89	8.86	17.74	0.23	22.65
1987-88	4.41	7.75	7.31	15.05	0.20	19.66
1988-89	4.36	6.72	7.92	14.64	0.19	19.19
1989-90	4.60	7.03	6.46	13.49	0.17	18.26
1990-91	4.56	6.47	6.72	13.19	0.15	17.90
1991-92	4.53	5.94	6.31	12.25	0.12	16.90
1992-93	4.79	6.29	6.79	13.08	0.14	18.00
1993-94	4.30	5.18	6.61	11.79	0.12	16.22
1994-95	4.53	5.05	6.89	11.95	0.11	16.59
1995-96	4.51	5.91	5.81	11.72	0.10	16.32
1996-97	4.60	5.87	5.53	11.40	0.11	16.11
1997-98	4.96	5.79	5.43	11.22	0.13	16.32
1998-99	4.91	6.25	4.66	10.91	0.13	15.95
1999-00	5.40	6.01	4.48	10.49	0.10	15.99
2000-01	6.17	5.72	6.02	11.73	0.12	18.02
2001-02	6.23	5.80	6.31	12.11	0.10	18.53

ఆధారం: బడ్జెట్-ఇన్ బ్రీఫ్, రాష్ట్ర అర్థ, గణాంక శాఖ

కీలక సామాజిక సేవలపై ఖర్చు ధోరణులు

(శాతం)

	రెవెన్యూ ఖర్చులో శాతం			స్థూల రాష్ట్రాదాయంలో శాతం			
	ప్రాథమిక విద్య	ప్రాథమిక ఆరోగ్యం	నీటి సరఫరా, పారిశుధ్యం	ప్రాథమిక విద్య	ప్రాథమిక ఆరోగ్యం	నీటి సరఫరా, పారిశుధ్యం	మొత్తం రెవెన్యూ ఖర్చు
1980-81	8.74	0.00	2.10	1.24	0.00	0.40	14.17
1981-82	8.68	0.00	2.00	1.20	0.00	0.35	13.81
1982-83	8.72	0.00	2.59	1.21	0.00	0.39	13.89
1983-84	7.87	0.00	2.81	1.28	0.00	0.51	16.25
1984-85	7.60	0.00	2.51	1.38	0.00	0.46	18.14
1985-86	8.15	0.45	2.98	1.48	0.08	0.54	18.21
1986-87	7.19	0.34	3.09	1.42	0.07	0.61	19.78
1987-88	8.61	0.44	3.62	1.51	0.08	0.64	18.55
1988-89	7.02	0.48	2.56	1.21	0.08	0.44	17.17
1989-90	7.49	0.47	2.17	1.25	0.08	0.37	16.67
1990-91	7.64	0.68	1.86	1.26	0.11	0.31	16.51
1991-92	6.99	0.73	1.83	1.11	0.12	0.29	15.87
1992-93	7.17	0.72	2.18	1.16	0.12	0.35	16.20
1993-94	7.56	0.69	2.16	1.05	0.10	0.30	13.86
1994-95	7.10	0.71	3.24	0.98	0.10	0.45	13.80
1995-96	6.46	0.73	2.34	0.86	0.10	0.31	13.29
1996-97	5.27	0.62	2.13	0.84	0.10	0.34	15.97
1997-98	5.90	0.70	2.76	0.90	0.11	0.42	15.18
1998-99	5.50	0.68	3.99	0.81	0.10	0.59	14.74
1999-00	6.65	0.78	2.20	0.97	0.11	0.32	14.58
2000-01	6.00	0.75	0.98	0.98	0.12	0.32	14.58
2001-02	6.69	0.81	0.70	1.10	0.13	0.12	16.47
2002-03(RE)	7.37	1.06	0.96				

ఆధారం: పట్టిక 2, 3 ఆధారాలు, వివరణాత్మక బడ్జెట్లు

తాగునీటి సరఫరా, పారిశుధ్యం లాంటి ప్రాథమికసౌకర్యానికి రెవెన్యూ పద్దుకింద చేసిన ఖర్చు మొత్తం రెవెన్యూ ఖర్చులో 90-91లో 1.86 నుంచి పెరిగినా, 1998-99 నుంచి ఒక్క శాతానికి తక్కువ స్థాయికి దిగజారిపోయింది. అలాగే ప్రాథమిక విద్య ఖర్చు శాతం 91-92 నుంచి 00-01 మధ్యకాలంలో 0.08 శాతం మేరకు మాత్రమే పెరిగింది. స్థూలరాష్ట్రాదాయంలో వినిమయ ఖర్చు (కరెంట్ ట్రాన్స్‌ఫర్స్‌తో కలిపి) శాతం 80వ దశకంలో 15.36 శాతానికి పెరిగినా, 90వ దశకంలో తగ్గి ఇప్పటికే సుమారు 11 శాతం వద్దనే నిలిచిపోయింది.

రెవెన్యూ ఖర్చులో అధికశాతం జీతభత్యాలు, చేసిన అప్పుమీద రుణాలకే చెల్లయిపోతూంది. 1996లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వైట్ పేపర్ ప్రకారం 84-84లో 77 శాతం (సొంత పన్ను, పన్నేతర ఆదాయంలో శాతం) పరిపాలనకు ఖర్చుచేయగా అది 96-97లో 95 శాతానికి పెరిగిపోయింది. అయితే మద్యపాన నిషేధం వల్ల ఆదాయం తగ్గటంతో ఈ శాతం ఇంత పెరిగిందని గమనించాలి.

(తరువాయి భాగం 10వ పేజీలో)

కాన్‌కన్ సమావేశం: ఒప్పందాల్లో భారత్ సాధించుకోవాల్సిన మార్పులు

— ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి

మెక్సికోలో కాన్‌కన్ నగరంలో సెప్టెంబర్ 10 నుంచి జరుగబోయే సమావేశంలో వ్యవసాయరంగం కీలక చర్చనీయాంశం అవుతుంది. దీనిగురించి చర్చించాలని వర్ధమైనదేశాలు కోరుతున్నాయి. అమెరికా- యూరోపియన్ దేశాలు కలిసి వ్యవసాయానికి సంబంధించి ఒక ఉమ్మడి ప్రతిపాదనను రూపొందించుకున్నాయి. సమావేశంలో ఈ అంశం గురించి చర్చకు వచ్చినప్పుడు తమ ప్రతిపాదన కోసం పట్టుపడతాయి. వ్యవసాయరంగానికి ధనిక దేశాలు ఇస్తున్న సబ్సిడీలను కొద్దిగా తగ్గించుకోవడానికో, ఎగుమతి రాయితీలను క్రమంగా తగ్గించుకోవడానికి అంగీకరించాయి. ప్రస్తుతం విధిస్తున్న భారీ ఎగుమతి సుంకాలను కొనసాగించుకోవడానికే నిర్ణయించుకున్నాయి. వర్ధమాన దేశాలు ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలివ్వడానికి వీల్లేకుండా చేస్తున్నాయి. ఈ ప్రతిపాదనలకు ప్రత్యామ్నాయంగా మరొక ప్రతిపాదన తెరమీదకు వచ్చింది. భారత్, అర్జెంటీనా, బ్రెజిల్ మొదలైన 14 దేశాలతో ఇటీవల ఏర్పడిన కూటమి ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. 'గ్రీన్‌బాక్స్' పేరిట ధనిక దేశాలు వ్యవసాయ రంగానికిస్తున్న ప్రోత్సాహకాలను తక్షణం నిలుపుదల చేయాలి. నిజానికివి సబ్సిడీలే. పైగా భారీఎత్తున ఈ దేశాలు వ్యవసాయరంగానికి అందజేస్తున్న రాయితీలను గణనీయంగా తగ్గించుకోవాలి. దిగుమతి సుంకాలు, ఎగుమతి రాయితీలను తగ్గించుకోవాలి. వాణిజ్య వక్రీకరణను అరికట్టాలి. వర్ధమానదేశాల వ్యవసాయ ఉత్పత్తులను ధనికదేశాల మార్కెట్లలోకి అనుమతించాలి. పై రెండురకాల ప్రతిపాదనలపై జరిగే చర్చలో వర్ధమానదేశాల ప్రతిపాదనకు సానుకూలత సాధించుకోవాలి. లేకపోతే ఈ దేశాల వ్యవసాయం తీవ్ర దోపిడీకి, మోసానికి గురియై అంతరించిపోయే ప్రమాదం వుంది.

డబ్ల్యు.టి.వో. ఒప్పందాలు 1995లో కుదుర్చుకున్నవి. దఫదఫాలుగా, క్రమంగా ఒప్పందాలు అమలవుతాయి. కొన్ని ఒప్పందాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. మరికొన్ని భవిష్యత్తులో అమలు కాబోతాయి. 2005 నుంచి చాలా ఒప్పందాలు అమలు చేయాల్సిన పరిస్థితి వుంది. ఇప్పటికే అమలైన ఒప్పందాల వల్ల భారత వ్యవసాయరంగం కునారిల్లుతుంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు, సామ్రాజ్యవాద శక్తుల ఆదేశాల మేరకు రూపొందించి అమలవుతున్న ఆర్థిక సంస్కరణలు, ప్రభుత్వ ఆర్థిక వ్యవసాయ విధానాలు కూడా మనదేశ వ్యవసాయరంగం యొక్క సంక్షోభానికి కారణాలే. వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదల రేటు ప్రతి 8 ఏళ్ళలో పడిపోయింది. ఎకరా దిగుబడులు కూడా అనేక పంటల్లో తగ్గినాయి. వ్యవసాయానికి ఇస్తున్న సబ్సిడీల తగ్గింపు, స్వేచ్ఛా వాణిజ్యం ప్రభుత్వ నియంత్రణ లేనందువల్ల ఉత్పాదకాల ధరలు పెరిగిపోవడమూ, నాణ్యత లోపించడమూ జరిగాయి. ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. రైతులు పెట్టుబడుల కొరకు అప్పులు చేశారు. పంటలకు గిట్టుబాటుధర లేదు. అందవల్ల రైతాంగం భారీగా నష్టపోయారు. వ్యవసాయం నిర్వీర్యం అయింది.

డబ్ల్యు.టి.వో.పై సంతకం పెట్టే సందర్భంలో మన పాలకులు ఎన్నో ఆశలు కల్పించారు. మనదేశంలో వ్యవసాయక వాతావరణ పరిస్థితులు పలు పంటలు పండించడానికి అనుకూలంగా వున్నాయి. పూలు, పండ్లు, రొయ్యలు, చేపలు మొదలైనవాటిని లాభదాయకంగా సాగుచేసుకోవచ్చు. ధనిక దేశాల్లో డబ్ల్యు.టి.వో. ఒప్పందం ప్రకారం వ్యవసాయ సబ్సిడీలు తగ్గించుకోవాలి. వారి ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. తద్విరుద్ధంగా మనదేశంలలో సబ్సిడీలు నామమాత్రంగా వున్నందువల్ల మన ఉత్పత్తి ఖర్చుల్లో తేడా వుండదు. మన సరుకుల ధరలు తక్కువగా ఉంటాయి. కాబట్టి, మనదేశం అంతర్జాతీయ మార్కెట్‌ను ఆక్రమించుకోవచ్చు. ఎగుమతులను భారీగా పెంచుకోవచ్చు. డబ్ల్యు.టి.వో. మనకు విశేష సహాయ సహకారాలను అందిస్తుంది. అందువల్ల ఎగుమతులు భారీగా పెరుగుతాయి. మన రైతులు అధికంగా పండించి, ఎగుమతిచేసి లాభాలబాటలోపయనించవచ్చు. ఈ మాటలన్నీ మన పాలకులు ఆనాడు పలికినవి. ఎనిమిదేళ్ళ తరువాత పరిస్థితి ఏమిటి? మన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరుగలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో మన వాటా ఒక్కశాతానికి కూడా పెరగలేదు. దిగుమతులు భారీగా పెరిగాయి. వాణిజ్యలోటు పెరిగింది. మన పాలకుల నమ్మకం వమ్మయింది. ఆశలు అడుగంటాయి. భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరగకపోవడానికి కారణాలేంటి? ధనికదేశాలు దిగుమతి సుంకాల్ని భారీఎత్తున విధిస్తున్నాయి. 83 నుండి వెయ్యిశాతం దాకా రకరకాల ఉత్పత్తులపైన దిగుమతి సుంకాల్ని నిర్ణయించుకొని అమలు చేస్తున్నాయి. భారీసుంకాల్ని చెల్లించి ఎగుమతిచేయడం చాలా కష్టం. ఎగుమతులను ప్రోత్సహించడానికి ఎగుమతి రాయితీలను మన ప్రభుత్వం ప్రోత్సహించడంలేదు. శానిటరీ, ఫైటోశానిటరీఅనే ఆరోగ్య ప్రమాణాలు ఏకపక్షంగా నిర్ణయించి అమలు చేస్తున్నందువల్ల మన ఉత్పత్తులనుధనికదేశాలు తిరస్కరిస్తున్నాయి. అంతర్జాతీయమార్కెట్‌లో వ్యవసాయ ధరలు దేశీయ మార్కెట్ ధరల కంటే తక్కువగా వున్నాయి. పంటలఉత్పాదకత తక్కువస్థాయిలోవుంది. ఉత్పత్తిలో స్థిరత్వంలేదు. ఈ కారణాలన్నీ కూడా దిగుమతులకు ప్రతిబంధకాలే. డబ్ల్యు.టి.వో. మన ఎగుమతులు పెరగడానికి, వ్యవసాయం అభివృద్ధి చెందడానికి ఏరకంగానూ ఉపయోగపడలేదు.

డబ్ల్యు.టి.వో. ఒప్పందాల ప్రకారం భారత్ దిగుమతి విధానంలో సమూలంగా మార్పులు చేయవలసివచ్చింది. విదేశీ మార్కెట్

శక్తులకు మన ద్వారాలు తెరువక తప్పలేదు. ఓపెన్ జనరల్ లైసెన్సింగ్ సిస్టమ్ కిందకు ప్రభుత్వం అనేక వ్యవసాయ ఉత్పత్తులను తీసుకునివచ్చింది. దిగుమతులకు అవకాశం ఏర్పడింది. 1429 సరుకుల దిగుమతులపైన పరిణామాత్మకమైన ఆంక్షలు తొలగించింది. దిగుమతి సుంకాలు మనదేశంలో అతి తక్కువ స్థాయిలో వున్నాయి. ఈ కారణాలచేత విదేశాల నుండి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి ప్రవాహంలా వచ్చిపడ్డాయి. పామాయిల్, సోయా ఆయిల్, పత్తి, చక్కెర, పాలు, పాల ఉత్పత్తులు, కోళ్ళ ఉత్పత్తులు, గుడ్లు మొదలైనవి దిగుమతి అయ్యాయి. రైతులు పండించే ఉత్పత్తులకు గిరాకీలేదు. వ్యవసాయ ధరలు పతనమయ్యాయి. రైతులు నష్టపోయారు.

వ్యవసాయానికి సంబంధించి మరో రెండు ఒప్పందాలు ఉన్నాయి. మొదటిది పేటెంట్ హక్కులు, రెండోది శానిటరీ, ఫైటో శానిటరీ ప్రమాణాలు. 2005 సంవత్సరం నుంచి ఈ పేటెంట్ హక్కులు అమల్లోకి రావాలి. ఒప్పందాలకనుగుణంగా దేశ పేటెంట్ చట్టంలో మార్పులు తీసుకునిరావాలి. కానీ ఈ చట్టాలు డబ్ల్యు.టి.వో.లో ఒప్పందానికి లోబడే వుండాలి. వ్యవసాయం పశుగణం, సూక్ష్మక్రిములు, జన్యుకణాలు పేటెంట్ల పరిధిలోకి వస్తాయి. జన్యుకణాల పేటెంట్ల వల్ల మనదేశంలోని వివిధ ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులకు సరిపోయే వంగడాలను రూపొందించుకోలేము. విత్తన పరిశోధనలు కొనసాగించడం కష్టం. బహుళజాతి సంస్థలు విత్తనంపైన పూర్తి గుత్తాధిపత్యంపొందుతాయి. కొత్త విత్తనాలను వాడిన రైతులు పంట వచ్చిన తరువాత గింజల్ని తిరిగి వాడరాదు. ఇతర రైతులకు అదలు, బదులు ఇవ్వడానికి వీలులేదు. అమ్ముకోవడం నిషిద్ధం. బహుళజాతిసంస్థల నుండి ప్రతి సంవత్సరం రైతులు విత్తనాలను కొనాల్సివస్తుంది. వాటి ధరలు ఎన్నో రెట్లు పెరుగుతాయి. రైతులు అధిక ధరలు పెట్టి విత్తనాలను కొనలేకపోవచ్చు. బహుళజాతి సంస్థలు మన పంటల సరళిలో మార్పులు తేవడానికి ఒత్తిడి తేవచ్చు. ఈ విధంగా మన రైతాంగాన్ని, వ్యవసాయాన్ని పేటెంట్లు దెబ్బతీయొచ్చు. పేటెంట్ల వంకతో మన సంప్రదాయ విజ్ఞానాన్ని, జీవ వైవిధ్యాన్ని కొల్లగొట్టి, తస్కరించి పేటెంట్లు పొంది లాభాలను దండుకోవచ్చు. ఏదైనా వస్తువుకు గాని, తయారుచేసే ప్రక్రియకు గాని పేటెంటు తీసుకుంటే వాటిపైన సంబంధిత వ్యక్తికో, కంపెనీకో 20 ఏళ్ళ గుత్తాధిపత్యం వుంటుంది. మరెవరూ అలాంటి ప్రక్రియలను వాడరాదు. వస్తువును తయారు చేయరాదు. పేటెంట్లు మన రైతాంగానికి, ఆహార భద్రతకు, వ్యవసాయానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని శాస్త్రజ్ఞులు ఆందోళన చెందుతున్నారు. శానిటరీ, ఫైటో శానిటరీ ప్రమాణాలను కొన్ని ధనిక దేశాలు కఠినతరంగా వుండేటట్లు రూపొందించాయి. మానవులు పశువుల మొక్కల ఆరోగ్యాన్ని సురక్షిత ఆహారాన్ని కాపాడుకోవడానికి ఈ ప్రమాణాలను సిద్ధం చేశాయి. ప్రమాణాల రూపకల్పనలో వర్ధమాన దేశాలు పాల్గొనలేదు. ఈ ప్రమాణాలే వర్ధమాన దేశాల ఎగుమతులకు తీవ్ర ప్రతిబంధకాలయ్యాయి. భవిష్యత్తులో వర్ధమాన దేశాలు ఈ ప్రతిబంధకాలను అధిగమించి ఎగుమతి చేయడం దుస్సాధ్యం. డబ్ల్యు.టి.వో. ఒప్పందాలు మన వ్యావసాయాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టడం ఖాయం. అందువల్ల ఒప్పందాల్లో మార్పులు సాధించుకునితీరాలి. 14 దేశాల కూటమి చేసిన ప్రతిపాదనలను ఆమోదింపచేసే ప్రయత్నం గట్టిగా జరగాలి. అమెరికా, యూరోపియన్ ప్రతిపాదనలను టోకుగా, ఖచ్చితంగా తిరస్కరించాలి. వాటి వత్తిడులను, బెదిరింపులను వర్ధమాన దేశాలు తట్టుకోవాలి. ఏవో ప్రలోభాలు చూపించి వర్ధమాన దేశాలను విభజించే ధనిక దేశాల జిత్తులను చిత్తుచేయాలి. భారత్ 14 దేశాల కూటమితో సహా ఇతర వర్ధమాన దేశాలను కలుపుకుని గట్టిగా పోరాడాలి. దేశ ప్రయోజనాల్ని దృష్టిలో వుంచుకొని ఒప్పందాల్లో మార్పులు భారత్ సాధించుకుంటుందని దేశప్రజలు ఆశిస్తున్నారు. ○

(8వ పేజీ తరువాయి)

ఖర్చు పద్దును విశ్లేషిస్తే తెలిసిన విషయమేమంటే 80వ దశకంలో ఖర్చు పెరిగినా విద్య, వైద్యం లాంటి కీలక పద్దులకింద ఖర్చుశాతం తగ్గింది, అదే సమయంలో సంక్షేమ కార్యక్రమాల మీద ఖర్చు పెరిగింది.

పెట్టుబడి ఖర్చు

ఆస్తులను సృష్టించేది పెట్టుబడి ఖర్చు. 80వ దశకంలోనే స్థూల రాష్ట్రాదాయంలో శాతంగా 80వ దశకంలోనూ తగ్గుతూ వచ్చినా 98-99 నాటికి 1.21 శాతానికి తగ్గిపోయింది (93-96 మధ్యకాలంలో తప్ప). ఉదాహరణకు రవాణా రంగంలో ఈ శాతం కొంచెం నిలకడగా వున్నా, భారీ మధ్యతరహా నీటి పారుదల రంగంమీద ఖర్చు 90వ దశకం పూర్వార్థ భాగంలో పెరిగి ఆ తర్వాత తగ్గుతూ వచ్చింది. 90-91 నాటి 0.75 శాతం స్థాయికి కూడా చేరుకోలేకపోయింది. విద్యుచ్ఛక్తి రంగంలో కూడా ఇదే ధోరణి కనిపించింది. పెట్టుబడి ఖర్చు తగ్గడమంటే రోజువారి ఖర్చుకోసం రుణాలు చేయటమే గాని, ఆస్తులు సృష్టించడానికి కాదని అర్థం.

ప్రాంతీయ అసమానతలను తొలగించి, సమతూకంగా ప్రాంతాల అభివృద్ధి సాధించడానికి అనేక పథకాలు ప్రణాళికలు 70వ దశకం ప్రారంభం నుంచి చేపట్టింది. అయితే 60, 70వ దశకాల్లో ఇందుకు కావాల్సిన నిధుల సేకరణలో రాష్ట్ర ప్రణాళికా శాఖ కొంతమేరకు విజయం సాధించినా, తర్వాత ఈ అభివృద్ధి పథకాలను సమన్వయం చేయటంలో, నిధులను కేటాయించ డంలో, మొత్తం రాష్ట్ర అభివృద్ధిస్థాయిని పెంచడంలో ఇబ్బందుల నెదుర్కొంటూంది.

(ఇతర పట్టికలను రెండు రెళ్ళు నాలుగులో చూడండి)

(ఇంకా వుంది)

యురేనియం ప్రాజెక్టు - మంచీ చెడూ

— సింహం

నల్లగొండ జిల్లా ప్రజలు గత రెండు మూడునెలల నుంచి అక్కడ లభించే ముడి యురేనియమ్ ఖనిజాన్ని త్రవ్వి అణుశక్తిని ఉత్పత్తికి ఉపయోగించడానికి వీలుగా దానిని శుద్ధిచేసి ఎగుమతి చేసే ప్రాజెక్టుపై చాలా ఆందోళన చెందుతున్నారు. దీనికి ప్రధాన కారణం యురేనియమ్ ఖనిజాన్ని త్రవ్వితీసి, దానిని శుద్ధిచేసినపుడు వెలువడే ధార్మిక శక్తి (రేడియేషన్) ప్రజలఆరోగ్యాన్ని వివిధరూపాలలో దెబ్బతీయడమేకాకుండా, వాతావరణం కలుషితమవుతుందన్న భయం. ముఖ్యంగా మంచినీటికి ఉపయోగించే నాగార్జునసాగర్ ప్రాజెక్టులోనికి, శుద్ధిచేయడానికి ఉపయోగించిన నీరు భూగర్భం ద్వారా ప్రవహించి, ధార్మికశక్తి ప్రభావం వలన ఆ నీటిని సేవించే ప్రజలు, ఆ నీటిలో వుండే జీవరాసుల ఆరోగ్యం చెడిపోయే అవకాశం వుందని, అంతేకాకుండా ఆ నీటిని వాడి పండించే పంటలు కూడా చెడిపోయే ప్రమాదం ఉందని, కొన్ని సంవత్సరాలలో ఆ పంటభూమి నిరుపయోగంగా తయారు కాగలదని అక్కడి ప్రజలు భయపడుతున్నారు. అంతేకాదు ఈ ప్రాజెక్టు వలన నాగార్జునసాగర్ టైగర్ సాంక్చరీ కూడా నష్టపోయే ప్రమాదం వుందని వాదన. అయితే ఈ యురేనియమ్ ప్రాజెక్టు వలన, నల్లగొండ జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, పలువురికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని, భూమివిలువ బాగా పెరిగి, ప్రజలు లాభపడే అవకాశాలున్నాయని అందుచేత యురేనియమ్ ప్రాజెక్టుని వ్యతిరేకించడం సబబుకాదని కూడా ఒక అభిప్రాయం ప్రజలలో వ్యాపిస్తున్నది. ఈ రెండు అభిప్రాయాలు ఒక స్థాయిలో హేతుబద్ధంగానే వున్నాయి. సాధారణ భాషలో చెప్పాలంటే ఇలాంటి ప్రాజెక్టుల వలన లాభాలు వున్నాయి, నష్టాలు వున్నాయి. ఈ రెండూ త్రైపారు వేస్తే, ఎక్కువ లాభాలు కలుగుతుందని భావిస్తే, ఆ ప్రాజెక్టు అమలుచేయడమే ప్రజలకు ఉపయోగం. అయితే ఈ లాభాలు, నష్టాలు అంచనా బహుజాగ్రత్తగా, శాస్త్రీయంగా వేసి, దాని ఫలితాన్ని బట్టి ప్రభుత్వం ప్రజలు ఒక నిర్ణయం తీసుకోవాలి.

ఈ ప్రాజెక్టు పరిసర ప్రాంతప్రజలు ఇంచుమించుగా రెండు పక్షాలుగా చీలిపోయారు. తెలంగాణా యురేనియమ్ ప్రాజెక్టు సాధన సమితి, లంబాపూరు, పెద్దగట్టు, మల్లాపురం, దుగ్యాల మున్నగు గ్రామాల ప్రజలను, ఈ రూ. 507 కోట్ల యురేనియమ్ వలన జిల్లా, ఆ మండలం ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, సమీకరిస్తున్నారు. అలాగే "గ్రీన్‌పీస్", "అన్వేషి", "అస్మిత", "బ్లూ క్రాస్", "జన విజ్ఞాన వేదిక" యురేనియమ్ ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళన సమితి కూడా ఈ ప్రాంత ప్రజలను సమీకరించి ప్రాజెక్టు ఎట్టి పరిస్థితులలో చేపట్టరాదని ఆందోళన చేస్తున్నారు. ఈ వివిధ సంస్థలు ఈ ప్రజా సమీకరణకు ప్రధాన కారణం, హైకోర్టు ఆగస్టు 14వ తేదీన సూచనను అనుసరించి ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పెద్దగట్టు గ్రామంలో బహిరంగ విచారణ జరపడం. ఈ బహిరంగ విచారణ ఆగస్టు 19వ తేదీన జరిగింది. ఈ విచారణ సక్రమంగా జరగలేదని, నామమాత్రంగా, యధాలాపంగా జరిపించారని ప్రాజెక్టుని వ్యతిరేకిస్తున్న సంస్థలు, సంఘాలు విమర్శించాయి. ప్రజలకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బహిరంగంగా విచారణ సందర్భంలో (ఎన్విరాన్‌మెంట్ పబ్లిక్ హియరింగ్) తగినంత సమాచారం అందచేయలేదని, ఈ ప్రాజెక్టు వలన వాతావరణం మీద కలిగే ప్రభావం గూర్చి ఇచ్చిన సంక్షిప్త నివేదిక, అసంపూర్తిగాను, అసంతృప్తికరంగాను వుందని, కొన్ని విషయాలు కావాలని మరుగుపరిచి నట్టు కనిపిస్తున్నదని, అందువలన ప్రజాభిప్రాయం సరిగ్గా ప్రతిబింబపడ లేదని, కేంద్ర వాతావరణ, అడవుల చట్టం 1994 నాల్గవ పేరాను అనుసరించి ఈ యురేనియమ్ ప్రాజెక్టును నిరాకరించాలని డిమాండు చేస్తున్నాయి.

ఈ యురేనియమ్ ప్రాజెక్టుకు సంబంధించిన కొన్ని వివరాలు. యురేనియమ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యు.సి.ఐ.యల్.) అంచనాల ప్రకారం పెద్దగట్టు, ఎల్లాపూర్ గ్రామాలకు చెందిన 1326 ఎకరాలలో, 11.02 మిలియన్ల టన్నులు (కోటి పదిలక్షల చిల్లర టన్నులు) యురేనియమ్ ముడిపదార్థం లభించగలదు. కంపెనీ సమాచారం ప్రకారం 286.46 హెక్టార్ల ప్రైవేటు భూములు కొనుగోలు చేయవలసివుంటుంది. ఈ భూమి 33 పి.ఏ.యఫ్.కుటుంబాలకు (అంటే ఈ ప్రాజెక్టుతో ఏదో విధంగా ప్రభవించిన భూమిగల కుటుంబాలు) అలాగే 191 మంది పి.ఏ.ఎస్. (ప్రాజెక్టువలన ప్రభావితమైన వ్యక్తులు) ఆధీనంలో వుంది. ఈ భూమి స్వాధీనం చేసుకోవడానికి, ఆ భూమినుంచి వైదొలగవలసిన వారికి ఇతరవిధంగా ఉపాధి, నివాసం, ఇత్యాదిసౌకర్యాలు కలిగించడానికి రూ. 2 కోట్ల 20 లక్షల 32 వేలు ఖర్చుఅవుతుంది. ఈ భూమి కొనుగోలు చేసే విషయంలో, ఆ భూస్వాములతోను, గ్రామపెద్దలతోను బేరసారాలు సాగుతున్నాయి. కంపెనీవారు మెట్టభూములకు ఎకరానికి రూ. 25,000లు, అదనంగా భూమితీసుకుంటే మరో రూ. 5,000లు, ప్రాజెక్టువలన ఉనికిని పోగొట్టుకున్న ఒక్కొక్క కుటుంబానికి రూ. 10,000లు, ఒక సంవత్సరం జీవనోపాధి క్రింద (సబ్సిస్టెన్సు అలవెన్సు) రూ. 14,000లు (రోజుకి రూ. 40) చెల్లిస్తామంటున్నారు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టు వలన 800మందికి ఉద్యోగాలు లభిస్తాయని, అందులో 400 ఉద్యోగాలు శిక్షణలేని వ్యక్తులు చేసేవని కంపెనీ మెకానికల్ చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు అంటున్నారు. అయితే భూములు పోగొట్టుకునేవారు ఎకరానికి లక్షరూపాయలు కావాలని, ప్రతి కుటుంబంలోను ఒక వ్యక్తికి ఉపాధి కంపెనీ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

భూమి సేకరణకు సంబంధించిన ధర విషయంలో లావాదేవీలు తప్పించి మిగతా విషయాల్లో భూములు అమ్మేవారికి తగాదాలేదు. కాని కేవలం భూములకు మంచిధర పలుకుతుంది. కుటుంబంలో ఒకరికి ఉపాధి లభిస్తుందన్న ఒక విషయం మీద ఆధారపడి యురేనియమ్ ఖనిజం త్రవ్వకం వలన, దానిని శుద్ధిచేయడం వలన సంభవించే ధార్మిక శక్తి వలన ఆ ప్రాంతం ప్రజల ఆరోగ్యానికి పర్యావరణ కలుషితం వలన, మంచినీరు, పంటనీరు అనారోగ్యంగా పరిణమించే ప్రమాదం. ఆ ప్రదేశానికి దగ్గరవున్న నాగార్జునసాగర్ టైగర్ సాంక్చురీకి కలుగబోయే నష్టం లెక్కలోకి తీసుకోకపోవడం సంకుచిత దృష్టితో స్వలాభం చూసుకోవడమే అవుతుంది. కాని ముడి యురేనియమ్ ఖనిజం త్రవ్వడం వలన, ఎంతవరకు ప్రజారోగ్యానికి, వ్యవసాయానికి, హాని కలుగుతుంది, పర్యావరణం ఏమేరకు కలుషితం అవుతుందన్న దాంట్లో చాలా భేదాభిప్రాయం వుంది. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ యురేనియం ఖనిజం త్రవ్వకం, తరువాత కర్మాగారంలో శుద్ధిచేసినపుడు వెలువడే ధార్మికశక్తి ఎంత బలమైనది, అది అక్కడ పనిచేసేవారి ఆరోగ్యం దెబ్బతీసేంత స్థాయిలో విడుదల అవుతుందా, లేక ప్రమాదం లేని స్థాయిలో విడుదల అవుతుందా అన్న విషయం కూలంకషంగా, పారదర్శకంగా, శాస్త్రజ్ఞులు పర్యావరణ నిపుణుల చేత పరిశీలింపచేసిన తరువాతనే ఈ యు.సి.ఐ.ఎల్. అభ్యంతరం లేదు (నో ఆబ్జెక్షన్) సర్టిఫికెటు ఇవ్వాలి. అంతవరకు ఎటువంటి తొందరపాటు పడకూడదు.

పర్యాటక నిపుణులు అనాధారిత సేవాసంఘాలు, ప్రజలు ఈ విషయంలో భయభ్రాంతులవ్వడానికి సహేతుకమైన కారణాలు కొన్ని ఉన్నాయనడంలో సందేహం లేదు. జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడలో దేశంలోనే అతిపెద్ద యునేనియమ్ గని ఉంది. ఇక్కడ రెండుమూడు దశాబ్దాల నుంచి యురేనియమ్ ఖనిజాన్ని త్రవ్వి శుద్ధిచేస్తున్నారు. ఇక్కడి ప్రాంత ప్రజలు అనారోగ్యానికి పాల్పడ్డారని పర్యావరణం అంతా కలుషితమైనట్లు ప్రభుత్వేతర సేవా సంఘాలు కొన్ని ఫోటోలు, వ్యాసాలతో ప్రచారం చేయడమే కాకుండా ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ప్రజలకు చూపించి ఈ యురేనియమ్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటోన్ముఖుల్ని చేయడానికి తాపత్రయపడుతున్నారు.

కాని శాస్త్రపరంగానూ, హేతుబద్ధంగానూ, నిష్పక్షపాతంగానూ ఈ విషయాన్ని పరిశీలించవలసి వుంది. ఏ పెద్ద ప్రాజెక్టు కట్టాలన్నా కొందరికి కొంత వైముఖ్యం కలుగక తప్పదు. ఉదాహరణకు నర్మదా ప్రాజెక్టు తీసుకోవచ్చు. ఆ ప్రాజెక్టు వలన నష్టపోయిన గిరిజనులకు తగినవిధంగా పరిహారం చెల్లించాక ప్రాజెక్టును వ్యతిరేకించడం విజ్ఞత అనిపించు కోదని చాలామంది అభిప్రాయం. అలాగే అణువిద్యుత్ కేంద్రాలకు కూడా చాలామంది అభ్యంతరం చెబుతున్నారు. కాని అభివృద్ధి పొందిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఈ రోజులలో అణువిద్యుత్ ఉత్పాదనను వ్యతిరేకించడం అవివేకం అని తేలిపోయింది. రష్యాలోని 'చెర్నోబిల్' ప్రమాదం సంభవించిన తర్వాత కూడా అమెరికా, యూరోపియన్ దేశాలే కాక చైనా మున్నగు ఆసియా దేశాలు కూడా అణువిద్యుత్ ఉత్పత్తిని ముమ్మరంగానే సాగిస్తున్నాయి. అంతెందుకు 1970, 1980 దశాబ్దాల్లో దక్షిణాదిన అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పాలని కేంద్రం నిశ్చయించు కున్నప్పుడు అటామిక్ ఎనర్జీ కమీషన్ ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక ప్రాంతం అనువుగా ఉంటుందని సూచించింది. ఆ రోజుల్లో కల్పకంవద్ద అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పాలని తమిళనాడు, నాగార్జునసాగర్ వద్ద కానీ, శ్రీశైలంవద్దకానీ నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్‌లు పోటీపడ్డాయి. అప్పుడు ఎవ్వరూ అణువిద్యుత్ కేంద్రాన్ని వ్యతిరేకించలేదు. ఎందుకంటే, ఇప్పుడు వినియోగిస్తున్న బొగ్గు, మరికొన్ని దశాబ్దాలలో ఖాళీ అయిపోతే విద్యుత్ ఉత్పాదన గతి ఏం కావాలి? అందుచేత ఈ విషయంలో బాగా అధ్యయనం చేసిన అటామిక్ ఎనర్జీ కమీషన్, బాబా అటామిక్ సెంటర్‌కు చెందిన నిపుణులు తగిన జాగ్రత్తలు తీసుకొని అణువిద్యుత్ కేంద్రాల్లో పనిచేసేవారికి గాని, అవి స్థాపింపబడిన ప్రాంతప్రజలకు గాని ఎటువంటి ప్రమాదం వుండదని హామీ ఇస్తున్నారు.

ప్రమాదం అన్నది ఎప్పుడూ సంభవిస్తూనే వుంటుంది. విమాన ప్రమాదాలు జరుగుతున్నాయని విమానాల్లోనో, రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని రైళ్ళలోనో ప్రయాణం చేయడం ప్రజలు మానుకోలేదు. అలాగే భూకంపాలు రావచ్చునన్న జూబిలీహిల్స్ ప్రాంతంలో కూడా మూడు నాలుగు అంతస్తుల భవంతులు నిర్మిస్తూనే వున్నారు.

ఆలోచించవలసింది, తీసుకోవలసిన జాగ్రత్తలు అన్నీ తీసుకుంటే యురేన్‌యమ్ ఖనిజం త్రవ్వకం వలన ఏ మోతాదులో ధార్మికశక్తి విడుదల అవుతుందో ఆ మోతాదు వలన ప్రజల, పర్యావరణ ఆరోగ్యానికి చెప్పుకోతగినంత హానిఏమైనా కలుగుతుందా అన్న విషయం. మామూలుగా ఎక్స్‌రే తీయించుకున్నా కొంత ధార్మికశక్తి ప్రభావం శరీరంమీద వుంటుంది. అయితే అది స్వల్పం అవ్వటం వలన పట్టించుకోనవసరం లేదు. ఏ ఖనిజం త్రవ్వినా బొగ్గుగనులు, అభ్రకం, ఆస్‌బెస్టాస్ ఆఖరికి మామూలు గ్రానైట్ మైన్స్ తవ్వాలన్నా పేలుడు పదార్థాలు ఉపయోగించాలి. అలాంటి పేలుడు పదార్థాలు ఉపయోగించినప్పుడు ధూళి, దుమ్ము రాకతప్పదు. కాని ఈ గనులు తవ్వడం మానేస్తున్నారా అంటే అదేదీ లేదు. వీలైనన్ని జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకుంటున్నారు. అణువిద్యుత్ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికునికి ఉద్యోగస్తులకు లేని ప్రమాదం యురినియమ్ శుద్ధి కర్మాగారంలో కాని, పేలుడుపదార్థాలు ఉపయోగించి ఖనిజం తవ్వడం వలన ఎందుకు కలుగుతుంది. తగిన జాగ్రత్తలు అన్నివిధాలా తీసుకున్నారా లేదా అన్న ప్రశ్న ఒక్కటే ముఖ్యం.

ఇక్కడ దానికి సంబంధించి ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా పరిశీలించవలసిన మరో విషయం వుంది. అది ఈ యురేనియమ్ ఖనిజం

(తరువాయి భాగం 36వ పేజీలో)

కొడిగట్టుకుపోతున్న గిరిజన దీపాలు

— వి. హనుమంతరావు

గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.434 కోట్లు ఖర్చుపెట్టనున్నట్లు ఆ శాఖ సంచాలకులు యల్. ప్రేమచంద్రారెడ్డి విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో విలేఖరులతో మాట్లాడుతూ చెప్పిన విషయాన్ని పత్రికల్లోచదివి 'అమ్మో గిరిజనులకోసం ఎన్నికోట్లు ఖర్చు పెడుతుందో' అని మూర్ఛపోయే ప్రభుభక్తిపరాయణులుండవచ్చు.

ఇది ప్రచురించిన ప్రముఖ ఇంగ్లీషు పత్రిక ఈ కేటాయింపు ఏ సంవత్సరానికి, ఇది బడ్జెట్ కేటాయింపా, ప్రణాళికా కేటాయింపా అనే ముఖ్యమైన వివరాలు ప్రచురించలేదనే విషయం అలా పక్కన పెడితే, ఇదేమీ ఘనమైన కేటాయింపు కాదని వారి జనాభాలెక్కల బట్టి చూస్తే తెలుస్తుంది. జనాభా 42 లక్షలు. అంటే తలసరి సంవత్సరం ఖర్చు రూ.1033లు. ఈ కాసిని డబ్బులతో ఎంత అభివృద్ధి సాధ్యమో ఊహించుకోవచ్చు. నిజానికి ఊహించుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఎందుచేతనంటే 2003-04 వార్షిక ప్రణాళిక పుస్తకంలో ప్రతీ కార్యక్రమానికి ఎంత కేటాయించారు, ఎంత ఖర్చయింది, సాధించాలనుకొన్నది ఎంతమేరకు సాధించారు అనే వివరాలను, అరకొరగానైనా ఇచ్చారు. ఎవరు ఏ విమర్శ చేసినా అదిగో రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ నేతలు అంటూండడం అలవాటైపోయింది. కాని ఇవి ప్రభుత్వమే ఇచ్చిన గణాంకాలు కాబట్టి, అవి నిజం కాదు అని అనలేరు.

విదేశీ సహాయంతో (ముందు డి.ఎఫ్.ఐ.డి. తర్వాత ప్రపంచ బ్యాంకు) గిరిజనాభివృద్ధి పథకానికి తొమ్మిదో ప్రణాళికలో రూ.116 కోట్లు కేటాయిస్తే, రూ.132 కోట్లు ఖర్చుపెట్టింది. ఈ పథకానికయ్యే ఖర్చులో 83 శాతం విదేశీ సహాయమే. అంటే రూ. 109 కోట్లు. దీనర్థం రాష్ట్ర ప్రభుత్వం తన నిధులనుంచి గిరిజనాభివృద్ధి పథకం కింద చేసిన ఖర్చు కేవలం 23 కోట్లు మాత్రమే. ఈ పథకం కథ ఇంకా ముగియలేదు. 2002-03లో రూ. 47 కోట్లు కేటాయిస్తే, ఇందులో 83 శాతం రూ.14 కోట్లు అయితే, ఖర్చుచేసింది రూ. 12 కోట్లు. తొమ్మిదవ ప్రణాళిక కేటాయింపు రూ.116 కోట్లయితే, 10వ ప్రణాళికలో రూ. 88 కోట్లకు దిగజారిపోయింది. దీనర్థం ప్రభుత్వం చేయాల్సిన ఖర్చు చేయకపోగా, విదేశీ సహాయాన్ని కూడా పూర్తిగా ఖర్చుచేయలేదన్నమాట. లేదా ఖర్చుచేసిన మొత్తానికి అకౌంట్లు బ్యాంకుకు పంపలేదు. కాబట్టి, తన సహాయాన్ని నిలుపుదల చేసివుండాలి. నెలకు 42 లక్షలమంది గిరిజనుల కోసం ఒకకోటి కూడా ఖర్చుచేయని ప్రభుత్వానికి అధికారంలోవుండే అర్హతవుందా?

సమీకృత ఏరియా అభివృద్ధి పథకానికి నూరుశాతం నిధులను కేంద్రమే ఇస్తుంది. ఆర్థికంగా గిరిజనులు నిలదొక్కుకోవడానికి రూపొందించిన పథకం ఇది. ఈ పథకానికి తొమ్మిదవ ప్రణాళికలో రూ.200 కోట్లు కేటాయిస్తే, ఖర్చుచేసింది రూ.138 కోట్లే. పదవ ప్రణాళికలో కేటాయింపును రూ. 305 కోట్లకు పెంచారు. ఎన్నికలొస్తున్నాయికదా, ఏ ప్రభుత్వం అధికారంలోవున్నా ఆపాటి కేటాయింపును పెంచటం సహజమే అనిఅనుకొంటే, చేసినకేటాయింపులను పూర్తిగా ఖర్చుచేయలేని గుడ్ గవర్నెన్స్ మనది. ఉదాహరణకు 2002-03లో రూ.47 కోట్లు కేటాయింపుకు గాను, ఖర్చుచేసింది రూ.18కోట్లు మాత్రమే. సహజంగానే ఈసంవత్సరంలో 40 వేల కుటుంబాలకు సహాయం చేయటం లక్ష్యం కాగా, ఆ సహాయం ముట్టింది 30వేల మందికే. నడుస్తున్నసంవత్సరంలో సహాయంచేయాల్సిన కుటుంబాల సంఖ్యను అంతకుముందు సంవత్సరం లక్ష్యం 40259తో పోలిస్తే, ఇపుడు 23410 కుటుంబాలకే పరిమితమైంది.

జీడితోటలు పెంచటం మరొక కేంద్ర ప్రతిపాదిత పథకం. నూరుశాతం నిధులు కేంద్రమే ఇస్తుంది. తొమ్మిదో ప్రణాళికలో మూడుకోట్లుఇస్తే అరకోటిమాత్రమే ఖర్చుచేసింది. తనుఖర్చుచేయదు, కేంద్రం ఇస్తే ఖర్చుచేయదు. అమ్మా పెట్టానివ్వదు, అడుక్కుని తినానివ్వదన్నట్లుంది. గత సంవత్సరంలో 15 లక్షలు కేటాయిస్తే ఒక్క నయాపైసా ఖర్చుకాలేదు.

గిరిజన రిసెర్చి స్కాలర్లకు కేంద్రం తొమ్మిదో ప్రణాళికలో రూ. 25 లక్షలు రాష్ట్ర ప్రభుత్వానికిస్తే మన బడుద్దాయి ప్రభుత్వం ఖర్చుపెట్టింది ఒకటిన్నర లక్షలు మాత్రమే. వంద స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని ఆ ప్రణాళికలో లక్ష్యం పెట్టుకుంటే ఇచ్చింది మొత్తం అయిదు సంవత్సరాల్లో ముగ్గురికి మాత్రమే. గత సంవత్సరం కేటాయింపు అయిదులక్షల్లో సగంకూడా ఖర్చుచేయలేదు, తొమ్మిది మందికి ఇవ్వాలనుకుంటే ఇచ్చింది అయిదుగురికే. అలాగే పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం గత సంవత్సరం కేంద్రం చేసిన కేటాయింపులో ప్రతి అయిదు రూపాయలకు ఒక్కరూపాయ, రాష్ట్రం కేటాయింపులో సుమారుగా మూడోవంతు మాత్రమే ఖర్చుచేసింది. రాష్ట్రందగ్గర ఇలాంటి మంచిపనులకు డబ్బులుండవు; కేంద్రం ఇచ్చిన డబ్బు ఖర్చుచేయకపోవడానికి ఏం రోగం వచ్చింది? ప్రణాళికాశాఖ కార్యదర్శి నిద్రపోతున్నాడా? డబ్బుఖర్చు ఇంత తక్కువైనా, లక్ష్యాన్ని మించి స్కాలర్‌షిప్‌లు మంజూరు చేశారట. ప్రణాళికా శాఖలో జరిగే మరో విచిత్రం ఇది. అయితే ఒకటి అయివుండవచ్చు. మంజూరు చేశారుకాని విడుదల చేశామని చెప్పలేదుగా.

పరీక్షలకు ముందు విద్యాశిక్షణ కేంద్రాలను కేంద్రం, రాష్ట్రం చెరిసగం ఖర్చుతో అమలుచేసే పథకానిదీ అదేకథ. ఈపథకం 126 వేలమంది గిరిజనబాలబాలికలను చేర్చుకోగలిగే 501 ఆశ్రమ పాఠశాలలు (అంతమంది విద్యార్థులున్నారా అన్నది వేరే విషయం) 505 హాస్టళ్ళు 4317 ఏకోపాధ్యాయ పాఠశాలలు నడుపుతున్నామని ప్రభుత్వం అంటోంది. ఈ బాలబాలికలకు కలుగచేసిన సౌకర్యాల లిస్టు చదివితే, మైదానప్రాంతంలోని తల్లితండ్రులువాళ్ళపిల్లల్నికూడా ఈ ఆశ్రమ పాఠశాలలకు పంపించాలనుకొనేటంత ఆకర్షణీయంగా వున్నాయి. 1. పదిన్నర నెలలపాటు మూడుపూటలా భోజనం 2. ప్రతి సంవత్సరం రెండుజతల బట్టలు 3. నోట్‌బుక్స్, వర్క్ బుక్స్ వగైరా 4. ప్రతినెలా సబ్బులు, కొబ్బరినూనె 5. ఆడుకోవడానికి ఆటవస్తువులు, పుస్తకాలు 6. క్షవరం ఖర్చు, యువతులకు సానిటరీ నాప్‌కిన్స్ 7. మందులకయ్యే ఖర్చు 8. తొమ్మిది, పది తరగతి

(తరువాయి భాగం 36వ పేజీలో)

సామాజిక బాధ్యత పాటిస్తేనే పత్రికలకు సార్థకత

— సునీల్

జర్నలిజం అంటే సకల వృత్తుల సమాచారం అని మనం చెప్పుకుంటాం. జనమాధ్యమాలు సైతం ప్రపంచం నలుమూలల నుంచి పలురంగాలకు సంబంధించిన సమాచారాన్ని అందించడం వరకే అవి పరిమితమైపోలేదు. ఆయా రంగాలలో జరుగుతున్న మార్పులు, వస్తున్న పరిణామాలు, వాటి ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉండబోతుందన్న వివరాలనుసైతం పత్రికలు కూలంకషంగా చర్చిస్తుంటాయి. ఆయా అంశాలకు సంబంధించి నిష్ణాతులు, ప్రముఖుల ఆలోచనలను కలబోస్తూ పాఠకులకు అందిస్తుంటాయి. ఆయా రంగాల పనితీరును సమీక్షిస్తుండడం, విశ్లేషించడం, విమర్శించడం చేస్తూ సంస్కరణలకు కావాల్సిన సలహాలు, సూచనలు సైతం ఇస్తుంటాయి. జనమాధ్యమాల నుంచి ప్రజలు ఆశిస్తున్నది కూడా ఇదే. అయితే ఈ బృహత్ కార్యంలో మీడియా ఎంత నిక్కచ్చిగా వ్యవహరిస్తుందన్నదే ప్రశ్న. విస్వసనీయత, సత్యనిష్ఠ, నిష్పాక్షికత అన్నవి ఊపిరిగా జనమాధ్యమాల జీవనం సాగాలన్నదే అనాదిగా ప్రజల ఆకాంక్ష.

వందేళ్ళకు పైబడిన ఘనమైన చరిత్రవున్నటువంటి తెలుగు పత్రికారంగం పనితీరును సమీక్షించడమనేది పిహెచ్.డి. స్థాయికి సైతం మెచ్చినటువంటి అంశం. స్థూలంగా పరిశీలించినట్లయితే మనకు కొన్ని అంశాలు చాలా స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనబడతాయి. విలువలపరంగా తెలుగు పత్రికల ప్రస్థానాన్ని పరిశీలించినట్లయితే మనకు స్వాతంత్ర్య పూర్వపు పత్రికలు అనుసరించినటువంటి ఒక ఆదర్శనీయ మార్గాన్ని ఆ తదనంతర పత్రికలు అందిపుచ్చుకోలేక పోయామని చెప్పొచ్చు. పత్రికల పనితీరు, సంపాదకీయ ప్రభావం, సంపాదకుడి పాత్ర వంటి అంశాలమీద జరిగిన సదస్సులు, సభలు అన్నీ అలనాటి పత్రికలను కొనియాడడం, నేటితరం పత్రికలను తెగనాడడం మనంచూస్తూనేఉన్నాం. ఈఅంశాలమీద పాత్రికేయులు, రచయితలరచనల్లోసైతం ఇదేరకమైన నిరాశపూరితమైనఅభిప్రాయాలే కనిపిస్తాయి. విలువలపరంగా పత్రికల స్థాయి దిగజారడం అనేది అందరినీ కలచివేసే అంశమే. అయితే అందుకు దోహదం చేస్తున్న అంశాల పట్ల, శక్తుల పట్ల పత్రికారంగం ఎందుకని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు? ఎందుకని మనం అప్రమత్తం కాలేకపోతున్నాం అన్నది జర్నలిస్టులుఅందరూతమకుతాముగా చేసుకోవాల్సినప్రశ్నలు.

స్వాతంత్ర్యానికి పూర్వం వున్నటువంటి కృష్ణాపత్రిక, ఆంధ్ర పత్రికలది తెలుగువారిని స్వతంత్ర్యసముపార్జననిమిత్తం సమాయత్తం చేసిన ఆదర్శనీయమైన చరిత్ర. సంపాదకమహోదయులు ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వంలో కృష్ణాపత్రిక స్వాతంత్ర్యయోధులకు ఆ మాటకొస్తే మొత్తం తెలుగుజాతికి దిశానిర్దేశనం చేసినటువంటి ఘనచరిత్రను సముపార్జించింది. ఆ కాలంలో పత్రికలన్నిటిది అదే బాట, అదే ధోరణి. సంపాదకులే పత్రికలను నిర్వహించేవారు. అక్షరాలే దివిటీలుగా పాత్రికేయస్వేచ్ఛ జాజ్వల్యమానంగా ప్రకాశించిన రోజులవి. స్వాతంత్ర్య సముపార్జన, సామాజిక దురాచారాల నిర్మూలన వంటి సమున్నత ఆశయసాధనకు అంకితబద్ధమై పత్రికలు పనిచేసిన రోజులవి. పత్రికలను, పాత్రికేయులను ఒక సామాజిక నిబద్ధత నడిపించిన రోజులవి. అయితే స్వాతంత్ర్యానంతరం పత్రికలు అదే స్ఫూర్తిని కొనసాగించలేకపోయాయి. ఆ త్యాగపూరిత మైన వారసత్వం అదేవిధంగా అందిరాలేకపోవడం తెలుగువారి దురదృష్టం. సంపాదకులే యజమానులుగా వున్నరోజులు కాస్తా యజమానులే సంపాదకులుగా వ్యవహరించే స్థాయికి దిగజారాయి. పెట్టుబడే ప్రధాన అర్హతగా పత్రికల స్థాపన జరగడంతో పెట్టుబడి దారులు సంపాదకులుగా అవతారమెత్తడం ప్రారంభమైంది. దాంతో సామాజిక విలువల స్థానే వ్యాపార విలువలు పత్రికా సమాజాన్ని శాసించడం మొదలైంది. ఒకప్పుడు సంపాదకుడు, పాత్రికేయులు నిర్దేశించినటువంటి సమాచారమే పత్రికల్లో వచ్చేది. కానీ ప్రస్తుతం వారి మాటలకు బదులుగా అడ్వర్టైజింగ్, మార్కెటింగ్ మేనేజర్ల సూచనల ప్రకారం పత్రికల్లో వార్తలు, ఇంటర్వ్యూలు వస్తున్నాయి. వ్యాపార ప్రకటనలే పత్రికల తీరుతెన్నుల్ని శాసిస్తున్నాయి. పెట్టుబడిదారుల స్వార్థ ప్రయోజనాలే పత్రికలకు పాలసీగా చలామణీ అవుతున్నాయి. పాత్రికేయుల్లో సైతం అదేవిధమైన ధోరణి బలంగా వేళ్ళూనుకుంది. వృత్తితత్వాన్ని మించిన బలమైన ఆకర్షణ, ఆపాదిత మైన గౌరవ మర్యాదలు, వాటిని ఆసరాగా చేసుకుని పబ్బం గడుపు కోవాలనే స్వార్థ బుద్ధిపరులైన జర్నలిస్టులే నేడు బయటి ప్రపంచానికి కనిపిస్తున్నారు. కొండొకచో ఎక్కడో వున్నటువంటి నైతిక వీరులు, సత్యశీలురు, వారి నిస్వార్థపరమైన వృత్తితత్వాలు పాత్రికేయవృత్తి పరువు, ప్రతిష్టలకు, గౌరవ మర్యాదలకు పెట్టని కోటలుగా వుంటున్నప్పటికీ అవన్నీ వెలుగుచూడని విషయాలవుతుండడం శోచనీయం. ఈ దృష్ట్యానే పత్రికల విశ్వసనీయత అనేది తగ్గుతూ వస్తోంది. ఒకప్పుడు పత్రికల్లో వచ్చిన విషయాన్ని శిరోధార్యంగా భావించిన ఇదే సమాజం నేడు పత్రికలు చెప్పిన విషయాలకి ఆ, అవి ఇలాగే రాస్తాయిలే అనే ధోరణి పెరుగుతోంది. పత్రికల్ని,

అవి అందిస్తున్న సమాచారాన్ని 'నమ్మలేం' అంటూ పాఠకుల స్పందనగా కిందటేడాది రచన జర్నలిజం కళాశాలవారు జరిపినసర్వేలో వెల్లడైంది. పత్రికల విశ్వసనీయత తగ్గుతోందనడానికి ఇంతకంటే బలమైన నిదర్శనమింకేం కావాలి?

అలాగని, పాత్రికేయ ప్రపంచమంతా పూర్తిగా దిగజారిందని, విలువలు లుప్తమైపోయయని తీర్మానించడానికి వీల్లేదు. ఏ వ్యవస్థలోనైనా లోపాలుండడమనేది సహజం. వ్యవస్థలూ, వాటి విలువల గురించి పరితపించేవారికి కొంత అసంతృప్తి వుండడమనేది కూడా సహజాతిసహజం. అయితే ఫోర్త్ ఎస్టేట్‌గా పిలువబడే మీడియా మిగిలిన మూడు వ్యవస్థలు–శాసన నిర్మాణ, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల పనితీరును సమీక్షిస్తూ, మంచి,చెడుల్ని విశ్లేషిస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ వుండాలని చెప్పుకుంటాం. మీడియా ఆ పని ఎప్పుడూ చేస్తూనే ఉంది. అయితే అది ఏది ఎంత నిష్పక్షపాతంగా అనేది చర్చించాల్సిన అంశం. మిగిలిన మూడు ప్రధానరంగాల పని తీరును పోస్టుమార్టమ్ చేస్తున్న మీడియా పనితీరును సమీక్షించేందుకు ప్రత్యేకించి ఎటువంటి వ్యవస్థలేదు. అందుకని తాను ఎంత సవ్యంగా, ఎంత బాధ్యతాయుతంగా విధినిర్వహణ చేస్తున్న విషయాన్ని తనకు తానుగానే మీడియా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అంటే మీడియాకు అక్కౌంటబిలిటీ (జవాబుదారీతనం) పాటించే పరిస్థితులేం లేవు. ప్రెస్‌కౌన్సిల్ లాంటివి వున్నా అవి ఆచరణరీత్యా కోరలులేని పాముల వంటివే. అందుకని జనమాధ్యమాలు రెస్పాన్స్‌బిలిటీ (సామాజిక బాధ్యత)ను విస్మరించకుండా పనిచేయడమొకటే ఉత్తమోత్తమమార్గం.

జనమాధ్యమాలు, ప్రత్యేకించి పత్రికలు వివిధ రంగాలకు సంబంధించిన మంచి చెడులు, వాటిల్లో వస్తున్న మార్పులు, రావాల్సిన మార్పులువంటి విషయాల గురించి విశ్లేషిస్తూ కొండొకచో తీర్మానిస్తూ వుంటాయి. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పత్రికల పనితీరును కూడా సమీక్షించాల్సిన అవసరముంది. పత్రికలకు సామాజిక బాధ్యత అనేది తప్పనిసరి. పత్రికా నిర్వహణ నేడు వ్యాపారమైనప్పటికీ అవి అన్ని వ్యాపారాల వంటిది కాదనేదే ప్రజల అభిప్రాయం.

పత్రికలు ఏం రాస్తున్నాయి, ఎలా రాస్తున్నాయి... అవి అందిస్తున్న సమాచారం సామాజిక ప్రయోజనాన్ని ఆశించే విధంగా వుందా...ఇత్యాది విషయాల్ని శాస్త్రీయంగా పరిశోధించే సర్వేలు జరగాలి. ఇది ఒక సోషల్ ఆడిట్ మాదిరిగా జరగాలి. పాఠకులే విలువల్ని మదింపుచేసే విధంగా ఇటువంటి సర్వేలుగానీ, చర్చలు గానీ క్రమం తప్పకుండా జరిగినట్లయితే, ఆ ఫలితాలు పత్రికలకు దిశానిర్దేశం చేయగలవని ఆశించవచ్చు. ప్రజల ఆశలు, ఆశయాల మేరకు పత్రికలను నడపడమనేది పాత్రికేయులు, పత్రికా యాజమాన్యాలు అనివార్యంగా అనుసరించాల్సిన విధానం. సమాజ వ్యక్తిత్వం, సంస్కృతిని ప్రతిబింబించేవిధంగా పత్రికారచన సాగాలనేదే పాఠకాభిప్రాయం. పత్రికలకు వ్యాపార వ్యక్తిత్వం కాకుండా పాత్రికేయ పూరిత స్వతంత్ర వ్యక్తిత్వం వుండాలి.

విశ్వసనీయంగా, నిష్పక్షపాతంగా వార్తల్నిరాసే ధోరణిని పత్రికలు కొనసాగించలేకపోవడం దురదృష్టకరం. పత్రికల్లో వచ్చిన వార్తలన్నింటినీ నమ్మలేని పరిస్థితి నెలకొన్నది. వాస్తవాలు తెలుసుకుని విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి పాఠకులు రెండు మూడు పత్రికల్ని చదవాల్సి వస్తుంది. పత్రికలు అవలంబిస్తున్న ఈ ధోరణులపై క్రమం తప్పకుండా చర్చలు జరగాలి. పత్రికలు అనుసరిస్తున్న విధానాల్లోని లోపాల్ని, పాత్రికేయుల రాతల్లో దాగున్నటువంటి అంతరార్థాలు పట్టిచూపేవిధంగా రచనలురావాలి. అందుకు మళ్ళీ పత్రికలు, పాత్రికేయులే ఉద్యుక్తం కావాలి. అంటే పత్రికల పనితీరును విశ్లేషించడమనేది పత్రికల ఆత్మ పరిశీలనగానే సాగాలి. గతంలోనైతం ఇటువంటి ప్రయత్నాలు జరిగాయి. తెలుగు పత్రికల్లో పాత్రికేయులు చేస్తున్న తప్పుల్ని చెపుతూ, వారు రాసే విధానాన్ని సమీక్షిస్తూ సీనియర్ పాత్రికేయులు, తెలుగు విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ విజిటింగ్ ప్రొఫెసర్ జి.యస్. వరదాచారి ఆంధ్రభూమి దినపత్రికలో 'దిద్దుబాటు' శీర్షికన కొంతకాలం ఇటువంటి కసరత్తు చేశారు. పుస్తకంగా కూడా 'దిద్దుబాటు' పాత్రికేయాదరణ పొందింది. 'దర్పణం' శీర్షికన ఆయనే మరో పత్రికలో సంపాదకీయాలు, పత్రికల వార్తారచన విధానంపై సమీక్ష వ్యాసాల్ని రాశారు. ఆ మధ్య 'జనమాధ్యమాలు–సామాజిక బాధ్యత' అన్న అంశంపై రచన జర్నలిజం కళాశాలవారు రెండు రోజుల సదస్సు నిర్వహించారు. జనమాధ్యమాలు వివిధ అంశాలపై అందిస్తున్న సమాచారంలో సామాజికబాధ్యత ఏమేరకుఉంటుందన్న విషయాన్ని ఉపన్యాసకులంతా ఈసదస్సులో సమగ్రంగా చర్చించారు. ఆ ప్రసంగాలను కళాశాల పుస్తకరూపంలో పాఠకులందించడం ముదావహం. టి.వి. ఛానళ్ళు, సీనియర్ జర్నలిస్టులు ఇటువంటి చర్చలకు ఆస్కారమిస్తూ రచనలు చేస్తే బాగుంటుంది. గతంలో 'తేజ' ఛానల్ కొద్దిరోజులపాటు ఉదయం పూట పత్రికల వార్తల్ని సమీక్షించే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇటీవల 'వార్త' దినపత్రిక సైతం 'జర్నలిజం–చర్చ' అంటూ పత్రికలు ఎటువంటి విధానాల్ని అనుసరించాలనే దానిపై పాఠకులతో ఒక చర్చాకార్యక్రమాన్ని నిర్వహించింది. పత్రికలు ఈ విధంగా ఆత్మపరిశీలన చేసుకోవడం అనేది ఆహ్వానించదగిన పరిణామం. ఈ కృషి మరింత విస్తృతంగా, మరింత శాస్త్రీయంగా సాగితేనే ఆశించిన ప్రయోజనం నెరవేరుతుందేమో? ○

పేటెంట్స్‌ను దుర్వినియోగం చేస్తున్న బహుళజాతి సంస్థలు

— గన్నే శ్రీపతినాయుడు

ఒకానొక శాస్త్రజ్ఞుడు విచిత్రమైన వస్తువులను తయారు చేయడం, తయారుచేసేపద్ధతిని రహస్యంగావుంచడం, తయారుచేసే ఫార్ములానుకొనడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడటం ఇతివృత్తంగా కల నాటికలను రేడియోలో వింటుంటాం. కథలలో చదువుతూ వుంటాం. ఫార్ములా రహస్యం కాపాడుకునేందుకు ఫార్ములాను కొనుక్కున్న పారిశ్రామికవేత్త అనేక తంటాలు పడుతుంటాడు. ఫార్ములా రహస్యం కనుగొనడానికి ఇతరులు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తుంటారు. ఫార్ములా కనుగొన్నవారి, లేక కొన్నవారి హక్కులను రక్షించేదే పేటెంట్స్ అని చెప్పవచ్చును.

1331వ సంవత్సరంలోనే మూడవ ఎడ్వర్డ్ అశేష నైపుణ్యంగల ప్లెనిష్ చేనేతపనివారికి మగువలను, మద్యాన్ని ఎరచూపి తనదేశానికి ఆకర్షింప ప్రయత్నించాడు. ప్లెనిష్ అధికారులు తమ దేశంనుండి చేనేత కార్మికులు ఇంగ్లండుకు వెళ్ళకుండా చర్యతీసుకోవలసివచ్చింది. అంటే ప్రస్తుత పేటెంట్స్‌కు పునాదులు కొన్ని శతాబ్దాల క్రిందటే పడ్డాయని చెప్పవచ్చు. ప్రపంచంలో మొట్టమొదటి పేటెంట్స్ చట్టాన్ని వెనీస్ సెనేట్ 1474లో చేసింది.

ఒకదేశ పారిశ్రామిక, వైజ్ఞానిక, సాంకేతిక, ఆర్థిక పురోభివృద్ధిని అంచనావేసేందుకు ఆ దేశంలోని పేటెంట్స్ సంఖ్య, పేటెంట్స్ ఏమేరకు పరిశ్రమలలో, పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారన్న విషయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. కాబట్టి, శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలు వారు కొత్తగా కనుగొన్న విషయాలను, కనిపెట్టిన నూతన పరికరాలను తయారుచేసే పద్ధతులను వారు పేటెంట్స్ కార్యాలయంలో నమోదుచేయడం చాలా అవసరం. ఇంతేగాక దేశంలోనూ, ప్రపంచంలోనూ పేటెంట్స్ చట్టాలలో, పేటెంట్స్ అనుసరించే పద్ధతులలో వచ్చే మార్పులను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. పేటెంట్స్‌కు సంబంధించిన అన్ని విషయాలతోపాటు, పేటెంట్స్ భారతదేశ వైజ్ఞానిక, సాంకేతిక, ఆర్థిక పురోభివృద్ధికి దోహదం చేసేందుకు ఏమిచేయాలి అన్న అంశాలను కూడా చర్చించాలి. పేటెంట్స్‌కు సంబంధించిన సమాచారం డాక్యుమెంటు చేయడం, ఈ సమాచారం పరిశోధన చేసేవారికి అవసరం అయినపుడు అందచేయడం, కనుగొన్న నూతన వస్తువులను, విషయాలను ఇంకా అభివృద్ధిచేసి దేశ స్వావలంబనమేర్పడేందుకు సహాయపడే విధంగా పేటెంట్స్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం వుంది.

ఎన్నోవిధాలుగా దేశ పురోభివృద్ధికి తోడ్పడే పేటెంట్స్ అంటే ఏమిటో తెలుసుకుందాం. ఎవరైనా ఒక కొత్త వస్తువును నూతన పద్ధతిలో కనుగొన్నప్పుడు, లేదా కొత్త విషయం కనుక్కొంటే ఒక నిర్ణీతకాలం మాత్రం ఆ కనుగొన్న వ్యక్తి తాను మాత్రమే ఆ వస్తువును తయారుచేయడానికి, అమ్మడానికి, లేక కనుగొన్న విషయం తాను మాత్రమే ఉపయోగించడానికి ప్రభుత్వం అతనికిచ్చు హక్కునే పేటెంట్‌గా నిర్వచించవచ్చును. ఇంకోవిధంగా చెప్పాలంటే ఒక వ్యక్తి కనుగొన్నందుకు ప్రతిఫలంగా కొంతకాలం మాత్రం తాను మాత్రమే దానివల్ల వచ్చే ప్రయోజనాలను అనుభవించేందుకు ప్రభుత్వం ఇచ్చే రక్షణను పేటెంట్‌గా పేర్కొనవచ్చు. అట్లాగని పేటెంట్స్ పొందిన వ్యక్తి తన ఇష్టంవచ్చినట్లు దానిని దుర్వినియోగం చేయడానికి హక్కు లేదు. పేటెంట్లు పొందినవ్యక్తులు వీటిని దుర్వినియోగం చేయకుండా అరికట్టడానికి ప్రభుత్వం కొన్ని చట్టాలు చేసింది. ఉదాహరణకు ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన వస్తువులను తయారుచేసే ఫార్ములాను ఒక పారిశ్రామికవేత్త పేటెంట్ హక్కు పొందాడని అనుకుందాం. ఈ హక్కు పొందిన తర్వాత తాను ఆ ఫార్ములానుప యోగించి వస్తువును లేక మందును తయారుచేయకుండా పేటెంట్ హక్కును దుర్వినియోగంచేస్తే వారిపై చర్యతీసుకునేహక్కు ప్రభుత్వానికి వుంది. ఇంతేకాక అవసరమైతే ప్రభుత్వం ఆసుపత్రులకు మందులు సరఫరా చేసేందుకు పేటెంట్ చేసిన ఫార్ములానుపయోగించి, మందులు తయారుచేసే హక్కు కూడా ప్రభుత్వమునకు వుంది.

పేటెంట్‌హక్కు పొందినవ్యక్తి తనఫార్ములాను తన ఇష్టంవచ్చిన వారికి అమ్మవచ్చును. పేటెంట్‌ను ప్రైవేటు ఆస్తిహక్కుతో పోల్చ వచ్చును. ఎవరైనా తన పేటెంట్ హక్కుకు భంగం కలిగిస్తే కోర్టుకు వెళ్ళి, న్యాయం చేకూర్చాలని కోర్టుకు విజ్ఞప్తి చేసుకోవచ్చు. ఇక పేటెంట్స్ ఉపయోగానికి వస్తే, వస్తువులు విరివిగా అమ్ముడుపోవ దానికి, ఇంతకుముందు చెప్పినట్లు, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడుతాయి. పేటెంట్ పొందడం వలన పేరువచ్చి ఆ వస్తువులకు గిరాకీ కూడా పెరుగుతుంది.

కాని కొంతమంది పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా బహుళజాతి కంపెనీలు తాము పొందిన పేటెంట్స్‌నుపయోగించి విదేశాలలో, ముఖ్యంగా అభివృద్ధి పొందని, అభివృద్ధి చెందుతున్న దేశాలలో, సాంకేతిక, ఆర్థిక ప్రగతిని కుంటుపరుస్తున్నాయి.

ఈ బహుళజాతి సంస్థలు మనదేశంలోనే ప్రజావసర వస్తువులను ఉత్పత్తి చేస్తామని వారి ఫార్ములాకు పేటెంట్స్ సంపాదించి, ఆ వస్తువులను తాము ఉత్పత్తిచేయకుండా, మనదేశ పారిశ్రామికవేత్తలను ఉత్పత్తి చేయనీయకుండా మనదేశ అభివృద్ధిని కుంటుపరుస్తున్నాయి. లేదా దేశావసరాల మేరకు ఉత్పత్తి చేయకుండా తక్కువగా ఉత్పత్తిచేసి కృత్రిమకొరతను సృష్టించి, ఆమేరకు తమదేశాన్నుంచి ఆ వస్తువులను దిగుమతి చేయడం ద్వారా కూడా మనదేశాన్ని కొల్లగొడుతున్నాయి. బహుళజాతి సంస్థలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పేటెంట్స్‌ను దుర్వినియోగం చేయకుండా కట్టుదిట్టమైన చట్టాలు చేయాలి.

మనదేశంలో పేటెంట్స్ కార్యాలయం కలకత్తాలో వుంది. ఈ కార్యాలయం బ్రాంచీలు ఢిల్లీ, బొంబాయి, మద్రాసుల్లో వున్నాయి. వీటికితోడు కేంద్ర ప్రభుత్వం 60 కేంద్రాలను దేశంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసింది. మనరాష్ట్రంలో ఈ కేంద్రాలు వున్నాయి. అవి ఆర్.ఆర్.లాబ్స్, హైదరాబాదు, రాష్ట్ర కేంద్ర గ్రంథాలయం, హైదరాబాదు, ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్, ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేర్‌లో ఏర్పాటుచేశారు.

నాగపూర్‌లో ఏర్పాటుచేసిన జాతీయ పేటెంట్స్ సమాచారకేంద్రం ప్రపంచంలోని అన్నిదేశాలలోని పేటెంట్స్‌కు సంబంధించిన సమాచారం, డాక్యుమెంట్లను సేకరిస్తుంది. ○

వర్గసమాజంలో అనివార్యం 'సమ్మె'

— ఇప్ప వీరారెడ్డి

ఆర్థిక సంస్కరణలను శరవేగంగా అమలుచేస్తూ ప్రైవేటీకరణ ప్రక్రియతో పబ్లిక్‌రంగసంస్థలనుప్రైవేటుయాజమాన్యానికి కారుచౌకగా కట్టబెట్టే కార్యక్రమాన్ని చివరిదశకు తీసుకొచ్చిన ప్రభుత్వం, వాటితో పాటుగా ప్రైవేటురంగానికి అత్యంత ప్రీతిపాత్రమైన 'సమ్మె నిషేధం' తీర్పునిసైతం ప్రైవేటుయాజమాన్యానికి కానుకగా సమర్పించుకున్నది. నిరుద్యోగం, ఇ.ఎస్.ఐ. సౌకర్యాల కుదింపు, ప్రావిడెంట్ ఫండ్‌మీద వడ్డీరేటు తగ్గింపు, కార్మికులను తొలగించేందుకు వి.ఆర్.ఎస్. ప్రయోగం, సెకండ్ లేబర్ కమీషన్ ప్రతిపాదిత కార్మిక వ్యతిరేక సంస్కరణలు, ధరల పెరుగుదల, యూజర్ ఛార్జీల విధింపు, పర్మనెంట్ ఉద్యోగుల ఖాళీల్లో కాంట్రాక్ట్ లేబర్ నియామకం లాంటి కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి కార్మికులను దెబ్బతీస్తుంటే సుప్రీంకోర్టు తీర్పు వీటికి పరాకాష్టగా నిలుస్తుంది.

తమిళనాడులో ఉపాధ్యాయులతో సహా ప్రభుత్వోద్యోగులు తమ న్యాయసమ్మతమైన డిమాండ్లసాధన విషయంలో చేసిన సమ్మెను ప్రభుత్వం నిరంకుశ విధానాల ద్వారా అణచివేయడం, ఆ నిరంకుశ విధానాలను సమర్థిస్తూ అంతకంటే మరింత ప్రమాదకరంగా పూర్తి అప్రజాస్వామికంగా కార్మికుల ప్రయోజనాలను కాలరాచే తీర్పును సుప్రీంకోర్టు ఇవ్వడంపై తీవ్రమైన చర్చ జరుగుతుంది. ఆ తీర్పుపట్ల ప్రత్యక్ష ప్రభావిత ఉద్యోగ కార్మిక సంఘాలు తీవ్రంగా నిరసించడంతో పాటు, ప్రజాతంత్రవాదులు, పలువురు మేధావులు, ప్రజాసంఘాలు, న్యాయకోవిదులతోపాటు భారత అటార్నీ జనరల్ సోలీసొరాబ్జీలాంటి ప్రముఖులు కూడా సుప్రీంకోర్టు తీర్పుపట్ల తమ వ్యతిరేకతను, అభ్యంతరాన్ని వ్యక్తపరిచారు. వామపక్షపార్టీలు ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకించగా కొన్ని పార్లమెంటరీపార్టీలు కూడా ఈ తీర్పును తప్పు పట్టాయి. ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ తీర్పుపట్ల పూర్తి సంతృప్తిని (బహుశా ముఖ్యమంత్రికి మాత్రమే కావచ్చు) ప్రకటించగా, కేంద్రప్రభుత్వ మతవాద పాలకపార్టీ మాత్రం ఈ తీర్పు విషయంలో చైనా, రష్యా తదితర దేశాల అనుభవాలను అధ్యయనం చేయాల్సి వుందనే డొంకతిరుగుడు సమాధానంతో తన సంతృప్తిని అస్పష్టంగానైనా బయటపెట్టుకున్నట్లయింది. కమ్యూనిజం, సోషలిజం ఊసే గిట్టని మతవాద భాజపాకు సమ్మెహక్కు విషయంలో మాత్రం చైనా, రష్యా అనుభవాలు (ఇప్పుడక్కడ కమ్యూనిజమే లేదన్నది వేరే విషయం) అధ్యయనం చేయాల్సిన అవసరమెందుకో అర్థం కాదు.

తీర్పు విషయంలో సాధారణ ప్రజానీకం నుండి సైతం అనుకూల వ్యతిరేక ధోరణులు వెల్లడవుతున్నాయి. ఉద్యోగుల జీతభత్యాలు, సెలవులు, ఇతర అలవెన్సులు, ప్రోత్సాహకాలు, పెన్షన్లు, బోనస్‌లు, తదితర సౌకర్యాల రీత్యానే కాకుండా వారి అవినీతికర పనివిధానం రీత్యానూ సాధారణ ప్రజానీకం మొదలు ఒక మోస్తరు బుద్ధిజీవుల వరకు సుప్రీంకోర్టు నిషేధపు తీర్పును సమర్థిస్తున్నారు. అంతమాత్రాన సుప్రీంకోర్టు గాని, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాలు లాంటి ప్రభుత్వాలు గాని సంబరపడి చంకలు గుద్దుకోవాల్సిన పనేంలేదు. ఎందుకంటే జీతభత్యాలు, అలవెన్సులు, సెలవులు, పెన్షన్లు, బోనస్‌లు, తదితరసౌకర్యాలనేవి ఏ ఉద్యోగికైనా యజమానుల దయా దాక్షిణ్యాల ఆధారంగా లభించేవి కావు. తన శ్రమకు ప్రతిఫలంగా (పూర్తిగా కూడా కాదు) చెందాల్సినవే వారికి లభిస్తున్నాయి. అందులో ఎవరికీ అభ్యంతరం ఉండనవసరం లేదు. తీర్పును సమర్థించడానికి చేస్తున్న మరో వాదన అవినీతికర పనివిధానం. అయితే అవినీతికర పనివిధానం మొత్తం శ్రామికవర్గానికి వర్తించాల్సిన జనరల్ విషయం ఏమీకాదు. ప్రధానంగా ఇది పరిపాలనా విధులు నిర్వర్తించే ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన విషయంగానే కనబడుతుంది. కాబట్టి అవినీతికర పనివిధానం ఆధారంగా మొత్తం శ్రామికవర్గానికి సమ్మెహక్కు లేదనే సుప్రీంకోర్టు తీర్పును సపోర్టు చేద్దామనే వాదన నిలబడదు. దీనిప్రకారంగా అవినీతికి అవకాశంలేని శ్రామికవర్గాలకు సమ్మెహక్కు ఉండితీరాల్సిందేనని అనుకోవాల్సి వుంది. కాదూ, కూడదు ఈవాదనంతా మేం వినదలుచుకోలేదు, ఉద్యోగులు అవినీతి పరులుగా మారి ఆస్తులు పోగేసుకుంటున్నారు కాబట్టి వారికి సమ్మె హక్కు లేదన్నట్లయితే ప్రశ్నించాల్సింది అవినీతి విధానాన్ని, ఆస్తులు పోగేసే స్వభావాన్నే కాని, వాటికి పరిష్కార మార్గం సమ్మెనిషేధం తీర్పును బలపరచడంలో ఉండదన్నది గమనించాలి. ఉద్యోగుల్లో అవినీతి ద్వారా ఆస్తులు పోగేసుకునే విధానాన్ని, ప్రజల పట్ల బాధ్యతారాహిత్యాన్ని తప్పక ఖండించాల్సిందే. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. గుమాస్తా స్థాయి ఉద్యోగి పాల్పడే అవినీతికి ఉన్నతస్థాయి అధికారి రాజకీయ నాయకులు పాల్పడే అవినీతికి కారణాలు ఒకేరకమైనవి కావు. ఆ కారణాలను ఇక్కడ వివరించడం సాధ్యంకాదు. ఏదిఏమైనా అవినీతి బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించడమన్నది ఉద్యోగవర్గాలకే పరిమితం చేయకుండా స్థాయిభేదాల కతీతంగా రాజకీయ నాయకుల, ఉన్నతో ద్యోగులకు కూడా వర్తింపచేయాలి. ఏది ఏమైనా అవినీతిని సాకుగా చూపెట్టి సమ్మెహక్కు నిషేధాన్ని బలపరిచే వాదనలో ఎలాంటి బలమూ లేదని తేలిపోతుంది.

అసలు రాజ్యాంగంలో రాసిలేదు కాబట్టి కార్మికులు సమ్మె హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించకూడదనే సుప్రీంకోర్టు వాదన అసంబద్ధమైనది. పనిస్థలాల్లో, ఫ్యాక్టరీల్లో పని పరిస్థితులు, పని గంటలు, రక్షణ పద్ధతులు, లాకౌట్లు, జీతనాతాలకు, సెలవులకు ప్రమాదాల కారణంగా జరిగే నష్టాలకు సంబంధించిన అనేక విషయాల్లో కార్మికులు కొన్నివందల ఏళ్ళుగా అవిశ్రాంతంగా చేసిన పోరాటాల ఫలితంగా కార్మికుల చట్టాలు, ఫ్యాక్టరీ చట్టాలు వచ్చాయన్నది సుప్రీంకోర్టు న్యాయాధీశులకు తెలియదని అనుకోలేం. ఈ చట్టాలను ప్రపంచంలోని దాదాపు అన్నిదేశాల ప్రభుత్వాలు తమతమ రాజ్యాంగంలో స్థిరపరుచుకున్నాయన్న విషయమైనా మన సుప్రీం పెద్దలకు తెలిసిఉండాలి. అయితే ఈ ఫ్యాక్టరీ చట్టాలు

రూపొందించబడి కొన్నివందల ఏళ్ళవుతున్నా కూడా ఈనాటికి అనేక దేశాల్లోని ప్రైవేటు పారిశ్రామిక యాజమాన్యం వీటిని కనీసంగా కూడా అమలుపరచడం లేదంటే అతిశయోక్తి కాదు. అందులో మనదేశానికి కూడా ఎలాంటి మినహాయింపు లేదు. దేశంలోని అనేక ప్రైవేటు ఫ్యాక్టరీల్లోనూ, ఇండస్ట్రీస్‌లోనూ ఈనాటికీ పనిదినం పదిగంటలుగా, కొన్నికొన్ని చోట్ల 11, 12 గంటలుగా కూడా కొనసాగడం ఒక ఉదాహరణ మాత్రమే. లాభాపేక్షే ప్రధాన ధ్యేయంగా కలిగిన యజమాన్యానికి కార్మికులకు పనిస్థలాల్లో కల్పించే సౌకర్యాలన్నీ అనవసరమనిపిస్తుంటాయి. ఆ సౌకర్యాల్ని కోతపెట్టడం, కొనసాగించడం అనే విధానం వారి లాభాలను ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రైవేటు కంపెనీలనేకం తమ కార్మికులను పనిసమయంలో తప్పనిసరిగా కల్పించాల్సిన రక్షణ చర్యలను ఫ్యాక్టరీ లోపల, బయటా సౌకర్యాల కల్పనలో ఎప్పుడూ ఎగ్గొట్టాలనే చూస్తుంటారు. ఈవిధంగా పనిపరిస్థితుల్లోని, పనిప్రదేశంలోని కార్మికుల కనీస ప్రయోజనాలు కాపాడాలని రాజ్యాంగంలో రాసుకున్న తప్పనిసరి చట్టాలే అమలు కానిపరిస్థితిపై నోరువిప్పని సుప్రీంకోర్టురాజ్యాంగంలో రాసిలేదు కాబట్టి కార్మికులకు సమ్మెహక్కు లేదని తీర్పు ఇవ్వడం ఏ వాదన ప్రకారమూ చెల్లదు.

అసలు శ్రామికవర్గానికి సమ్మెహక్కు ఉండాలా? వద్దా? అనే గందరగోళానికి కారణం సమాజ నిర్మాణానికి సంబంధించిన పునాది విషయాలు తెలియకపోవడం. తెలిసినా అస్పష్టంగా తెలియడం. సమాజమంటే శ్రమ సమాజమని, శ్రమ సమాజమంటే శ్రమచేసే మానవ సమూహమేననే విషయం అర్థం కాకపోవడమే ప్రస్తుత అంశానికి సంబంధించిన గందరగోళానికి కారణం. ప్రస్తుత సమాజంలో శ్రమచేసే వర్గంతోపాటు శ్రమచేయని వర్గం కూడా ఉన్నదని, ఇది వర్గసమాజమనే మౌలిక విషయం తెలియకపోవడం వల్ల వచ్చే గందరగోళంలోపుట్టే ఒకానొకఅంశం మాత్రమే శ్రామికుల సమ్మెహక్కు విషయంలో నెలకొన్న ప్రస్తుత గందరగోళ పరిస్థితి.

యజమానులు, శ్రామికులుగా కలిగిన అసమాన ఉత్పత్తి సంబంధాలు గల వర్గసమాజ వ్యవస్థలో శ్రామికుల ప్రయోజనాలు కాపాడబడడం అనేది పూర్తిగా శ్రామికవర్గం చేసే పోరాటాలతో ముడిపడ్డటువంటి అంశంగాఉంటుంది. ఇరువర్గాల్లో, ప్రయోజనాలు కాపాడుకోవడమన్నది శ్రామికులకు మాత్రమే సంబంధించిన అంశంగా ఉంటుంది. అది శ్రామికుని శ్రమశక్తికి సంబంధించిన, తప్పనిసరైన సహజమైన అవసరంగా ఉంటుంది. యజమానులవి అసహజమైన లాభానికి సంబంధించిన పూర్తి అసహజమైన ప్రయోజనాలే. యజమానులు తమ అసహజ ప్రయోజనాలు నెరువేర్చుకోవడానికి శ్రామికుల సహజ ప్రయోజనాలను ఎంత వీలుపడితే అంత, ఎక్కడ వీలుపడితే అక్కడ మూసివేయాలని చూస్తుండడం వారి సహజ స్వభావంగా ఉంటుంది. ఈ మొత్తం నేపథ్యమే శ్రామికవర్గానికి తన ప్రయోజనాలపరిరక్షణలోనూ, తప్పనిసరైన నూతనప్రయోజనాలు సాధించడంలోనూ పోరాట మార్గాలు అనివార్యమైపోతాయి. శ్రామిక వర్గాలు వందల ఏళ్ళుగా పోరాటరూపాల్లో ఒక రూపంగా, చిట్టచివరి మార్గంగా ఎంచుకున్నదే సమ్మె. కార్మికుల ప్రయోజనాల రక్షణకోసం వచ్చిన ఫ్యాక్టరీ చట్టాలైనా, కార్మిక చట్టాలైనా వందల ఏళ్ళుగా కార్మికులు కాన్షియస్‌గా చేసిన పోరాట ఫలితాలే. వాటిని యజమాన్యం కార్మికుల నుండి ఏవిధమైన పోరాటాలు లేకుండానే తమంత తాముగా దయతలిచి ఉదారంగా ఇచ్చిన చట్టాలేంకావు తిరిగి రద్దుచేయడానికి. కార్మికుల సమ్మెహక్కు విషయంలోను కూడా ఇదే వర్తిస్తుంది. అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గుర్తుంచుకోవాలి. శ్రామికవర్గం రాజ్యాధికారంలోకి రానంతకాలం, తప్పనిసరి పరిస్థితుల్లో శ్రామికవర్గ పోరాటాలకు తలొగ్గి వదులుకున్న శ్రామికవర్గ హక్కులను రాజ్యాధికారంలో వున్న యజమానివర్గం ఎప్పటికప్పుడు కబళించాలని చూస్తుంది. అందుకోసం శ్రామికవర్గ పోరాటాల్లో బలహీలపడిన దశను అవకాశంగా తీసుకుంటుంది. పోరాటాలు బలహీనంగా లేకుంటే బలహీనపడే పరిస్థితుల్ని కూడా కార్మికులమధ్య తానే కల్పించి పెడుతుంది. నిజానికి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానానికి సంబంధించిన సంస్కృతి భావపరంగా కార్మిక వర్గపోరాట చైతన్యాన్ని నిర్వీర్యపరిచే క్రమం నిరంతరంగా జరుగుతూనే వుంది. దీనికితోడు కార్మిక నాయకత్వానికి డబ్బు, హోదాలను చూపి ప్రలోభపెట్టడం కూడా కార్మిక వర్గపోరాటాల్ని నీరుగార్చుతాయి. ఈ విషయంలో శ్రామికవర్గం నిరంతరం అప్రమత్తమై వుండాలి. తను కొనసాగిస్తున్న ఆర్థిక పోరాటాలను రాజకీయాధికారం పొందే లక్ష్యంగా అభివృద్ధిపరుచుకోవడమే దీనికి పరిష్కారం.

ఈ కోణంలో చూస్తే హక్కుల స్పృహపట్ల ప్రస్తుతం శ్రామిక వర్గానికి తగినంత స్పష్టత, సంపూర్ణత లేదనడంలో సందేహం లేదు. పాలకులు అప్రజాస్వామికంగా ప్రజల్లోని రకరకాల సెక్షన్ల హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తుంటే హక్కులు కోల్పోతున్న వాళ్ళు ఎవరికి వాళ్ళుగా మాట్లాడుతున్నారు గాని ఒకరికొకరు మద్దతుగా మాట్లాడడం ఐక్య కార్యాచరణ విధానాన్ని రూపొందించుకోకపోవడం కూడా ప్రభుత్వ ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలకు, కోర్టుల అప్రజాస్వామిక కార్మికవర్గ వ్యతిరేక తీర్పులకు కారణం అవుతుంది. దీనికితోడు కార్మిక ఉద్యోగ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెల పట్ల సాధారణ ప్రజల మద్దతును కూడగట్టడంలో విఫలమైనాయి. సమ్మెలపట్లప్రభుత్వాలుఅనుసరిస్తున్న నియంతృత్వ పోకడలను ఎదుర్కోవడంలోను, సుప్రీంకోర్టు అప్రజాస్వామిక తీర్పును తిప్పికొట్టడం కోసమైనా ఉద్యోగ కార్మిక వర్గాలు ప్రైవేటురంగ కార్మికులతోటి, వ్యవసాయ రైతుకూలీలుగా కలిగిన మెజారిటీ గ్రామీణ సాధారణ ప్రజలతోటి కొనసాగిస్తున్న సంబంధాల్ని కూడా పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ప్రస్తుత సుప్రీంకోర్టు తీర్పుతో ముందుకు వచ్చింది. ఇంత కాలంగా శ్రామికవర్గంతప్పనిసరైన నూతనప్రయోజనాల్ని సాధించడం లోనూ, సాధించుకున్నవాటిని నిలబెట్టుకోవడంలోనూ తిరుగులేని పోరాట ఆయుధంగా అవలంబించిన సమ్మెహక్కును ప్రజావ్యతిరేక ప్రభుత్వాల నిరంకుశ, అప్రజాస్వామిక విధానాల నుండి కాపాడుకోవ డానికి తిరిగి తిరిగి సమ్మెను మాత్రమే ఆయుధంగా ప్రయోగించాల్సి వుంది. సమ్మె మాత్రమే సమ్మెహక్కును కాపాడుతుంది. దానికి విశాల ప్రజానీకం మద్దతు తప్పనిసరి. ○

నిత్యజీవితంలో బహుళజాతి సంస్థలు - 3

— ఎన్. వేణుగోపాల్

నిత్యజీవితంలో బహుళజాతిసంస్థల ప్రవేశాన్ని, చొరబాటును, విస్తరణను నిశితంగా అర్థం చేసుకోవాలంటే మనం వాడుతున్న సరుకులనూ, సేవలనూ ఒక్కొక్కటిగా తీసుకుని వాటిలో బహుళజాతి సంస్థల భాగస్వామ్యంతో అంచనావేయాలి. కొన్ని సరుకులూ, సేవలూ బహుళజాతి సంస్థలకు సంబంధం లేనివని బయటకు అనిపించినప్పటికీ, వాటి ముడిసరుకులతోనో, సాంకేతిక విధానం తోనో, యాజమాన్యంతోనో, ఆర్థికవనరులతోనో, పంపిణీతోనో వాటికి బహుళజాతి సంస్థలతో సంబంధం ఉండి ఉంటుంది. ఆ వివరాలనుకూడా పరిశీలించినప్పుడే మనజీవితాలమీద బహుళజాతి సంస్థల ప్రభావం పూర్తిగా అర్థమవుతుంది.

ఉదయం లేవగానే పళ్ళుతోముకోవడం అనేది భారతీయులందరికీ సర్వ సాధారణమైన అలవాటు. ఆహార పదార్థాలలోని సూక్ష్మక్రిములు పళ్ళ సందులలో చేరి నోటి ఆరోగ్యానికీ, తద్వారా మొత్తంగా మనిషి ఆరోగ్యానికీ ప్రమాదకరంగా మారుతాయి గనుక రోజుకు ఒకసారో, రెండుసార్లో పళ్లు తోముకోవాలనేది ఆరోగ్య సూత్రం. ప్రతి సరుకుకూ ఒక ఉపయోగ విలువ ఉంటుందన్నట్టుగానే పళ్ళు తోముకోవడానికి ఉపకరించే సరుకులకూ ప్రాథమికమైన ఉపయోగవిలువ ఉంటుంది.

ఐతే పళ్ళు తోముకునే పదార్థాలు సరుకుల రూపం ధరించి మారకపు విలువల రూపం ఎత్తి లాభాలు ఆర్జించే సాధనాలు కావడానికి ముందు శతాబ్దాలపాటు మనిషికి ఆ పదార్థాలతో సంబంధం వుంది. పళ్ళు తోముకునే సాధనాలు సమాజానికి మార్కెట్ ద్వారాకాక మార్కెటేతర రూపాలలో అందిన శతాబ్దాల చరిత్ర ఉంది.

పళ్ళు తోముకోవడానికి మనుషులు సహజమైన నీటిని వాడుకోవడంతో పాటు ఇంకా ఎక్కువ సమర్థంగా ఉండేందుకు ఔషధ విలువలు చెట్ల రెమ్మలను, వేర్లను, చిన్న పొదల కాండాలను, ఆకులను వాడుకున్న, వాడుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. నిజానికి బహు ఆడంబరమైన ప్రచారంతో వస్తున్న బహుళజాతి సరుకుల కన్న ఈ సహజ పదార్థాలే ఎక్కువ సమర్థంగా పనిచేశాయి. ప్రకృతికీ, మనిషికీ దూరం పెరిగినకొద్దీ, పట్టణీకరణ పెరిగిన కొద్దీ ఈ సహజ వనరుల లభ్యత, వినియోగం తగ్గిపోయాయి.

క్రమంగా చిన్న పట్టణాలలో, 'నాగరికత' పేరుమీద కొత్త విలువలు ప్రచారంలోకి వచ్చిన ప్రాంతాలలో సహజ దంత ధావన పదార్థాల స్థానాన్ని, మరొకస్థాయి పదార్థాలు ఆక్రమించాయి. ఉప్పు, బొగ్గు, కచ్చిక (కాల్చిన పిడక), ఇటుకపొడి వంటి గరుకుగా, ఉప్పగా, కొంతవరకు ఔషధ లక్షణాలతో ఉండే పదార్థాలు వాడకంలోకి వచ్చాయి. బొగ్గుపొడిని గాని, ఇటుకపొడిలా కనబడే పదార్థాన్నిగాని, ఔషధాలు కలిపి స్థానికంగా ఉత్పత్తిచేసి అమ్మడం ప్రారంభమైంది. ఒక సహజ అవసరం కోసం, ఒక సహజంగా దొరికే వనరును వాడుకోవడం అనే స్థితి నుంచి, ఒక సహజ అవసరం కోసం పారిశ్రామికంగా తయారుచేసే సరుకును సరఫరా చేయడం అనే స్థితి వచ్చింది. ఇది మనదేశం మొత్తంగా గాని, తెలుగు సమాజంలోనే గాని గత శతాబ్ది మధ్యభాగంలో మొదలై ఏడో, ఎనిమిదో దశకాల కల్లా విస్తరించింది. అంటే దంత ధావన పదార్థాలు సహజమైన స్థితినుంచి అసహజమైన స్థితికి, సరుకు స్థితికి, పారిశ్రామిక స్థితికి ప్రయాణం చేశాయి. మార్కెటేతర సంబంధం నుంచి మార్కెట్ సంబంధానికి పరిణమించాయి.

అప్పటికి కూడా నోటిశుభ్రతా పదార్థాల పరిశ్రమ దేశీయ, స్థానిక పరిశ్రమగానే ఉండింది. ఒకప్రాంతంలో ఒక ఫారూఖీ దంత మంజన్, మరొక ప్రాంతంలో మరొక గణేశ్ పళ్ళపొడి లాగా గుత్త పెట్టుబడికి, ఇబ్బడి ముబ్బడి లాభాలకు అవకాశం లేని స్థానిక పరిశ్రమలే నడుస్తుండేవి. వాటిలో స్థానిక, చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడిఉండటం మాత్రమేకాక, అది వాడే ప్రజలకు ఆ పదార్థాలతో ఎంతో కొంత సాన్నిహిత్యం ఉండేది.

ఈ స్థితిలో గుత్తపెట్టుబడి ఈ స్థానిక, చిన్న మార్కెట్లన్నిటినీ ఏకంచేసి విశాలమైన మార్కెట్లు స్థాపించదలచింది. ఇది కిందినుంచి ప్రజలమధ్య ఏర్పడే ఐక్యతకాదు. పైనుంచి విపరీతమైన లాభాలకోసం విశాలమైన మార్కెట్‌ను కోరుకునే పెట్టుబడిదారీ విధానపు 'వాతాపి జీర్ణం' అనుకునేఐక్యత. ఈ పెట్టుబడిదారీ లాభాపేక్షవెనుక ఖచ్చితమైన లెక్కలే వున్నాయి. ఇవాళ్టి గణాంకాలను బట్టి అంచనావేస్తే, వందకోట్ల జనాభాలో పదికోట్లమంది, వాళ్ళ వయసువల్ల, ఇతరేతర కారణాల వల్ల పళ్ళు తోముకోలేని స్థితిలో ఉన్నారనుకున్నా, ప్రతిరోజూ కనీసం తొంభైకోట్ల మందికి పళ్లు తోముకోవలసిన అవసరం ఉంటుంది. ప్రతిమనిషి సగటున రోజుకు ఐదుగ్రాముల పొడిగాని, పేస్ట్‌గాని వాడుతారనుకున్నా రోజుకు 4,500 టన్నుల దంత ధావన పదార్థం అవసరమవుతుంది. నెలకు 1,35,000 టన్నులు, సంవత్సరానికి పదహారు లక్షల టన్నులు అవసరమవుతుంది.

జనాభాలోని మొత్తం తొంభైకోట్ల మందికి ఈ పౌడర్లు, పేస్టులు వాడే అలవాటులేదనుకున్నా, కేవలం మధ్యతరగతికే, అంటేఅందులో మూడోవంతైన ముప్పైకోట్ల మందికే ఆ అలవాటు ఉందనుకున్నా, దేశంలో ఈ పౌడర్లు పేస్టుల మార్కెట్ ఐదులక్షల టన్నుల పైచిలుకే. ఇవాళ మార్కెట్‌లో యాభై గ్రాముల పౌడరు, పేస్టు ఖరీదు రూ. 5–8 మధ్య ఉంది. అంటే దేశంలో ఈ మార్కెట్ విలువ ఎంత తక్కువలో

తక్కువ అంచనావేసినా సాలీనా రూ. 5,000 కోట్లనుంచి రూ. 8,000 కోట్లు ఉందన్నమాట.

ఈ మార్కెట్‌లో మరోకిటుకుఉంది. ఎఫ్.ఎమ్.సి.జి. రంగంలో పంపిణీ, సరఫరావ్యవస్థ విస్తృతంగా ఉంటుంది గనుక, ఉత్పత్తిదారు నుంచి చిల్లర వ్యాపారి వరకు కనీసం ఐదు ఆరు అంచెలు ఉంటాయి గనుక, ప్రతి స్థాయిలోనూ లాభం లెక్కలేసుకుంటారు గనుక ఉత్పత్తి వ్యయానికీ, ధరకూ మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. అంటే 6 రూపాయలకు అమ్మే డబ్బా, ట్యూబ్ ఉత్పత్తి వ్యయం నిజానికి 3 రూపాయల కన్న తక్కువే వుంటుంది. అంటే రూ. 5,000 కోట్ల మార్కెట్‌లో రూ. 2,500 కోట్లు మారుబేరగాళ్ళ లాభాలకే పోతుంది.

ఇంత విపరీతమైన లాభాలు ఉన్నాయి గనుకనే బహుళజాతి సంస్థల కళ్ళు ఈ రంగంమీద పడ్డాయి. ఈ మార్కెట్‌మీద సర్వేలు చేయించడం, దంతవైద్యులతో తమ సరుకుల ప్రచారాలు చేయించు కోవడం, అన్ని ప్రచార, ప్రసార సాధనాలలో ఆర్భాటంగా, ఆకర్షణీ యంగా తమ సరుకుల గురించి ఊదరగొట్టడం సాగిస్తున్నాయి. స్థానికపరిశ్రమలను దెబ్బతీయడానికి, ప్రజల మామూలుఅలవాట్లను తప్పుపట్టి వాళ్ళను మార్కెటేతర సహజ పదార్థాల వినియోగం నుంచి, తమ సరుకుల వినియోగంలోకి మార్చడానికి బహుళజాతి సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

దేశంలో ఐదులక్షల టన్నులైనా ఉండవలసిన దంత ధావన పదార్థాల వినియోగంలో సంఘటిత మార్కెట్‌లో లక్ష టన్నుల వినియోగమే ఉందని మార్కెట్ సర్వేలు తెలుపుతున్నాయి. మిగిలిన వినియోగం అసంఘటిత రంగంలో ఉండవచ్చు. ఈ మార్కెట్ సర్వేల పరిభాషలో సంఘటిత మార్కెట్ అంటే బహుళజాతి సంస్థలు, దేశవ్యాప్త గుత్త సంస్థలు. అసంఘటిత మార్కెట్ అంటే స్థానిక, చిన్న పారిశ్రామిక సంస్థలు.

మార్కెట్ సర్వేలు ప్రకారం సంఘటిత రంగంలోని పారిశ్రామిక సంస్థలు ఏడు: అవి:- కోల్గేట్ పామోలివ్ ఇండియా లిమిటెడ్, హిందుస్తాన్ లివర్ లిమిటెడ్, బల్సారా హైజీన్ లిమిటెడ్, డాబర్ ఇండియా లిమిటెడ్, స్మిత్‌క్లైన్ బీచమ్ కన్స్యూమర్ హెల్త్‌కేర్, ఆంకర్ హెల్త్ అండ్ బ్యూటీ ప్రొడక్ట్స్, వికో లాబొరేటరీస్, ఇవికాక జెఫ్రీ మానర్స్, హిందుస్తాన్ సీబా-గెయిగి వంటి మరికొన్న సంస్థలు కూడా ఉన్నాయి.

సంఘటిత రంగంలోని టూత్‌పేస్ట్ మార్కెట్‌లో 85 శాతం మొదటి రెండు సంస్థలు కోల్గేట్ పామోలివ్, హిందుస్తాన్ లివర్ గుప్పిట్లోనే వుంది. ఈ రెండు సంస్థలూ బహుళజాతి సంస్థలే. సంఘటిత రంగంలోని టూత్‌పౌడర్ మార్కెట్లో 75 శాతం కోల్గేట్, డాబర్ సంస్థల చేతుల్లోనే ఉంది. వీటిలో డాబర్ స్వదేశీ సంస్థే అయినప్పటికీ సాంకేతిక విధానం కోసం, పంపిణీ కోసం బహుళజాతి సంస్థలతో మిలాఖత్తు కావడానికి ఉవ్విళ్ళూరుతోంది.

కోల్గేట్ పామోలివ్ ఈ మార్కెట్‌లో అగ్రభాగాన ఉంది గనుక దానిగురించి వివరంగా తెలుసుకోవడం అవసరం.

కోల్గేట్‌సంస్థను 1806లో అమెరికాలో ప్రారంభించారు. దాదాపు మొదటి వందసంవత్సరాలు ఆ సంస్థ అమెరికాలో మాత్రమే వ్యాపారం చేసింది. గత శతాబ్దం తొలిరోజుల నుంచి విదేశీ వ్యాపారాలు ప్రారంభించి, ఇవాళ రెండువందలకు పైగా దేశాలలో తన సరుకులు అమ్ముతోంది. కోల్గేట్, పామోలివ్, అజాక్స్, ఫాబ్, మెన్నెన్ లాంటి ఎన్నో ప్రపంచవ్యాప్తమైన బ్రాండ్లతో, నోటి పరిశుభ్రతా సరుకుల మార్కెట్లోనే కాక ఇతర ఎఫ్.ఎమ్.సి.జి. మార్కెట్లలో కూడా అగ్రస్థానంలో వుంది. ఈ సంస్థ అమ్మకాల విలువ సాలీనా దాదాపు 50 వేల కోట్ల రూపాయలు.

ఈ సంస్థ భారతదేశంలో వ్యాపారాన్ని 1937లో, కోల్గేట్ డెంటల్ క్రీమ్ అనే టూత్‌పేస్ట్‌తో ప్రారంభించింది. అప్పుడు ఈసంస్థ స్థాపక పెట్టుబడి రూ. 1,50,000 మాత్రమే. ఈ పెట్టుబడికి గాను, ఎన్నోరెట్ల లాభాన్ని ఈసంస్థ అమెరికాకు తరలించుకుపోయింది. 1975 నాటికి భారతదేశం నుంచి అమెరికా లాభాల వాటారూపం లోనే రూ. 5 కోట్లు తరలిపోయాయి. 1978లో జనతాపార్టీ ప్రభుత్వం మిగిలిన అన్ని బహుళజాతి సంస్థలమీద ఆంక్షలు విధించినట్టుగానే, కాల్గేట్‌మీద కూడా ఆంక్షలు విధించింది. విదేశీ వాటాను 51 శాతం నుంచి 40 శాతానికి తగ్గించుకొమ్మని కోరింది. మళ్ళీ 1993లో మాతృసంస్థ వాటా పెరగడానికి అనుమతి దొరికినప్పుడు జరిగిన లావాదేవీల్లో అమెరికాలోని బహుళజాతి సంస్థ రూ. 230 కోట్లు లాభం చేసుకుంది. కేవలం 1998-99లోనే కాల్గేట్ పామోలివ్ ఇండియా మొత్తం అమ్మకాలు రూ. 998 కోట్లు కాగా, లాభం రూ. 250 కోట్ల పైచిలుకు.

తాజా గణాంకాల ప్రకారం కోల్గేట్ పామోలివ్‌కు టూత్‌పేస్టుల మార్కెట్లో 52 శాతం, టూత్‌పౌడర్ల మార్కెట్లో 48 శాతం, టూత్ బ్రష్‌ల మార్కెట్లో 36 శాతం వాటా ఉంది. అంటే ప్రతి రెండోమనిషి వాడే టూత్‌పేస్టు వల్ల, టూత్‌పౌడర్ వల్ల, ప్రతి మూడోమనిషి వాడే టూత్‌బ్రష్ వల్ల ఆ మనుషుల నోటి ఆరోగ్యాలు బాగుపడుతున్నాయో లేదో తెలియదుగాని, కాల్గేట్ పామోలివ్ కంపెనీకి అదనపు లాభాలు చేకూరుతున్నాయి.

కోల్గేట్ పామోలివ్‌కు దంత ధావన పదార్థాలతోపాటు వంటి సబ్బులు, షాంపూలు, చర్మపు క్రీములు, షేవింగ్ క్రీములు, ఆఫ్టర్ షేవ్ లోషన్లు, పాత్రలు కడిగే పేస్టులు వంటి ఇతర వ్యాపారాలు కూడ ఉన్నాయి.

హిందుస్తాన్ లివర్ తదితర బహుళజాతి సంస్థల గురించి ఇతర నిత్య జీవితావసరాల సందర్భంలో చర్చించుకుందాం. ○

వామపక్ష ఐక్యత - సాధ్యాసాధ్యాలు

— ఇంగువ మల్లికార్జున శర్మ

వామపక్ష ఐక్యత గురించి తక్షణ కృషికి పూనుకోవాల్సిన అవసరం ఈనాడు ఎంతైనా వుంది.

ఈ సందర్భంగా మొదటగా వామ లేక దక్షిణ అంటే ఎడమ లేక కుడిపక్షాలు, ఇంకా మధ్యపక్షం అనే విచక్షణ ఎలా, ఎక్కడ పుట్టిందో తెలుసుకోవడం అప్రస్తుతం కాదనే భావిస్తాను. 2 శతాబ్దాల క్రితం ఫ్రెంచి విప్లవకాలంలో ఈ గిరిగీతలు మొదలైనాయని మనం గమనించాలి. 1789లో ఫ్రాన్సు రాజు తనదేశపు నేషనల్ అసెంబ్లీకి ప్రాముఖ్యం ఇవ్వ నిరాకరించి, తన యధేచ్ఛాపాలన నిరంకుశంగా కొనసాగించ జూచినప్పుడు ఫ్రెంచి ప్రజలు అందుకు వ్యతిరేకంగా తిరగబడ్డారు. వారి జాతీయ అసెంబ్లీ రాజును ధిక్కరించి తానే దేశ ప్రభుత్వపాలన నడపబూనుకున్నది. ఈ చారిత్రాత్మక నిర్ణయం, పూనికలే మహత్తర ఫ్రెంచి విప్లవానికి దారితీసాయి. అనతికాలంలో రాచరికపు నిర్మూలన, రాజు శిరచ్ఛేదం, రిపబ్లిక్ ప్రకటనలు కూడా సంభవించాయి. కాని ఈ పరిణామాలు జాతీయఅసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానించడం, ఒక్కతాటిపై నిలిచి పోరాడడం వల్లకాక అందులోని వివిధ బృందాలనడుమ విభేదాలు, ఘర్షణల క్రమంలో తీవ్రవాదులు మెజారిటీ సాధించి నెగ్గుకురావడంద్వారానే జరిగాయి. పారిస్ నగరం లోని టులియర్స్ పాలెస్ రాజుకూ, అభివృద్ధినిరోధక రాజరికశక్తులకు కేంద్రంగానూ, పాలైజ్ రాయల్ ప్రజాతిరుగుబాటుదారుల ప్రధాన కేంద్రంగానూ, ఈ రెంటికీనడుమ రాయల్ రైడింగ్ అకాడమీ భవనం జాతీయ అసెంబ్లీకి కేంద్రంగానూ వుండినాయి. మరి జాతీయ అసెంబ్లీలో సైతం రాజరికపు మద్దతుదారులు లేకపోలేదు. వాళ్ళు రాజరికాన్ని మొత్తంగా నిర్మూలించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, దానిలో కొన్ని ముఖ్య సంస్కరణలకు మాత్రమే పరిమితం కావాలంటూండే వాళ్ళు. వీళ్ళు ఎప్పుడూ అసెంబ్లీలోని అధ్యక్షపీఠానికి కుడిపక్కకు కూర్చునివుండేవాళ్ళు. వీళ్లను మైదానం అని కూడా పేర్కొనేవాళ్ళు. కాగా రాచరికాన్ని నిర్మూలించి రిపబ్లిక్ నెలకొల్పాల్సిందేననే తీవ్రవాదులు (జాకొబిన్లు) అధ్యక్షపీఠానికి ఎడమపక్కకు కూర్చునివుండేవాళ్ళు. వీళ్ళను పర్వతం అని కూడా అనేవాళ్ళు. అంతిమంగా ఎడమపక్కవాళ్ళదే పైచేయి అవడం, రాచరికం నిర్మూలమై రిపబ్లిక్ నెలకొనడం జరిగింది. పోతే ఎటూ ఖచ్చితమైన వైఖరులు తీసుకోలేక గోడమీది పిల్లి వాటంగా వుండే ఒక బృందం సరిగ్గా నడుమన అధ్యక్షపీఠం ఎదుటగా కూర్చునివుండేవాళ్ళు. వీళ్ళను కుడి, ఎడమపక్షాలు ఉభయులూ ఏవగించుకుంటూ, అవసరమైనప్పుడు వాడుకోజూస్తుండేవాళ్ళు. ఈ మధ్యేమార్గవాదుల్ని చిత్తడినేల (swamp) అని ఎద్దేవా చేసేవాళ్ళు. కాలక్రమేణా ఈ కాకతాళీయ స్థానే విభజన కూడా ఒక సైద్ధాంతిక ప్రాముఖ్యాన్ని సంతరించుకొని, ఈ పరిగణన దేశదేశాలన్నింటికీ కూడా వ్యాపించింది. అప్పటినుండీ కుడివాదులంటే అభివృద్ధి నిరోధకులు లేక యధాతథవాదులనీ, ఎడమ పక్షీయులంటే ఉన్న వ్యవస్థను కూలదోసి కొత్త వ్యవస్థను నెలకొల్పజూచే తీవ్రవాదులనీ, యిక మధ్యస్తులంటే గోడమీది పిల్లులు, అవకాశవాదులనీ ఒక గుర్తింపు స్థిరపడిపోయింది.

ఈ చారిత్రక నేపథ్యంలోనే మనదేశంలో కూడా కుడి, ఎడమ, మధ్య పక్షాలను గుర్తించి వ్యవహరించాల్సివుంది. ఇక్కడ ఒక పార్లమెంటరీ ప్రజాస్వామ్య చట్రం ఇప్పుడు నెలకొనివుంది. అయితే ఇది ఒక అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ వ్యవస్థనుగాక, పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానాలు, ఇంకా అక్కడక్కడానైతే ఫ్యూడల్ పూర్వ ఉత్పత్తి విధానాలు కూడా బాగా అలముకొనివున్న ఒక వెనుకబడిన సాంఘిక, ఆర్థికవ్యవస్థను ఇంకా అభివృద్ధిచెందని బూర్జువా వ్యవస్థను ఆవరించివున్నది. అయితే పైకిమాత్రం మనది ఒక సోషలిస్టుదేశమనే మోసపూరిత బడాయి కబుర్లు మన రాజ్యాంగంలో చెప్పబడివున్నాయి కూడా. కనుక ఈ జటిలమైన సాంఘిక-ఆర్థిక, రాజకీయ వాతావరణానికి తగ్గట్లుగా మనం ఇక్కడ ఎడమ, కుడి, మధ్యపక్షాలను గురించి విశ్లేషించి, వివరించాల్సిన అవసరంవుంది. అందువల్ల కేవలం ఉన్న వ్యవస్థను సమూలంగా పెరికి పారేయాలనే వర్గాలు మాత్రమే వామ పక్షాలని మడికట్టుకు కూర్చోవడం కుదరదు. ఉన్నవ్యవస్థలో తీవ్రమైన ప్రజాస్వామిక, సోషలిస్టు అనుకూల మార్పులు తేవడానికి చిత్తశుద్ధి, కార్యదీక్షలతో కృషిచేసే సంస్కరణవాద సాంఘిక, రాజకీయ పక్షాలను కూడా ఈ గిరిలోనికి తీసుకోవలసి వుంటుందని నా అభిప్రాయం.

మరి కుడిపక్ష పార్టీలంటే మనదేశంలో ఏమిటి అని కూడా గుర్తింపు చేయాల్సిన అవసరం వుంది. ఫ్యూడల్, ఫ్యూడల్ పూర్వ ఉత్పత్తి విధానాలు, సంస్కృతుల్ని సమర్థించేవారికి మనదేశంలో కొదవలేదు. ముఖ్యంగా మతతత్వ సంస్థలు, మతవాద పార్టీలు ఈ కోవకు చెందుతాయి. ఇంకా కొన్ని మతేతర, బాహాటంగా భూస్వామ్య అనుకూలమైన పార్టీలు కూడా లేకపోలేవు. అలాగా పెట్టుబడిదారీ విశృంఖలత్వాన్ని వెనకేసుకొచ్చే సంస్థలు, పార్టీలుకూడా ఈ కుడికోవకే చెందుతాయి. తక్కిన పార్టీలు, సంస్థలు మధ్య పక్షానికి అంటే చిత్తడినేలకు చెందుతాయి. ఈ గిరిగీత అంతస్పష్టంగా వుండక పోవచ్చు, ఒకదానిపై మరొకటి అలముకోవడం (overlapping) కూడా వుండొచ్చు. అయితే స్థూలంగా కుడి, మధ్యపక్షాలేమిటో కూడా మనకు ఒక అవగాహన ఉండాలి. ఈ విశ్లేషణ దేశం మొత్తానికేగాక, ఆయా రాష్ట్రాలకు, ప్రత్యేక ప్రాంతాలకు సంబంధించికూడా జరగాల్సి వుంది. కనుక మనదేశంలో వివిధరాష్ట్రాలు, ప్రాంతాల ప్రత్యేకతలతో సహా ఎడమ, కుడి, మధ్యపక్షాలు ఏమిటో స్థూలంగా గుర్తింపు (identify) చేయడం మనం చేయాల్సిన ప్రథమ ప్రయత్నాల్లో ఒకటి అని నా అభిప్రాయం.

పోతే మనదేశంలోని వామపక్షఉద్యమంలో కమ్యూనిస్టుపార్టీలు, గ్రూపులదే ప్రధానపాత్ర అనేది సాధారణంగా అందరూ అంగీకరించే, అంగీకరించవలసిన విషయమే. కాని కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన, ఇంకా సాగుతున్న క్షీణత దృష్ట్యా దానికి ఈ నాయకత్వపాత్ర కలకాలం వుంటుందని నిర్ద్వంద్వంగా చెప్పడం కూడా కష్టమే. ఇంకా నిరాశావహ దృష్టిగల శ్రేయోభిలాషులు, సానుభూతిపరులైతే కమ్యూనిస్టుఉద్యమం క్రమేపీ మరింతక్షీణిస్తూ, నానాటికీ జనాదరణను కోల్పోతూ పూర్తిగా అప్రస్తుతమైపోతుందేమోననే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని కూడా గమనించాలి. అంతర్జాతీయ, జాతీయ కమ్యూనిస్టుఉద్యమంలో చెలరేగిన తీవ్రవిభేదాలు, చీలికలు, వైరాలు, ఆ తర్వాత సోవియట్ యూనియన్, తూర్పు యూరపుదేశాల రాజ్య సోషలిస్టు వ్యవస్థల పతనం, 'రంగు మార్చకుండానే దిక్కు మార్చిన' చైనా విపరీత పోకడలు తదితర పరిణామాలన్నీ ఈ నిరాశా వాతావరణాన్ని సృష్టించాయి. ఈ నేపథ్యంలోనే మనం ఇప్పుడు, ఇక్కడ వామపక్ష ఐక్యత గురించి ఆలోచించి, చర్చించాల్సి వుంటుంది.

పైన పేర్కొన్న వాతావరణ పర్యవసానంగా లేక దాని అనుకూల తల వల్ల నేడు ప్రతిచోటా ఇదివరకు అభాసుపాలైన 'స్వేచ్ఛా విపణి' సిద్ధాంతాలు, వాదాలు చెలరేగుతూ ప్రపంచవ్యాప్తంగా భౌగోళీకరణ, ఉదారీకరణ, ప్రైవేటీకరణ అనే ఆర్థిక, సామాజిక పరిణామాలకు బలం, వేగం చేకూరుస్తున్నాయి. ఇందువల్ల ఒక కొత్తతరహా వలస వాదం, అంతర్జాతీయ పెత్తందారీ, దురాక్రమణ తత్వాలు, జాతీయ పెట్టుబడిదారీ, ఇతర దోపిడీదారీ విశృంఖలతలు, మత మౌలిక వాదాలు, వాటిమూలంగా వెర్రితలల భీభత్సవాదాలు తలఎత్తు తున్నాయి. ఇది చాలా శోచనీయమైన, ప్రజాస్వామ్యానికి ఎంతో కష్టనష్టదాయకమైన పరిణామం. కాని సరిగ్గా ఈ పరిణామం వల్లనే మళ్ళీ కొత్తతరహా సోషలిస్టు ఉద్యమాలు, ధోరణులకు ప్రాణప్రతిష్ట జరుగుతున్నదని కూడా గమనించాలి. మళ్ళీ సోషలిజం ఆవశ్యకత, అనివార్యత, శ్రేష్టతలు ప్రముఖంగా చర్చకు వస్తున్నాయి కూడా. ఇది ఒకవిధంగా 'కారుచీకట్లోకాంతిరేఖ'వంటి ఆహ్లాదకర పరిణామం.

మనదేశంలోని వామపక్షాల్లో స్థూలంగా రెండు తరగతులు: ఒకటి, ఇప్పుడున్న వ్యవస్థను సమూలంగా నిర్మూలించి నూతన ప్రజాస్వామ్య/సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పడానికి సాయుధ విప్లవం ఒక్కటే శరణ్యమని భావించి, అందుకు పూనుకొనే తీవ్రవాద వర్గాలు, నక్సలైటు ఉద్యమం కిందికి వచ్చే పక్షాలన్నీ ప్రధానంగా ఈ కోవకు చెందుతాయి. అయితే వీటిలోకూడా స్థూలంగా ఒక ఉపవిభజన: 1. ఇప్పటికిప్పుడే విప్లవానికి పరిస్థితులు తయారుగా వున్నాయి లేక అలాంటి పరిస్థితుల్ని నాయకత్వ పక్షాలు తమ చర్యల ద్వారా సృష్టించి, తద్వారా విప్లవం తేవాలి అని భావిస్తూ, ఇప్పటికే సాయుధ పోరాటాలు, భీభత్సకాండ చర్యలకు తలపడుతున్న పక్షాలు-పీపుల్స్ వార్ పార్టీ, మావోయిస్ట్ సెంటర్ (MCC) వంటివి. 2. విప్లవానికి పరిస్థితులు పరిపక్వమైనా వెంటనే సాయుధతిరుగుబాటు పోరాటాలకు పరిస్థితులు, ముఖ్యంగా ప్రజల సంసిద్ధత అనుకూలంగా లేదుగనుక సాయుధ విప్లవానికి సన్నాహాలు చేస్తూనే, ప్రస్తుతానికి పార్లమెంటరీ వ్యవస్థ/రూపాలతో సర్దుకుపోవాలి, కనుక అవసరమైతే, వీలైతే పార్ల మెంటులు, అసెంబ్లీలు, ఇతర శాసన, పాలనాఅంగాల్లో పాల్గొంటూ, పార్లమెంటరీ పోరాటాల ద్వారా కూడా విప్లవానికి అనువైన మానసిక సంసిద్ధత ప్రజల్లో కలిగించాలనే పక్షాలు మరొక తరగతి. మార్క్సిస్టు-లెనినిస్టు వర్గాల్లోని ప్రజాపంథా (new democracy) పార్టీ, లిబరేషన్ పార్టీ వగైరా ఈ కోవకు చెందినవే. పోతే పార్లమెంటరీ పోరాటాలు, పరిణామాత్మక మార్పులు, సంస్కరణవాద చర్యలపైనే ఎక్కువ వక్కాణింపు వుంచుతూ సాయుధ విప్లవాన్ని ఎజెండాలోనే వుంచుకోని ప్రధాన కమ్యూనిస్టు పక్షాలు (CPI, CPM, MCPI వగైరా), వాటికంటే మరింత మెతక, ఒకవిధంగా మరింత అవకాశవాద పద్ధతులు అవలంబించే వివిధ సోషలిస్టు వర్గాలు వామపక్షాల్లో రెండవ ప్రధాన కోవకు చెందుతాయి. రాశిరీత్యా బహుశా ఈ పక్షాలే దేశంలోని వామపక్షాల్లో పైచేయిగా వున్నాయేమో.

అయితే ఈ వామపక్షాలన్నీ కలిసినా మనదేశ ప్రజల్లో 20-25 శాతానికి మించి ప్రభావితం చేయగల పరిస్థితిలో ఈనాడు లేవు. కాగా ఒకప్పుడు పరిగణనకు రాని పార్టీగావుండిన హిందూమతవాద పార్టీ భారతీయ జనసంఘ్ నేడు పేరు, కొంతవరకు రూపుకూడా మార్చుకుని భారతీయ జనతాపార్టీ అవతారంలో ఒక బలీయమైన శక్తిగా, దేశవ్యాప్తంగా కనీసం 34-40 శాతం ప్రజల మద్దతు పొందగల్గిన పక్షంగా రూపొందివున్నది. నేడు పాలనా పగ్గాలు చేపట్టి వేగంగా పెట్టుబడిదారీకరణను అమలుచేస్తున్నది; సైద్ధాంతిక, సాంస్కృతిక రంగాల్లో ఒకవిధమైన సనాతన, ఛాందస తత్వాలను, కొన్ని సందర్భాల్లో హేయమైన మతోన్మాదాన్నిసైతం వ్యాప్తి చేస్తున్నది. దీన్ని హిందూ మధ్యతరగతి వర్గాల ప్రధాన పార్టీగా పేర్కొనవచ్చు. పోతే అభాసుపాలైన కాంగ్రెస్‌పార్టీ నేటికీ దేశంలో 30-35 శాతం దాకా ప్రజలమద్దతు పొందగల్గుతున్నదని గమనించాలి. ఇంకోకొసన మద్దతునిచ్చే జనాభారీత్యా అంత ప్రధానం కాకున్నా, ప్రజా ప్రయోజనాలకు, మత సామరస్యానికి చేయగల, చేస్తున్న హానిరీత్యా ఎంతో గణనీయమైన ముస్లిం మతతత్వ పార్టీలు, గ్రూపులు కూడా వున్నాయి. దేశం అభివృద్ధిపథంలో పయనిస్తున్నది. ప్రజల ఆర్థిక, సాంఘిక పరిస్థితులు ఎంతో బాగుపడ్డాయనే పాలకవర్గాలు, పక్షాల వాదనలు ఎంతో బోలైనవే అయినా ప్రజల మానసిక ధోరణుల్ని వ్యవస్థతో సర్దుకునిపోయే రీతిలో గణనీయమైన మేరకు ప్రభావితం చేయగలుగుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో వామపక్షాలనేవి ఒక్కతాటిపైన లేవనేది నేటి విషాదకర వాస్తవం. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమాలకు అడ్డుపడే

(తరువాయి భాగం 27వ పేజీలో)

రాష్ట్రం దాహం తీర్చని అనుసంధానం

— గాదె దివాకర్

భారత రాష్ట్రపతి 2002 ఆగస్టు 15న జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో నదుల అనుసంధానం కరువుకు పరిష్కారంగా పేర్కొన్నారు. పదవీ విరమణ చేయబోతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.ఎన్.క్రిపాల్ ఒక ప్రజావ్యాజ్య పిటీషన్‌పై తీర్పు చెబుతూ నదుల అనుసంధానం గురించి కేంద్రానికి, రాష్ట్రాలకు నోటీసు ఇచ్చి తదుపరి 2016 నాటికి నదుల అనుసంధానం కావాలని, ప్రజల సాగు, తాగునీరు అవసరాలుతీర్చాలని అన్నారు. అందరూహర్షించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రంపై ఒత్తిడితెచ్చి, కార్యాచరణకు ప్రోత్సాహం ఇచ్చారు. అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరువును కూడా అధిగమించవచ్చునని ప్రకటించారు. అప్పటికే రాష్ట్రంలో నెలకొన్న కరువు నివారణకు తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారాల వైపు చర్చ కొనసాగుతూంది. అంతేకాదు రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు షరతుల కారణంగానే భారీ ప్రాజెక్టులు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టని కారణంగా తీవ్ర చర్చ జరుగుతున్న సమయంలో ప్రజల దృష్టిని, అసంతృప్తిని మళ్ళించడానికి "అనుసంధానం" ఆయుధంగా ప్రయోగించారు. కాని వాస్తవాలు, వాటి ఉపయోగాలు రాష్ట్రానికి విరుద్ధంగా వున్నాయి. నదుల అనుసంధానంపై ముఖ్యమంత్రి మాట మార్చారు. ప్రభుత్వం ఒక నిర్దిష్ట వైఖరిని తీసుకోలేదు. ఇపుడు చంద్రబాబు బిందుసేద్యం, ఇజ్రాయిల్ తుంపర్ల సేద్యం గురించి మాట్లాడటం ప్రారంభించారు. కేంద్ర మాజీమంత్రి సురేష్‌ప్రభు నాయకత్వంలో ఒకటాస్క్‌ఫోర్స్ ఏర్పడింది. అసలు అనుసంధానంలోని అంశాలు ఏమిటి? నదుల అనుసంధానం ప్రజలకు, దేశానికి, ప్రపంచానికి కొత్తఏమీకాదు. కాకతీయుల కాలంలో చెరువుల లింకు కాలువల విధానం ద్వారా చిన్న నీటివనరులను చక్కగా ఉపయోగించుకున్న అనుభవాలు వున్నాయి. సాంకేతిక విజ్ఞానం పెరిగేకొలదీ వినియోగస్థాయి పెరిగింది. 1857లో సర్ ఆర్థర్ కాటన్ రవాణాకు నదులను కలిపారు. 1977లో కె.యల్.రావు గంగా-కావేరి అనుసంధానం చేయాలని ప్రతిపాదించారు. సట్లెజ్-బియాస్ నదుల అనుసంధానం అమలులో వుంది. దేశంలోని కరువుకాటకాల నివారణకు ఒక ప్రతిపాదన చేయగా అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ ఆపథకాన్ని 20 వేలకోట్లఖర్చుతో పూర్తిచేయవచ్చునని ప్రకటించారు. నేటి అనుసంధాన ప్రతిపాదనకంటే ముందే రూ.1,55,000 కోట్లతో 14 కోట్ల ఎకరాలకు నీరు అందించే ఒక పథకాన్ని మాజీ కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి సోమ్‌పాల్ చెత్తబుట్టలో పారేశారు. అంతేకాదు, జాతీయ నీటి అభివృద్ధి ఏజెన్సీ (NWDA) చేసిన అనేక ప్రతిపాదనలు పరిశీలన దశలోనే వున్నాయి. కాగా అనుసంధానం కొత్తవిషయమేమీ కాదని, చంద్రబాబు మేధస్సునుంచి ఊడిపడినది (Bright Idea) ఏమీకాదని పై చరిత్ర తెలియజేస్తుంది.

ఇపుడు అనుసంధానంలోని విషయాలను తెలుసుకుందాం. అనుసంధానం ప్రధానంగా రెండుదశలుగా నడుస్తుంది. 1. హిమాలయాల నదుల అనుసంధానంలో 14 లింకు కాల్వలు, ద్వీపకల్ప అనుసంధానం 17 లింకు కాలువల ద్వారా చేస్తారు. వింధ్య పర్వతాలు దాటడానికి 1800 అడుగుల ఎత్తున నీటిని ఎత్తిపోతల ద్వారా లిఫ్టుచేయాలి. 37 నదులు లింక్ అవుతాయి. 36 రిజర్వాయర్లు నిర్మించాలని, 10876 కి.మీ. పొడవునా కాల్వలు తవ్వాలని, దీనికి 54 మిలియన్ టన్నుల సిమెంటు, రెండు మిలియన్ టన్నుల ఉక్కు అవసరం అని, నిర్మాణం పూర్తిఅయితే అయిదు మహానగరాలు, 104 కరువు జిల్లాలకు నీరందుతుందని, 34 మిలియన్ హెక్టార్ల భూమి సాగులోకి వస్తుందని, 34 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని, మొత్తంగా 5,60,000 కోట్లు అవసరం అవుతుందని అంచనాలు తెలుపుతున్నాయి. అంతేకాదు, నిర్దిష్ట కార్యాచరణ కూడా ప్రకటించారు. 2003 జూలై నాటికి ప్రాథమిక నివేదిక, 2005 డిసెంబరు 31 నాటకి అధ్యయనాలు పూర్తిచేసి 2006 డిసెంబరు 31 నాటికి ప్రాజెక్టు నివేదికలు సమర్పించాలి. 2007 నుంచి పనులు ప్రారంభించాలి. 2016 నాటికి అనుసంధానం పూర్తికావాలి. అంచనాలు, ఫలితాల చిత్రం అద్భుతంగా వున్నాయి. ఇంకేమిటి?

సాధ్యాసాధ్యాలు

ఎ. ఆర్థిక స్తోమత వుందా? రూ. 5,60,000 కోట్లు సమకూర్చ గలరా? దేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఇరిగేషన్‌కి ఖర్చుచేసిన నిధులు రూ.58 వేలకోట్లు, అనుసంధానానికి, దానికి 10 రెట్లు నిధులు కావాలి. దేశానికి వచ్చే వార్షిక ఆదాయం, వ్యయం, అప్పులు, వడ్డీలు పరిగణనలోకి తీసుకుంటే ఇంత భారీ ప్రాజెక్టుకు అవసరం కాగల నిధులు ప్రభుత్వంవద్ద లేవు. అప్పుతెస్తే, వడ్డీభారం పెరుగుతుంది ఆఖరుకు ఆ అదనపు భారం పడేది రైతుమీదనే.

బి. నదీజలాల గురించి రాష్ట్రాలమధ్య కొత్తవివాదాలు చోటుచేసుకుంటాయి. ఇప్పటికే ఆంధ్ర-కర్నాటక, తమిళనాడు-కర్నాటక వివాదాలు ఎలా కొరుకుడుపడనివిగా తయారయ్యాయో చూస్తు న్నాం. బీహార్‌లో లాలూ ఆందోళన చేశారు. ఒరిస్సా

అదేదారిలో ఉంది. మన రాష్ట్రంలో జిల్లాల మధ్యనే వివాదాలు చెలరేగాయి.

సి. భూసేకరణ-నిర్వాసితుల సమస్యలు రాష్ట్రాలలో చిన్నా, పెద్దా ప్రాజెక్టుల ముంపు సమస్య ప్రాజెక్టులు పూర్తిఅయినా పరిష్కారం కాలేదు. కోర్టు వివాదాల్లో కాల్వల నిర్మాణం సంవత్సరాలతరబడి వాయిదాపడుతున్నాయి. నాలుగున్నర లక్షలమంది నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం, 79,292 హెక్టార్ల అటవీభూముల పునఃనిర్మాణం, ఈ క్రమంలో లీగల్ జాప్యం అధిగమించే చర్యలు కేంద్రం వద్ద ఏమి వున్నాయి?

డి. సీజనల్‌గా ఆయానదుల్లో లభించేనీరు కాలంగడిచిన కొలదీ స్వరూపస్వభావాలు మారిపోతే ఈ పథకం ఏంకావాలి? భారీ లిఫ్టులు లేకుండా దక్షిణాదికి నీరురావటం అసంభవం. ఇంజనీర్ల అంచనాప్రకారం అనేకచోట్ల భారీలిఫ్టులుఏర్పరచాలి. చిన్నలిఫ్టులే నడపలేకపోతుండగా, భారీలిఫ్టులను ప్రభుత్వాలు సమర్థవంతంగా, గ్యారంటీగా నడపగలవని ఎలా నమ్మాలి?

ఇ. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ లాంటి పొరుగుదేశాల నుంచి మనకు నీరు రావాలి. మనం భారీ ప్రాజెక్టులు నిర్మిస్తే సకాలంలో నీరు వస్తుందా?

ఎఫ్. దేశంలో బ్రహ్మపుత్ర, గంగ, మహానది, గోదావరికి కొద్ది తేడాతో వరదలు వస్తున్నాయి. కరువు వస్తే ఒక్క బ్రహ్మపుత్రకే నీరు వస్తుంది. అప్పుడే కొంత వివాదం. ముందు వరదనీరు మళ్ళించి నిల్వ చేసుకుంటే వర్షాలు వచ్చి వరదలమయం అయ్యే స్థితి కూడా వుండదు. మానవ నియంత్రణలో ఏలోపం జరిగినా భారీ జలగండాలు ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఇవన్నీ అధిగమించి నదుల అనుసంధానం జరగాలని కోరుకుందాం. ఇంతకూ మనకు వచ్చే ప్రయోజనమేమిటి?

ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం?

మొత్తం నదుల అనుసంధానం ద్వారా 680 టి.ఎం.సి.ఎఫ్.ల నీరు సాగుకు లభ్యమవుతుందని, దీనిలో 104 టి.ఎం.సి.ఎఫ్.లు మన రాష్ట్రానికి లభిస్తాయని, అంచనాలు తెలుపుతున్నాయి. అంతేకాదు, మన రాష్ట్రంలో 25 టి.ఎం.సి.ఎఫ్. నీటిని సాగులోకి తీసుకునిరావడానికి ప్రస్తుతం రూ.50 కోట్లు అవసరం కాగా, నదుల అనుసంధానం ద్వారా నీరు పొందాలంటే రూ.500 కోట్లు ఖర్చు చేయాల్సివుంటుందని తాజాలెక్కలు చెబుతున్నాయి. మరో విషయం అనుసంధానం ద్వారా కాలువలకు నీరు కేటాయించి గోదావరి, కృష్ణా నీటిని కింది రాష్ట్రం తమిళనాడుకు విధిగా పంపాలి. ఇది మరో వివాదంలోకి దారితీస్తుంది. అదే మన రాష్ట్రంలో ఇప్పటికే హక్కువున్న గోదావరి జలాలు 760 టి.ఎం.సి.ఎఫ్. వినియోగించ డానికి చేస్తే రాష్ట్రానికి ఎక్కువ ప్రయోజనం అని వేరే చెప్పాల్సిన పనిలేదు. ఈ పని రాష్ట్రం ఎందుకు చేయదు. పైగా అంతగా లాభంలేని అనుసంధానం ఎందుకు కోరినట్లు? మన రాష్ట్రం పూర్తిగా ప్రపంచ బ్యాంకు షరతుల బంధనాల కబంధ హస్తాలలో చిక్కుకొని వుంది. భారీప్రాజెక్టులు నిర్మించరాదని, కొత్త ప్రాజెక్టులు చేపట్టరాదని పెట్టిన షరతు ఫలితంగా గోదావరి నీటిని వినియోగించుకునే "పథకం" వేసినా అమలుకు రాలేదు. పూర్తి కావలసిన దేవాదుల పరిశీలన దశలో వుంది. 30 ప్రాజెక్టులు అరకొర నిధులతో పూర్తి కాకుండా వున్నాయి. అంతేకాదు, 57 వేల కోట్ల అప్పు పెరిగింది. ఇంకా ఇచ్చేవాడున్నా, వడ్డీకూడా కట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. సాంకేతికంగా లాభం లేకపోయినా, కరువుకు నదుల అనుసంధానం పరిష్కారంగా చెప్పి, అసంతృప్తిని కేంద్రంపై మళ్ళించడానికి చంద్రబాబు చేసిన కృషి ఫలించిందని చెప్పవచ్చు.

నదుల అనుసంధానం అవసరం లేదా?

మనరాష్ట్రానికి సంబంధించినంతవరకు రాష్ట్రప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులను పక్కనపెట్టి ప్రతి సంవత్సరం సముద్రం పాలవుతున్న గోదావరి నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకొనే కృషిచేస్తే రాష్ట్రంలో నీటికొరతను తీర్చుకోవచ్చు. బయటనదుల నుండి నీరు శ్రీరాంసాగర్‌కు జూరాలను కలిపేవిధంగా 100-150 టి.ఎం.సి.ఎఫ్.నీరు లభించే లింకుకాలువలు వచ్చే అవకాశం వుంటే తప్ప ఇతరత్రా ఉపయోగం లేదు. జాతీయ అవసరాల రీత్యా కర్తవ్య భారాన్ని మోయాల్సింది కేంద్రం. ఆ విధంగా జాతీయ ప్రాజెక్టులుగా ఇచ్చంపల్లి, పోలవరం నిర్మించి మన వాటానీరు, విద్యుత్‌పై మన హక్కులకు భంగం కలగకుండా నిధులు కేటాయిస్తే రాష్ట్రానికి ఉపయోగం. లింకులు చేసే విధానంమీదే ఖర్చు మీదే అనే పాలసీని కేంద్రం తెస్తే రాష్ట్రానికి ఏమీ లాభం లేదు.

"జాతీయ జలవిధానం-అనుసంధానవిధానం" రచించకుండానే 'అనుసంధానం' ప్రాజెక్టు గొప్పతనం గురించి కేంద్రంలోని ఎన్.డి.ఏ. ప్రభుత్వం చేసే ఆర్భాటం రాబోయే ఎన్నికలకు ప్రచార సాధనంతప్ప కరువుపీడిత ప్రజల సాగు-తాగునీరు కొరత తీర్చదు. వారి అధికార దాహం తీర్చుకోవడానికి సాధనంగా, ప్రచారాస్త్రంగా ఉపయోగపడు తుంది. ఎన్.డి.ఎ.లో స్నేహంగా వున్నందున ఆమేరకు చంద్రబాబుకు రాజకీయలాభం కలుగవచ్చు తప్ప రాష్ట్రప్రజలకు వచ్చే ప్రయోజనం ఏమీ కానరావటంలేదు. ○

ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంటు ప్రతిపాదనలో గందరగోళం

— కస్తూరి అంజయ్య

ప్రజాపక్ష సమీక్ష జూలై 1-15 మరియు జూలై 16-31 రెండు సంచికల్లో అచ్చయిన "ఐక్య సంఘటన వ్యూహం-ఎత్తుగడలు" శీర్షికలో కొల్లి సత్యనారాయణగారు రాసిన వ్యాసానికి ప్రతిస్పందనగా నేనిది రాస్తున్నాను.

ఆ వ్యాసం మొత్తం ఒకటికి నాలుగుసార్లు చదివినప్పటికీ అసలు సత్యనారాయణగారు నిర్దిష్టంగా చెప్పదలుచుకున్నది ఏమిటో అర్థం కాలేదు. అంతేగాక, పాఠకులను కొంత గందరగోళానికి, అయోమయానికి గురిచేసే ఆస్కారం ఉంది. 'అంతర్జాతీయం' శీర్షిక కింద వచ్చిన ఈ వ్యాసంలో ప్రధానంగా రెండవ ప్రపంచయుద్ధ కాలంలో కామ్రేడ్ స్టాలిన్ నాయకత్వాన సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలోని సోషలిస్టు ప్రభుత్వం అనుసరించిన ఎత్తుగడల గురించి వివరించడం జరిగింది. నేటి అంతర్జాతీయ పరిస్థితులలో మళ్ళీ రెండవ ప్రపంచయుద్ధ కాలంనాడు అనుసరించిన విధానాన్నే అనుసరించాలని, ఫాసిస్టు బుష్-బ్లెయిర్ వ్యతిరేక కూటమి (ఫ్రంట్) ఏర్పాటు చేయాలనేది తక్షణ అవసరంగా చెప్పడం జరిగింది. ఈ తక్షణ అవసరం గురించి నొక్కిచెబుతున్న క్రమంలో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ యూనియన్ ప్రభుత్వం అవలంబించిన ఎత్తుగడలను సుదీర్ఘంగా వివరించడం జరిగింది, కానీ నేటి పరిస్థితులకు అది నిర్దిష్టంగా ఎట్లా వర్తిస్తుందనే అంశం గురించి అశ్రద్ధవహించి చాలా యాంత్రికంగా అన్వయించే ప్రయత్నం చేశారు.

అంతేగాక, యాంత్రికంగానే అయినప్పటికీ అంతర్జాతీయ పరిస్థితులలో అవలంబించవలసిన ఎత్తుగడల గురించి ఒకవైపు చర్చిస్తూ, ఇప్పుడు భారతదేశంలో సి.పి.ఐ., సి.పి.యం. వంటి పార్టీలు చేపడుతున్న మూడవ ఫ్రంటు గురించి ప్రస్తావించడం జరిగింది. ప్రస్తావించడం మాత్రమే కాదు, స్టాలిన్ అనుసరించిన విధానంలో అది పొసగదని కొంత అస్పష్టంగానే అయినప్పటికీ వ్యాఖ్యానించడం జరిగింది. ఇది మరింత గందరగోళానికి గురిచేసే అంశం. ఎందుకంటే, గత కొన్నేళ్ళుగా సి.పి.ఐ., సి.పి.యం. వంటి పార్టీలు దేశంలో అనుసరిస్తూవస్తున్న రాజకీయ విధానాలలో మూడవ ఫ్రంటు గురించిన అంశం ఒకటి బహుళ ప్రచారంలో ఉంది. ఈ మూడవ ఫ్రంటు అనేది పాలకవర్గాలకు చెందిన పాలకపక్షం, ప్రతిపక్షంలకు అతీతంగా మూడవ ప్రత్యామ్నాయంగా ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చే ప్రయత్నం చేస్తున్న రాజకీయ కూటమి అనే నేను అనుకుంటున్నాను. బహుశా అందరూ ఈ విధంగానే అర్థం చేసుకుంటున్నారని నేననుకుంటున్నాను. ఇట్లా ఒకదేశంలో కేవలం పార్లమెంటరీ రాజకీయాలలో భాగంగా అవలంబించబడుతున్న మూడవ ఫ్రంటు ఎత్తుగడను అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక కూటమితో పోల్చి చర్చించడం వల్ల గందరగోళం ఎక్కువవుతుందే కానీ విషయం పట్ల స్పష్టత కలగదు.

ఈ అంశాన్ని ప్రక్కనపెట్టి, అసలు చర్చనీయాంశమైన అంతర్జాతీయ పరిస్థితి గురించీ, ఫాసిస్టు బుష్-బ్లెయిర్ వ్యతిరేక ఐక్య సంఘటన గురించీ వ్యాసకర్త వెలిబుచ్చిన అభిప్రాయాలు భౌతిక, వాస్తవిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా స్వీయ మానసికతకు, ఊహాగానాలకు ప్రాధాన్యతనిచ్చి చర్చించడం జరిగింది. ఒకవైపు నేడు ప్రపంచంలో సోషలిస్టు శిబిరం గానీ, సోషలిస్టు దేశం కానీ, ప్రభుత్వం కానీ లేవని అంటూనే (ఈ అంశంపై 'నేటి పరిస్థితి ఏమిటి?' అనే ఉపశీర్షిక క్రింద జూలై 16-31 సంచిక 15వ పేజీలో వ్యాసకర్త రాసిందాని ప్రకారం సోషలిస్టు శిబిరం లేదు కానీ, సోషలిస్టు దేశాలు, కమ్యూనిస్టు దేశాలు ఉన్నాయనే అర్థం స్ఫురించే విధంగా రాసినదాని గురించి చర్చించుకోవడం అప్రస్తుతం అని భావిస్తున్నాను) అమెరికన్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాలలోని పోరాట శక్తులను ఏకం చేయవలసిన బాధ్యత ప్రపంచంలోని విప్లవసంస్థలన్నింటిపై ఉందని రాస్తూ, ఈ ఫ్రంటుకు యూరోపియన్ యూనియన్ వంటి పెట్టుబడిదారీదేశాలను మిత్రదేశాలుగా కలుపుకు రావాలంటూ పిలుపిచ్చారు. సోవియట్ యూనియన్ అగ్రరాజ్య స్థాయినుండి దిగజారి, ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు మారిపోయి అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా తన ప్రయోజనాలకు సహకరించని దేశాల ప్రభుత్వాలను గద్దె దించడానికి చాలా దూకుడుగా దాడులకు పాల్పడుతున్న అంతర్జాతీయ పరిస్థితులు ఒక వాస్తవికత కాగా, అయితే వ్యాసకర్త రాసినట్లు సామ్రాజ్యవాద దేశాలు మళ్ళీ రెండు శిబిరాలుగా చీలిపోయినాయనే విశ్లేషణ సరైనదేనా? ఇదే వ్యాసంలో ఇరాక్‌పై దాడి సందర్భాన్ని వివరిస్తూ రెండు శిబిరాల మధ్య వైరుధ్యాలు మరింత ఎక్కువగా వెలుగులోకి వచ్చాయి అని రాసి, ఇరాక్‌లో పెట్రోలులో వాటాకోసమే ఫ్రాన్స్, జర్మనీ, రష్యాలు అమెరికాతో తగాదా పడుతున్నాయంటూ అమెరికాను ఎదిరించే దమ్ములు ఈ దేశాలను లేవని సోషలిస్టు శిబిరం లేకపోవడమే అందుకు కారణంగా రాయడం జరిగింది. సామ్రాజ్యవాద దేశాలు రెండుశిబిరాలుగా చీలినాయనే తన ప్రధాన చర్చనీయాంశాన్ని తానే తిరస్కరించి మళ్ళీ అదే అమెరికా వ్యతిరేక యూరోపియన్ దేశాలతో ఫ్రంటు కట్టాలని పిలుపివ్వడం, అది కూడా సోషలిస్టు దేశం కానీ, ప్రభుత్వం కానీ అస్థిత్వంలో లేని ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులలో విప్లవశక్తులు చాలా బలహీనంగా ఉన్న సందర్భంలో అట్లాంటి ఫ్రంటు కట్టాలనీ పిలుపివ్వడం వాస్తవ పరిస్థితులలో సంబంధంలేని స్వీయ మానసికతకు ఊహాగానాలకు గురైన ఫలితమే తప్ప మరేమీ కాదని భావించవలసి వస్తుంది.

అసలు సామ్రాజ్యవాదదేశాలు రెండు శిబిరాలుగా ఏర్పడ్డాయనే దానికే ఆధారం లేదు. అమెరికాను వ్యతిరేకిస్తున్నట్టు కనిపిస్తున్న

దేశాలు తమ బేరమాడే శక్తిని పెంచుకుంటున్నాయే కానీ, కొన్నికొన్ని సందర్భాల్లో తమ ప్రయోజనాల రక్షణకై కొంత గొంతు చించుకుంటున్నాయే కానీ, మొత్తంగా చూసినప్పుడు అవి ఒక శిబిరంగా ఏర్పడలేదనేది వాస్తవం. వ్యాసకర్త కూడా ఇరాక్ సందర్భంలోనే ఈ విషయాన్ని అంగీకరిస్తూ రాయడం జరిగింది కూడా. ఈ విధంగా పరస్పర భిన్నమైన అభిప్రాయాలు, అవగాహనలు ఒకే వ్యాసంలో చోటు చేసుకోవడం పట్ల అసలు ప్రధాన చర్చనీయాంశంపై ఏం చెప్పాలనుకుంటున్నారో మొత్తం గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయి. సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలను నెరవేర్చడానికై రూపొందించబడిన ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకించి ప్రజలను పోరాటంలోకి కదిలించే ఉద్దేశంతో ఏర్పడిన 'ఫేగ్' గురించి ఒకచోట పేర్కొని ఆ వేదిక అమెరికా వ్యతిరేక ఫ్రంట్‌గా రూపుదిద్దుకోవాలి అంటూ యూరోపియన్‌యూనియన్ వంటి సామ్రాజ్యవాద దేశాలను మిత్రదేశాలుగా కలుపుకురావాలంటూ సూచన చేయడం జరిగింది. నాకు తెలిసినంతవరకు 'ఫేగ్' దేశంలోని పాలకవర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ప్రపంచీకరణ విధానాలను ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఆ రకంగా సామ్రాజ్యవాద శక్తుల దోపిడీ నుండి, పట్టునుండి ఈ దేశాన్ని విముక్తం చేయాలనే అవగాహనను పెంపొందిస్తూ, పోరాటాలలోకి కదిలించడం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నది. అదికూడా ప్రస్తుతం చాలా బలహీనంగానూ, బాల్యావస్థలోనూ ఉంది. దాని బలాబలాల సంగతిని ప్రకనపెట్టి చూసినా యూరోపియన్ దేశాలతో ఫ్రంటు కట్టడం అనేది ఇంతకు ముందే వివరించినట్లు, ఆధారరహితమైన ఊహాగానాలపై స్వీయ మానసికతతో అంతా గందరగోళమయంగా చేసిన భ్రమాజనిత విశ్లేషణ కాబట్టి దానిపై ఇక ఎక్కువ రాయడం అనవసరం.

సోవియట్ యూనియన్ అగ్రరాజ్య స్థాయినుండి దిగజారిన తర్వాత అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా ఏకధృవ ప్రపంచంగా మారిన పరిస్థితులలో కొన్ని సందర్భాలలో వివిధ సామ్రాజ్యవాద దేశాలు అమెరికా ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ స్థూలంగా చూసినపుడు సామ్రాజ్యవాద దేశాలు అమెరికా అనుకూల, వ్యతిరేక శిబిరాలుగా ఏర్పడలేదు. తమప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి అవి అన్నీకూడా అమెరికాతో రాజీపడుతూ, బలపర్చుతూ టెర్రరిస్టు వ్యతిరేక పోరాటం పేరుతో వివిధదేశాల, ప్రాంతాల, జాతుల ఆకాంక్షల్ని, పోరాటాలను అణచివేయడానికి కుమ్మక్కవుతూ, ఆ విధంగా వెనకబడిన మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు తమదేశ ప్రజల కనీస ప్రజాస్వామిక హక్కులు హరించివేస్తూ ప్రజా పోరాటాలపై క్రూర దమనకాండకు పాల్పడడానికి తోడ్పడుతున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై దాడి సందర్భంలోనూ ఇంకా ఇతర చాలా సందర్భాలలోనూ మనం ఈ దృశ్యాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నాం. ఇప్పటికి ఇది వాస్తవం. ఇక, రానున్న అంతర్జాతీయపరిణామాలు ఏరూపం తీసుకుంటాయో, యూరోపియన్ యూనియన్ దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా ఏమేరకు ఘర్షణ వైఖరిని తీసుకుని ప్రత్యక్షంగా తలపడడానికి సిద్ధమవుతాయోననేది ప్రస్తుతానికి కేవలం ఊహకు సంబంధించిన అంశమే. అయితే, నిర్దిష్ట ఆచరణలో భాగంగా ఏర్పడే ఏ ఫ్రంటుల నిర్మాణం అయినా ఆకాలంలోని భౌతిక, వాస్తవపరిస్థితుల విశ్లేషణపై ఆధారపడి రూపొందుతాయే తప్ప మరోలాకాదు.

ఇట్లాచూసినపుడు వెనుకబడిన, మూడవ ప్రపంచదేశాలు వివిధ సామ్రాజ్యవాద శక్తులకు నయా వలసలు గానీ, అర్థవలసలు గానీ ఉండి ఆయా దేశాలకు చెందిన దళారీ కీలుబొమ్మ పాలకవర్గాలు సామ్రాజ్యవాదులతో ఘర్షణ పడలేని స్థితిలో ఉండటమే గాక ప్రజల నిరసనను, ప్రతిఘటనను పాశవికంగా అణచివేయడం జరుగుతోంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలోని తాలిబన్, సద్దాం హుస్సేన్ ప్రభుత్వాలు అమెరికాను సవాలుచేసి ఎదురొడ్డి నిలవడం మినహాయింపు కల దృశ్యంగా కనిపిస్తున్నప్పటికీ, సామ్రాజ్యవాద ప్రయోజనాలు నెరవేర్చేక్రమంలో సంభవించిన పలు పరిణామాలలోని ఒక ప్రత్యేక పరిస్థితిగా అవగాహన చేసుకోవాలి. ఏది ఏమైనా అలా అమెరికానో, మరో సామ్రాజ్యవాద శక్తినో పరిమిత స్థాయిలోనైనా ఎదిరించే మూడవ ప్రపంచ దేశాలు–ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, ఇరాన్, ఉత్తర కొరియా, క్యూబా వంటివి–చాలా అరుదు. అలా ఎదిరిస్తున్న దేశాల్లోని పాలకవర్గాలకు తమ స్వప్రయోజనాల రక్షణ ప్రధాన లక్ష్యం కాగా సామ్రాజ్యవాద విధానాలను మొత్తంగా వ్యతిరేకించడం వాటి పరిధికి, పరిమితికి మించిన పని. మనదేశంలోని పాలకవర్గాలు అమెరికాతదితర సామ్రాజ్యవాదులప్రయోజనాలు నెరవేర్చే క్రమంలోనే తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నాయి. ఆ పరిమితుల్లోనే ఈ పాలకవర్గాలు దక్షిణ ఆసియాలో పెద్దన్నపాత్ర నిర్వహిస్తూ పొరుగుదేశాలపై విస్తరణవాద కాంక్షతో ఆధిపత్యం నెరపడానికి తీవ్రంగా పాటుపడుతున్నది వాస్తవమే. అయితే అలా వ్యవహరిస్తున్నందువలన భారత పాలకవర్గాలు దళారీ స్వభావాన్ని కోల్పోయినాయని గానీ, భారత వ్యవస్థ అర్థవలస–అర్థ భూస్వామ్య స్వభావాన్ని కోల్పోయిందని గానీ నిర్ధారణకు రాలేం.

కావున, మొత్తం ప్రపంచపరిస్థితినీ, దేశీయపరిస్థితినీ పరిశీలించినప్పుడు అంతర్జాతీయస్థాయిలో అమెరికా వ్యతిరేక ఫ్రంటు (దానిని ఫాసిస్టు వ్యతిరేకఫ్రంటు అనవచ్చునా అనేది మరో చర్చనీయాంశమే) ఏర్పాటుకు ప్రస్తుతానికైతే ఎలాంటి ఆస్కారం, అవకాశం లేదు. ఏ ఒక్క బలమైన సోషలిస్టు దేశం మిగలకుండా పోయిన స్థితిలో సామ్రాజ్యవాద వ్యతిరేకంగా, దళారీ, భూస్వామ్య పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఆయా స్థాయిలలో విప్లవ పథంలో పురోగమిస్తున్న వివిధ వెనకబడిన, మూడవ ప్రపంచ దేశాల ప్రజలకు నైతికంగా గానీ, వస్తుపరంగా గానీ ఎలాంటి సహాయం అందే అవకాశాలు కూడా మృగ్యమే. ఈ పరిస్థితులలో ఆయా దేశాల విప్లవ కమ్యూనిస్టు శక్తులు తమ రాజకీయ నిర్మాణ, పోరాట శక్తిని పెంచుకుంటూనే పరస్పర సహాయ, సహకారాలు అందించుకుంటూ, అనుభవాలు పంచుకుంటూ, అంతర్జాతీయ స్థాయిలో సమన్వయ, సంఘీభావ

సమితులను, వేదికలను ఏర్పాటు చేసుకుని సామ్రాజ్యవాద వ్యతిరేక సోషలిస్టు ఉద్యమాన్ని పురోగమింపజేయడం తప్ప మరోదారి లేదు. ఆ క్రమంలో ఒకటో, రెండో బలమైన పెద్ద దేశాలలో విప్లవం విజయవంతం అయితే తప్ప, పరిస్థితులు డిమాండ్ చేస్తేనే అయినప్పటికీ అటువంటి అంతర్జాతీయ ఫ్రంటు ఏర్పడటం సాధ్యం కాదు. ఏ ఫ్రంటుకైనా నాయకత్వం ఎవరిదన్నది ప్రధాన సమస్య. ఒకవేళ సత్యనారాయణగారు భావించినట్లు రెండు సామ్రాజ్యవాద శిబిరాలు ఏర్పడినా ఏ ఒక్క దేశంలోనూ కమ్యూనిస్టు శక్తులు పాలనలో లేని పరిస్థితులలో అటువంటి ఫ్రంటులో పాల్గొనడం గానీ నాయకత్వం వహించడం గానీ ఆచరణకు అందని విషయమే. అందుకని ఈ విషయంపై ఇలా చర్చించడం వల్ల లాభం లేదు. వాస్తవ పరిస్థితులకు అనుగుణమైన, పరిస్థితులు డిమాండుచేసే నిర్మాణ, పోరాటరూపాలు చేపడితేనే ప్రజా విప్లవోద్యమాలకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం 'ఫేగ్' అనే పేరుతో మన దేశంలో ఏర్పడిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక వేదిక ప్రపంచీకరణ దుష్ఫలితాలపై ప్రజలను విశాల ప్రాతిపదికన కదిలించడానికై ఉద్దేశించబడినదే కాని అంతకు మించిన లక్ష్యాలు-విప్లవ శక్తుల ఐక్యత కానీ, అంతర్జాతీయ స్థాయి ఫ్రంటు ఏర్పాటు కానీ-కలిగినది కాదు. అటువంటి లక్ష్యాల సాధనకు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యక్షంగా పాటుపడవలసి ఉంటుంది. దేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమ సాధనకై కార్మిక-కర్షక మైత్రి ఆధారంపై జాతీయ బూర్జువాజీతో సహా నాలుగు వర్గాల ఐక్య సంఘటనను అభివృద్ధిపరుచుకోవలసి వుంటుంది. 'ఫేగ్' వంటి వేదికలు ఈ లక్ష్యసాధనకు ఉపకరించేవే అయినా నాలుగు వర్గాల ఐక్య సంఘటనకు ప్రత్యామ్నాయం కాలేవు.

వ్యాసకర్త అంతర్జాతీయ స్థాయిలో ప్రతిపాదించిన ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంటు యొక్క నిర్దిష్ట అన్వయం దేశంలో ఎలా ఉంటుందనే దానిగురించి స్పష్టంగా రాయకున్నప్పటికీ సిపిఐ, సిపియం పార్టీల మూడోఫ్రంటు ప్రతిపాదనపై నెగటివ్‌గానే అయినా స్పందించిన తీరు చూస్తే దేశీయంగా ప్రస్తుతం ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంటు ఏర్పాటు పట్ల సముఖత వ్యక్తం చేసినట్లు అర్థమవుతోంది. మనదేశంలో ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంటుకై ఇప్పటివరకు ఏ విప్లవ పార్టీలు పిలుపిచ్చినట్లు లేదు. అసలు దేశంలో అలాంటి పరిస్థితి ఉందా? పాలక ప్రభుత్వాన్ని ఫాసిస్టుగా సంబోధించడం ఒక ఎత్తయితే, దానికి వ్యతిరేకంగా పాలకవర్గాలలోని ప్రతిపక్ష శక్తులతో ఫ్రంటు కట్టే పరిస్థితిలో గానీ, ఆ ఫ్రంటులపై విప్లవ శక్తుల నాయకత్వం కానీ ఏర్పడే పరిస్థితులు ఉన్నాయా? ఈ అంశాలపై సీరియస్‌గా ఆలోచించకుండా, తాము చేసే ప్రతిపాదనలు ఎటు దారితీస్తాయో లోతుగా విశ్లేషించకుండా 'ఐక్య సంఘటన-వ్యూహం, ఎత్తుగడలు' వంటి విషయాన్ని చర్చించడం వల్ల నేను ముందే రాసినట్లు గందరగోళం, అయోమయం పెరగడానికి దోహదం పడ్తుందే తప్ప పాజిటివ్‌గా ఉపయోగపడదు. దేశంలో ఫాసిస్టు వ్యతిరేక ఫ్రంటు ఏర్పాటు ఆవశ్యకతపై సీరియస్‌గా భావించినట్లయితే దానిపై కేంద్రీకరించి స్పష్టంగా చర్చించి ప్రతిపాదించాలి. కానీ, అంతా అస్పష్టత, అయోమయంతో అరకొరగా విషయాన్ని తడమడం వలన ఆ చర్చలోకి ఇంకా లోతుగా పోకుండా నన్ను నేను పరిమితం చేసుకుంటున్నాను. ○

(22వ పేజీ తరువాయి)

స్వార్థపర శక్తుల్ని, పాలకవర్గాల్ని ఎదిరించడానికి చేతులు కలపడం అటుంచి, తమతమ సంకుచిత ప్రయోజనాల కోసం తమలోతాము కుమ్ములాడుకుంటున్నాయి. ముఖ్యంగా తీవ్రవాద, మితవాద వామపక్షాలనడుమ ఒక అప్రకటిత, లేక కొన్నిసందర్భాల్లో బాహాటంగా ప్రకటిత, వైరభావం చోటుచేసుకుని వున్నది. పరిస్థితుల వత్తిడివల్ల పరస్పరం చేతులు కలిపిన సందర్భాల్లో సైతం ఒకరినొకరు ఎద్దేవా చేసుకునే, శంకించుకునే, తిట్టిపోసుకునే పద్ధతులు ఇంకా అంతరించ లేదు. అభిప్రాయభేదాల్ని గుర్తించి, గౌరవించి, నిజాయితీగా హృదయ పూర్వకంగా ఉమ్మడి లక్ష్యం కోసం చేతులు కలపవల్సిన, ఉమ్మడి సమస్యలపై కలిసి పోరవల్సిన అత్యవసరాన్ని ఈ పక్షాలు సరిగా గుర్తించడం లేదు. వీటన్నింటి మూలంగా మనదేశ రాజకీయాల్లో తాము పొలిమేరలకు నెట్టివేయబడుతున్నామని (marginalise) అవుతున్నట్లు) ఇవి గుర్తించడం లేదు. కనుక పరస్పర వైరాలు, వైమనస్యాలు తగ్గించుకుని నిజాయితీగా, విశాల భావాలతో ప్రజా సంక్షేమంకోసం ఐక్యకార్యాచరణకైనా వెంటనే తలపడడం ముఖ్యమని గుర్తించడం, అందుకు తగిన వాతావరణం సృష్టికి, పద్ధతులు రూపొందించడానికి కృషిచేయాల్సి వున్నది.

పోతే సాంఘిక, ఆర్థిక న్యాయాలతో కూడుకున్న ప్రజా సంక్షేమం, సెక్యులరిజం ప్రాతిపదికన మతసామరస్యంకోసం, సర్వ మానవ సౌభ్రాత్రభావన ప్రేరణతో పొరుగుదేశాలతోమైత్రికి, సమస్యల పరిష్కారానికి పాటుపడే క్రమంలో వామపక్షాలన్నీ పడికట్టు పద జాలాలను, కాలంచెల్లిన పిడివాద సూత్రీకరణలను వదులుకొని ఒక వ్యావహారికమైన ఆదర్శవాదాన్ని (pragmatic idealism) అవలంబించ వల్సిన అవసరం ఎంతైనా వుందని కూడా నా నిశ్చితాభిప్రాయం. అలాగే సోషలిస్టు, మార్క్సిస్టు సిద్ధాంతాలను మనదేశ ప్రత్యేక పరిస్థితులకు అనువుగా వర్తింపజేసుకోవాలని, మనకున్న సుసంపన్నమైన తాత్విక, సాంస్కృతిక వారసత్వాన్ని తగినంతగా అవగాహన చేసుకుని, తద్వారా సత్ఫలితాలు పొంద ప్రయత్నించాలని, ముఖ్యంగా దేశాన్ని వేధిస్తున్న అనేక తీవ్ర సమస్యల (burning issues) పరిష్కారానికి సంబంధించినంతవరకు వ్యతిరేకాత్మక (negative) వైఖరులు, విధానాలు చేపట్టకుండాజాగ్రత్తపడాలని నేను భావిస్తున్నాను. ఈ విషయమై కూడా తగినంత చర్చ జరగగలదని, ఆ క్రమంలో వామపక్షాలన్నింటికీ ఆమోదయోగ్యమైన హృదయపూర్వక, విశాల భావయుతఐక్యతకు ప్రాతిపదిక ఏర్పడగలదని కూడాఆశిస్తున్నాను. ○

12వ ఆర్థిక సంఘం - అభివృద్ధి, వాస్తవం

— ప్రొ. కె. చక్రధరరావు

ఆగస్టు 21, 22, 2003 తేదీలలో డా. రంగరాజన్ అధ్యక్షతన వున్న 12వ ఆర్థిక సంఘం హైద్రాబాదు వచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాలలో తమ పర్యటనలో భాగంగా వారు మనరాష్ట్రానికివచ్చారు. ఆ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, అధికారులు, అలాగే ప్రతిపక్ష నాయకులు, వ్యాపార వర్గాలు, కార్మిక సంఘాలు ఆర్థిక సంఘాన్ని కలిసి తమ అభిప్రాయాలను, డిమాండ్లను సమర్పించారు. వాటిలోని వివిధ అంశాలనూ, వాటి సమంజస, అసమంజసాలనూ పరిశీలించేముందు, ఆర్థిక సంఘం పూర్వాపరాలనూ, గత ఆర్థిక సంఘం చేసిన సూచనలను ఒకసారి గమనిస్తే బాగుంటుంది.

భారత ఫెడరల్ వ్యవస్థ

మన రాజ్యాంగం ఫెడరల్ (సమాఖ్య) స్వభావాన్ని కలిగివుండి మనదేశం ఒక 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనీ, మనది ఒక ఫెడరల్ యూనియన్ అనీ చెబుతుంది (1వ అధికరణం). అలాగే 11వభాగం యూనియన్ మరియు రాష్ట్రాల మధ్య సంబంధాలను నిర్దేశిస్తుంది. 246వ అధికరణంలో యూనియన్ మరియు రాష్ట్రాల మధ్య విధుల విభజన (7వ షెడ్యూల్‌లో) ఇవ్వబడింది. యూనియన్ జాబితా, స్టేట్ జాబితా మరియు ఉమ్మడి జాబితాలుగా యీ విధులు చట్టాలు చేయడానికీ, పాలన కొరకు విభజించబడ్డాయి. అలాగే విత్త సంబంధిత అధికారుల విభజన చేయబడి, యూనియన్ పన్నులూ, స్టేట్ పన్నులుగా రెండు లిస్టులు మరియు పన్నుల ఆదాయ పంపిణీ పద్ధతికూడా పొందుపర్చబడ్డాయి. యూనియన్‌పన్నులలో ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్ను, కస్టమ్స్ డ్యూటీ, ఎక్సైజు డ్యూటీ, స్టాంపు డ్యూటీలు ముఖ్యమైనవి. అలాగే స్టేట్ పన్నులలో భూమిశిస్తు, వస్తువుల అమ్మకపు పన్ను, ఎక్సైజు పన్ను, వృత్తిపన్ను, వినోదపు పన్ను ముఖ్యమైనవి.

ఆర్థిక సంఘం

రాజ్యాంగంలోని 280వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి ప్రతి 5 ఏళ్ళకొకసారి ఆర్థిక సంఘాన్ని నియమించాలి. యూనియన్ మరియు రాష్ట్రాల మధ్య పన్నుల ఆదాయ పంపిణీ, రాష్ట్రాలకు యూనియన్ చెల్లించే గ్రాంట్-ఇన్-ఎయిడ్ మరియు రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే రుణాలకు సంబంధించిన సూత్రాలను నిర్ణయించి సూచనలు చేయడం ఆర్థిక సంఘం విధులు. స్వాతంత్ర్యం తరువాత ఇప్పటివరకు 12 ఆర్థిక సంఘాలు నియమించబడ్డాయి.

11వ ఆర్థిక సంఘం సూచనలు

ప్రొఫెసర్ ఏ.యం.ఖుస్రో అధ్యక్షతన గల 11వ ఆర్థిక సంఘం జూలై 2000, 7వ తేదీన తమ నివేదికను సమర్పించారు. వారు చేసిన యీ క్రిందిసూచనలు ఐదేళ్ళపాటు అంటే 2000-01 నుండి 2004-05 వరకు అమలులో వుంటాయి.

1. మొత్తం రెవెన్యూ రాబడులలో 37.5 శాతం పరిమితి మేరకు రాష్ట్రాలకు బదిలీ చేయబడాలి.

2. అందులో విభజించబడే కేంద్ర పన్నుల రాబడులు 29.5 శాతం. మిగతాది గ్రాంట్-ఇన్-ఎయిడ్.

3. కేంద్ర పన్నుల నిధులలో రాష్ట్రాల వాటా యీ క్రింది ప్రాతిపదికలు మరియు వెయిట్స్‌పై ఆధారపడి నిర్ణయించబడుతుంది.

	10వ ఆర్థిక సంఘం	11వ ఆర్థిక సంఘం
1. జనాభా	20%	10%
2. రాష్ట్ర తలసరి ఆదాయానికీ మరియు అత్యధిక తలసరి ఆదాయ రాష్ట్రానికీ తేడా	60%	62.5%
3. విస్తీర్ణం	5%	7.5%
4. అవస్థాపన సూచిక	5%	7.5%
5. పన్నుల వసూలు	10%	5%
6. విత్త క్రమశిక్షణ	-	7.5%
మొత్తం	100%	100%

పై పట్టికలో కేటాయింపుల ఫార్ములాలో 11వ ఆర్థిక సంఘం చేసిన మార్పులను గమనించవచ్చు. జనాభా వెయిట్‌ను 20% నుండి 10%కి తగ్గించి, తక్కువ తలసరి ఆదాయానికి వెయిట్‌ను 62.5%కి, విస్తీర్ణం, అవస్థాపనలకు 7.5%కి పెంచి, పన్నుల వసూలుకు 10% నుండి 5%కి తగ్గించి, విత్త క్రమశిక్షణకు 7,5% వెయిట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది.

పై ఫార్ములాలననుసరించి చేసిన కేటాయింపులు యీ క్రింది విధంగా వున్నాయి.

మొత్తం బదిలీ	10వ ఆర్థిక సంఘం		11వ ఆర్థిక సంఘం	
	మొత్తం (కోట్ల రూ)	శాతం	మొత్తం (కోట్ల రూ)	శాతం
1. కేంద్ర పన్నులలో వాటా	2,06,343	91	3,76,318	86.5
2. గ్రాంట్-ఇన్-ఎయిడ్	20,300	9	58,587	13.5
(a) ప్రణాళికేతర రెవెన్యూ లోటు	7,583	3.3	35,359	8.1
(b) ప్రత్యేకస్థాయిరాష్ట్రాలఅభివృద్ధి	2,608	1.2	4,973	1.2
(c) స్థానిక సంస్థలు	5,381	2.4	10,000	2.3
(d) నివారణ వ్యయం	4,728	2.1	8,256	1.9
మొత్తం (1+2)	2,26,643	100	4,34,905	100

ఆధారం: 10 మరియు 11వ ఆర్థికసంఘాల రిపోర్టులు

2000-05 మధ్య ఆంధ్రప్రదేశ్‌కు జరిగే బదిలీలు

1. పన్నులలో వాటా	రూ. 28,980 కోట్లు	93.5%
2. గ్రాంట్-ఇన్-ఎయిడ్	రూ. 2,031 కోట్లు	6.5%
మొత్తం	రూ. 31,011 కోట్లు	100%
ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం కేటాయింపు		రూ. 31,011 కోట్లు
జనాభా		6.65 కోట్లు
తలసరి కేటాయింపు		రూ. 4,663
తలసరి ఆదాయం		రూ. 11,366

(1994-95 నుండి 1996-97 సగటు)

11వ ఆర్థిక సంఘం కేటాయింపు ఫార్ములాలో చేసిన మార్పువల్ల ఆంధ్రప్రదేశ్ రూ. 2875 కోట్లు నష్టపోయింది. అలాగే నాలుగు దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయిన మొత్తం రూ. 12,204 కోట్లు. వెనుకబడిన 8 ఉత్తరాది రాష్ట్రాలు అదనంగా పొందిన మొత్తం రూ. 16,074 కోట్లు.

రాష్ట్రాలకు ఎక్కువ విధులు, నిధుల కేటాయింపు జరగాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రాజమన్నార్ కమిటీకి ఇచ్చిన మెమోరాండంలో ఈ క్రింది సూచనలు చేసింది.

1. కేంద్ర మరియు రాష్ట్రాల విధులను, అధికారాలను స్పష్టంగా నిర్వచించాలి, విభజించాలి. కేంద్రం విధులను రక్షణ, విదేశీ వ్యవహారాలు, అంతర్జాతీయ వ్యాపారం, కమ్యూనికేషన్లు, కరెన్సీలకే పరిమితం చేసి, మిగతా విధులన్నిటిని రాష్ట్రాలకు బదిలీ చేయాలి.
2. కేంద్రం రాష్ట్రాల విధుల నిర్వహణలో జోక్యం చేసుకోకూడదు, నియంత్రించకూడదు.
3. ప్రణాళిక సంఘం మరియు జాతీయ అభివృద్ధి సంఘాల ముఖ్యమైన పాత్రకు రాజ్యాంగ గుర్తింపునివ్వాలి.
4. కేంద్ర రాబడులలో 75% రాష్ట్రాలకు బదిలీ చేయాలి.

12వ ఆర్థిక సంఘం

2005-10 మధ్యన వనరుల కేటాయింపు గురించి సూచనలివ్వడానికి 12వ ఆర్థిక సంఘం నియమించబడింది. దీని అధ్యక్షులు డా. సి. రంగరాజన్. టి.ఆర్.ప్రసాద్, సోమ్‌పాల్, డి.కె.శ్రీవాస్తవ దీనిలో సభ్యులుగా, జి.సి. శ్రీవాస్తవ మెంబర్-సెక్రటరీగా వున్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, అనేక సంస్థలు, సంఘాలు, వ్యక్తుల అభిప్రాయాలు సేకరించిన తరువాత ఆర్థిక సంఘం తన సూచనలతో నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిమాండ్లు

12వ ఆర్థిక సంఘం ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా యీ క్రింది రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు సంఘం ముందుంచారు. యీ డిమాండ్లు చాలావరకు రాష్ట్రాలను, ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసేవిగా వున్నాయి. గత శతాబ్దం 70వ దశకం నుండి రాజ్యాంగ నిర్దేశాలకు భిన్నంగా కేంద్రం శక్తివంతం కావడంతో చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఏర్పడి అధికారం లోకి వచ్చాయి. తెలుగుదేశం పార్టీ అదేవిధంగా అధికారంలోకి వచ్చిన తరువాత ఫెడరలిజం ఎజెండాను ముందుకు తెచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్ళుగా మానవతా దృక్పథంతో ఆర్థిక సంస్కరణలను అమలుజరుపుతూ, బడ్జెట్‌సంస్కరణలను కూడా తెచ్చి ఆర్థిక క్రమశిక్షణను సాధించి, రెవెన్యూ మరియు ఫిస్కల్ లోటులను తగ్గించి, పన్నుల వసూళ్ళను పెంచి ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించి, రుణాలను రాష్ట్ర నికర ఉత్పత్తిలో 26%కి, వడ్డీల చెల్లింపులను ఆదాయ-వ్యయ నిష్పత్తిలో 19.3 శాతానికి పరిమితం చేసి, 22 ప్రభుత్వరంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరించి, విద్యుత్తు రంగంలో సంస్కరణలు తెచ్చి, సింగరేణి కాలరీస్, మునిసిపాలిటీల పనితీరును మెరుగుపరచి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని అభివృద్ధిపరచి, జనాభా వృద్ధిరేటును, పేదరికాన్ని తగ్గించి అక్షరాస్యతను పెంచి, నీరు-మీరు ద్వారా నీటి నిలువశక్తిని పెంచి, నికరసాగుబడి విస్తీర్ణాన్ని 10 మి.హె., మొత్తం నీటిపారుదల విస్తీర్ణాన్ని 5.5 మి.హె.కు పెంచి సేవల రంగాన్ని అభివృద్ధిచేసి రాష్ట్రంలో ఎంతో ప్రగతిని సాధించామని వివరిస్తూ యీ క్రింది డిమాండ్లు చేశారు.

1. కేంద్ర పన్నుల రాబడులలో ప్రస్తుతమున్న 29.5% వాటాను 50%కి పెంచాలి. ఆర్థిక క్రమశిక్షణ, జాగ్రత్తలనుపాటించే రాష్ట్రాలకు ప్రయోజనాలను కల్పించాలి. కేటాయింపుల ప్రాతిపదికలను యీ క్రింది విధంగా మార్చాలి.

అంశము	ఇవ్వాల్సిన వెయిటేజ్
జనాభా మరియు విస్తీర్ణం	25
తలసరి ఆదాయం	25
అవస్థాపనపై వ్యయం	10
హెచ్.ఆర్.డి.పై వ్యయం	10
ప్రాంతీయ సంస్థలకు కేటాయింపులు	10
విత్త క్రమశిక్షణ	10
పన్నుల వసూలు	10
మొత్తం	100

2. కేంద్ర పథకాలనన్నింటినీ రద్దుచేసి వాటి మొత్తాన్ని రాష్ట్రాలకు గ్రాంటుగా ఇవ్వాలి. రాష్ట్రాలు స్వంత ప్రాధాన్యతలతో స్వంత స్కీమ్‌లు చేపట్టాలి. పథకాలలోని 70:30 లోన్, గ్రాంటు నిష్పత్తిని రద్దుచేయాలి.

3. రుణం, గ్రాంట్ నిష్పత్తిని 70:30 నుండి 50:50కి మార్చాలి; వడ్డీరేటును తగ్గించాలి; కేంద్ర రుణాలను పాక్షికంగా మాఫీచేయాలి మరియు రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్పును అనుమతించాలి.

4. సామాజిక మరియు ఆర్థిక అవస్థాపన అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి.

5. విద్యుత్‌రంగ సంస్కరణలకు తోడ్పడుతూ, ఆ భారాన్ని కేంద్రం కొంత భరించాలి. క్రాస్ సబ్సిడీ వాటా పద్ధతిని రద్దుచేయాలి.

6. స్థానిక సంస్థలకు సరిపోను గ్రాంట్లనివ్వాలి.

7. స్వయం సహాయక గ్రూపుల అభివృద్ధికి ప్రత్యేక గ్రాంటులనివ్వాలి.

8. రాష్ట్రాల వనరులను పెంపొందించి, రాష్ట్ర ఆస్తుల నిర్వహణకు, విద్యుత్తు రంగానికి, ప్రకృతి విలయాలతో నష్ట పరిహారానికి, పాలనా వ్యవస్థను ఆధునీకరించడానికి నిధులు సమకూర్చాలి.

9. ఆర్థిక సంఘం తన సూచనలను అంతర్ రాష్ట్ర సమితిలో చర్చించి ఆమోదాన్ని పొందాలి.

యితరుల ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రిన్సిపాల్ అక్కౌంటెంట్ జనరల్ ఎం.ఎస్. షెకావత్ ఆర్థిక సంఘంతో సమావేశమై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా వుందని, రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయిందనీ, ఇప్పుడు రాష్ట్రానికి రూ.57,000 కోట్ల అప్పులున్నాయనీ, యీ సంవత్సరం రూ. 6900 కోట్ల అసలు, వడ్డీ చెల్లించాలనీ, రిజిస్ట్రేషన్ ఫీజు, అమ్మకపు పన్ను, విద్యుత్తు సుంకం బకాయిలు పెరిగిపోతున్నాయనీ, ఆర్థిక నిర్వహణ సరిగాలేదని, కేటాయింపులకు, వ్యయాలకు పొంతన లేదని చెప్పారు.

రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వై. రాజశేఖర్‌రెడ్డి సంఘానికి సమర్పించిన మెమోరాండంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికస్థితి దిగజారిపోయిందనీ, 1993-94లో మిగులు రెవెన్యూ వున్న రాష్ట్ర ప్రభుత్వం లోటులోకి వెళ్ళి, రుణాలు రూ. 57,141 కోట్లకు పెరిగిందనీ, రెవెన్యూ, ఫిస్కల్ లోటుల నిష్పత్తి 48 శాతానికి పెరిగిందనీ, వడ్డీ చెల్లింపులు రెవెన్యూ రాబడులలో 25 శాతానికి పెరిగిందనీ, విదేశీప్రత్యక్షపెట్టుబడులు జాతీయస్థాయిపెట్టుబడులలో 4 శాతం మాత్రమేనని, పరిశ్రమల మూసివేత, లాకౌట్ వల్ల 7.10 లక్షల కార్మికులు నష్టపోయారనీ, వ్యవసాయరంగంలో స్తబ్దత చోటు చేసుకుందనీ, నీటిపారుదలపై పెట్టుబడులు బాగా తగ్గిపోయాయనీ, ఆర్థికవృద్ధిరేటు జాతీయస్థాయిలో 6.8 శాతంగా వుండగా, రాష్ట్రంలో 4.9 శాతం వుందనీ, రాష్ట్ర మానవాభివృద్ధి ర్యాంకు 9 నుండి 10కి పడిపోయిందనీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల సంస్థలకు ఇచ్చిన గ్యారంటీలు రూ.1,66,116 కోట్లకు పెరిగాయనీ, నీటిపారుదల, అవస్థాపన, పరిశ్రమలపై పెట్టుబడులు తగ్గిపోయాయనీ, ప్రభుత్వరంగ సంస్థలు గతంలో ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అసమానతల తొలగింపులో ఎంతో కీలకపాత్రను నిర్వహించేవని చెప్పారు.

వ్యవసాయంలో సాంకేతిక ప్రగతి, ఉత్పాదకతను పెంచడానికీ, రుణభారాన్ని తగ్గించడానికి నిధులు సమకూర్చాలనీ, వడ్డీలను మాఫీ చేయాలనీ, స్థానిక సంస్థలకు ఎక్కువ నిధులు ఇవ్వాలనీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు రాష్ట్ర ఆదాయంలో 11 శాతం మాత్రమే కేటాయించిందనీ, ఐతే రాష్ట్ర ఆర్థిక సంఘం 39.23 శాతం కేటాయించాలని సూచించిందనీ, 10, 11వ ఆర్థిక సంఘాల సూచనలను, అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘాల సూచనలను అమలుపరచ వలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆర్థిక సంఘాన్ని కోరారు.

అభివృద్ధి భ్రమలు-ప్రజల సంఘాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘానికి నివేదించినట్లుగా, అలాగే నిత్యం ప్రచారం చేస్తున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ ప్రగతిని సాధిస్తూందా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా అనేది పెద్దప్రశ్న. నిజానికి ఐ.టి.రంగం, టూరిజం, హైదరాబాదు నగరంలో రోడ్లు, ఫ్లై ఓవర్లు, పార్కులు, పెద్ద షోరూంలు, స్టార్‌హోటళ్ళ వృద్ధి మాత్రమే జరిగింది. వీటిని చూపి రాష్ట్రం మొత్తం అభివృద్ధిని సాధిస్తూందనే భ్రమలను కల్పిస్తున్నారు.

వాస్తవంగా రాష్ట్ర వృద్ధిరేటు 1994-95 నుండి 2001-02 మధ్యన 5.5 శాతం వుండి జాతీయ వృద్ధిరేటు 6.2 శాతం కంటే తక్కువగా వుంది. వ్యవసాయ వృద్ధిరేటు 1 శాతం కంటే తక్కువ. పారిశ్రామిక వృద్ధిరేటు 2.2 శాతానికి తగ్గిపోయినాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రతిపాదనలలో 29.32% మాత్రమే వుండి, ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించి 7 లక్షలకుపైగా కార్మికులను వీధిలో పడవేసి, ప్రైవేటు, కార్పొరేటు రంగానికి అన్ని రంగాలలో పెద్దపీటవేసి, సామాజిక రంగంలో వ్యయాన్ని తగ్గించి, విద్య, వైద్యరంగాల్లో పెద్దఎత్తున కార్పొరేటీకరణను ప్రోత్సహించి, రుణభారాన్ని రూ.57,141 కోట్లకు పెంచి, బాల కార్మికతలో మొదటిస్థానం మరియు అక్షరాస్యతలో 27వ స్థానంలోవుండి, స్త్రీల పౌష్టికాహార లోపం అత్యధికంగా వుండి రాష్ట్రంలో ఒక ఆర్థిక స్తబ్దత, సంక్షోభం ఏర్పడివుంటే అభివృద్ధిని వేగంగా సాధిస్తుందని ఎలా చెప్పగలము.

యీ సంక్షోభం ఫలితంగా వందలాది రైతులు, చేతివృత్తుల వారు, ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, లక్షలాది ప్రజలు బ్రతుకు దెరువు కోసం తమ నివాసాలను వదలి వలసవెళ్ళిపోతుంటే, అనేక కుటుంబాలు దారిద్ర్యం వల్ల తమ శిశువులను రెండు, మూడువందల రూపాయలకమ్ముకుంటుంటే, ఎంతోమంది స్త్రీలు వేశ్యావృత్తిలోకి నెట్టబడుతుంటే, ప్రభుత్వంలో ప్రతిచోటా అవినీతి వీరతాండవం చేస్తుంటే, విచ్చలవిడి వాతావరణంలో రోజుకొక బ్యాంకు, చిట్‌ఫండ్, ఫైనాన్స్ కంపెనీలు మూసివేయబడి సామాన్యులు డబ్బులు కోల్పోయి రోదిస్తుంటే, మద్యం ఏరులైపారి కల్తీమద్యంతో జనం ప్రాణాలు కోల్పోతుంటే, బి.సి., యస్.సి. యస్.టి.లు తమ జీవనాధారాలైన వృత్తులనుకోల్పోతూ, వారితోపాటు స్త్రీలూ ప్రైవేటీకరణ వల్ల చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశాలను కోల్పోతుంటే, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు తమ హక్కులు కోల్పోయి దిక్కులేనివారుగా మారుతుంటే, కరువులో ఆదుకోవాలని కొందరు గంజి కేంద్రాలను తెరిస్తే జనం బారులు తీరుతుంటే, బిచ్చగాళ్ళ సంఖ్య పెరిగిపోతూ బిచ్చగాళ్ళ రాజ్యంగా మారుతుంటే మనం అభివృద్ధిపథంలో ప్రయాణిస్తున్నామని చెప్పగలమా? యీ దిక్కుమాలిన అభివృద్ధి మనకొద్దు బాబూ! యీ సంస్కరణలు, యీ విధానాలు, యీ స్వర్ణాంధ్రప్రదేశ్, యీ మోడల్ రాష్ట్రం మనకొద్దే వద్దు. దీపాన్ని అందుకోవడానికి పరుగుతేసే దీపం పురుగుల్లాగ కూలిపోవడం మనకు అసలే వద్దు. యీ విధానాలు మారాలి, యీ అభివృద్ధితీరు మారాలి. ప్రజలందరూ ప్రాణాలతో వుండి, చేయడానికి పని, త్రాగడానికి నీరు, తినడానికి తిండి, వుండడానికి ఇల్లు, రోగాలొస్తే ప్రభుత్వాసుపత్రిలో మంచివైద్యం, పిల్లలందరూ చదువుకోవడానికి మంచి ప్రభుత్వ బడులూ ఏర్పరచే విధానాలు కావాలి.

ముగింపు

12వ ఆర్థికసంఘం మనరాష్ట్రంలోని యీ వాస్తవిక పరిస్థితిని, యీ వెనుకబాటుతనాన్ని, ఆర్థిక స్తంభనను గుర్తించి ఎక్కువ వనరులు కేటాయింపులు చేసి, రుణభారాన్ని రద్దుచేసి ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యాల్ని నిర్మూలించడానికి, ప్రగతిని సాధించడానికి తోడ్పడాలని ఆశిద్దాం.

'చైనాలోనే కమ్యూనిజం లేదు' ముఖ్యమంత్రి

- ఉందని ఎవరైనా అన్నారా?

'ప్రశ్నలకు జవాబివ్వని ప్రధాని' -సోమనాథ్ ఛటర్జీ (విశ్వాసరాహిత్య తీర్మానం సందర్భంలో)

- జవాబులుంటేగా?

'ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచిన కాంగ్రెస్'-అద్వానీ

- బలహీనపరచడానికి కాంగ్రెస్‌కు ఏమైనా మిగిలితేగా. తమరు గుజరాత్‌లో ఏడు నిలువుల లోతున పాతేశారుగా దాన్ని

'కేంద్ర రుణాలపై వడ్డీ మాఫీచేయాలి' యనమల

- పనిలోపని ప్రపంచ బ్యాంకును కూడా అడగండి

'ప్రగతిశీల సంస్కరణలు అమలుచేస్తున్న రాష్ట్రాలకు 11వ ఆర్థిక సంఘం అన్యాయం చేసింది' - యనమల

- అవునవును ఎంత ప్రగతి సాధించామో. ఆత్మహత్యలు ఆకలిచావులు, కిడ్నీ అమ్మకాలు, కరువుకాటకాలు, శిశుమరణాలు, రోగాలు, అప్పులమీద అప్పులు

'ఈ పాపం ప్రభుత్వానిదే' - చీప్ లిక్కర్ మరణాలపై ఓ పత్రిక సంపాదకీయం'

- కొంతమంది చస్తేనేగాని కొన్ని పాపాలు కనపడవు కాబోలు

'దళితులకు భూములు ఇవ్వాలన్నదే ప్రభుత్వోద్దేశం ఎప్పుడు ఇవ్వాలో మాకు తెలుసు, మీరు చెప్పనక్కర్లేదు' - కాంగ్రెస్‌కు చంద్రబాబు జవాబు

- ఎన్నికలప్పుడు ఇస్తారని మాకు తెలుసు ముఖ్యమంత్రి చెప్పనక్కర్లేదు.

'అవినీతి అధికారులపై ముఖ్యమంత్రి ధ్వజం'

- ధ్వజం ఎత్తనిదెపుడు? చర్యలు తీసుకొన్నదెపుడు?

"కోటి లబ్దిదారుల ఎంపిక బాధ్యత 'దేశానిదే' - చంద్రబాబు

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెలుగుదేశం చేశారా?

"మనదేశం విదేశీ రుణభారం 104.2 బిలియన్ డాలర్లు-రిజర్వు బ్యాంకు సంస్కరణలు 1991లో ప్రవేశపెట్టినపుడు ఈ భారం 90 బిలియన్ డాలర్లు.

- అప్పటికీ ఇప్పటికీ రాజకీయనేతల బ్యాంకు అకౌంట్లతో సహా ఆస్తుల కుప్పలు ఎంత బలిసిపోయాయో!

"పరిపాలనా వ్యవస్థలో సంస్కరణలు తీసుకొనిరావాలి" చంద్రబాబు

- మీలాగే వన్-మాన్ షో లాగా?

"దేశంలో సుమారుగా సగంమంది 19 సంవత్సరాల లోపు వయస్సుగలవారే" బిజినెస్ లైన్

- ఈ యువకులంతా వాళ్ళ పెద్దలు చేసిన అప్పులు, వడ్డీలు తీర్చటంలోనే వాళ్ళ బతుకు తెల్లారిపోతుంది

"నన్ను కొనగలవారెవరూ లేరు" - ఫెర్నాండెజ్

- తమర్ని అమ్మాలన్నా, వుంచుకోవాలన్నా బి.జె.పి. వారివే కదా సర్వహక్కులు. ఎవరుమాత్రం ఎలా కొంటారు? ❍

ఆంధ్రప్రదేశ్ అప్పుల కుప్ప - 2

(గత సంచిక తరువాయి)

ఈ రుణాలు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు షరతులు షరా మామూలే. సబ్సిడీలు తగ్గించాలి, యూజర్ ఛార్జీలు వసూలు చేయాలి, ప్రైవేటీకరించాలి, ఇటు సూర్యుడు అటు పొడిచినా వడ్డీలు మాత్రం నిక్కచ్చిగా చెల్లించాలి. ప్రతి విషయంలో, మార్పులో మా ఆమోదం పొందాలి. ఇవన్నీ మన సార్వభౌమత్వాన్ని సవాల్‌చేసే షరతులు. మన పరిపాలనలో చీటికీ మాటికీ వేలు పెట్టడానికి మన విధానాలను ప్రభావితం చేయడానికి, ఆ బ్యాంకుకు అడుగులకు మడుగులొత్తడానికి దారితీసే షరతులివి.

అయితే, విదేశీ రుణాలు ఎట్టి పరిస్థితులలో తీసుకోకూడదని ఎవరూ అనరు. అభివృద్ధి చెందుతూన్న దేశాలు రుణం చేయాల్సిన అవసరం పడుతూంది. కాని ఆ రుణానికి షరతులుండరాదు. ఆ రుణం తిరిగి చెల్లించగలగడానికి వీలుగా రుణం మొత్తాన్ని ఉత్పాదకతా రంగాల్లో అందులోనూ మనకు కావాల్సిన రంగాల్లో పెట్టుబడి పెట్టుకోగలగాలి. అలా చేసినపుడు మన రాష్ట్రాన్ని మనకవసరమైన రీతిలో అభివృద్ధి చేసుకోవచ్చు. ఏయే కార్యక్రమాలకు ఈ రుణాలు ప్రస్తుతం ప్రభుత్వం వినియోగిస్తుందో చూస్తే, కార్యక్రమాలను మనకు మనమే అమలు చేసుకోగలుగుతామని తెలుస్తుంది. అయితే ఒక్క షరతు. మనసుంటే మార్గముంటుంది. పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ఉదాహరణకు హైటెక్ సిటీ నిర్మాణానికి ఖర్చుచేసిన నిధులను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తరలిస్తే, అప్పు చేయాల్సిన పనే వుండదు. వ్యవసాయాభివృద్ధిపై కేంద్రీకరిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు పరిష్కారమవుతాయి, మరిన్ని నిధులూ లభ్యమవుతాయి. ఖర్చు తగ్గించుకోవాలని ప్రభుత్వమూ అంటుంది. ప్రణాళిక సంఘమూ చెబుతుంది. ఆర్థిక శాస్త్రవేత్తలు సలహా ఇస్తున్నారు. అభివృద్ధేతర, ప్రణాళికేతర ఖర్చులను తగ్గించుకోవటం నిధుల సంపాదనకు మరో మార్గం. వ్యవసాయ ప్రాసెసింగ్ పరిశ్రమ మీద కేంద్రీకరిస్తే ఇటు రాష్ట్ర ఆదాయం, అటు గ్రామీణుల ఆదాయాలు పెరుగుతాయి. ఎగుమతులు పెంచుకోవటం మరో మార్గం. ఇన్ని అవకాశాలను వినియోగించుకోకుండా, అప్పుచేసి పప్పుకూడు తినటం బాధ్యతారాహిత్యం తప్ప మరొకటి కాదు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన మొదటి 25 సంవత్సరాల్లో భారీ నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించుకొన్నాం, పారిశ్రామికీకరణ చేసి దేశం లోనే అగ్రస్థానంలోవున్న మొదటి నాలుగైదు రాష్ట్రాల సరసన స్థానం సంపాదించుకొన్నాం. నూటికినూరుగ్రామాలు విద్యుదీకరించుకొన్నాం. 14 విశ్వవిద్యాలయాలు ఏర్పాటు, వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం-ఇవన్నీ విదేశీరుణం లేకుండానే సాధించుకొన్నాం. ఇపుడూ సాధించుకోగలం. If there is a will, there is a way.

(అయిపోయింది)

"ప్రజాస్వామ్యంలో కావలసింది పనిచేసే వ్యవస్థలు, అందులో ముఖ్యమైనది ప్రజాభిప్రాయానికి ప్రతీక అయిన పార్లమెంటు, దానిమీద ప్రధానికో, అధ్యక్షునికో, ప్రభుత్వాధికారులకో, సైన్యానికో పెత్తనం ఉంటే అది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే అవకాశంలేదు. చట్టం దృష్టిలో అందరూ సమానులే అని నిరూపించే న్యాయవ్యవస్థ మరో ముఖ్యావసరం. చక్కగా పనిచేసే రాజకీయ పక్షాలు, ఎన్నికలు తప్పనిసరి. స్వేచ్ఛగా నిష్పాక్షికంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వాల, కార్పొరేట్ వర్గాల ఒత్తిడికి తలఒగ్గని ప్రసార సాధనాల పాత్ర కీలకం. ప్రభుత్వ కార్యకలాపాల మీద నిఘావేసే పౌరసమాజం, అభివృద్ధికి చోదక శక్తులుగా ఉపయోగపడే బృందాలు, రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యానికి ప్రత్యామ్నాయ అవకాశాలు. ప్రజాస్వామ్య విజయం వీటన్నింటి మీద ఆధారపడి వుంటుంది. వ్యక్తులు ప్రజాస్వామ్య విలువలను, మానవ హక్కులను గౌరవిస్తూ ప్రభుత్వాల నిరంకుశ పోకడలను, నాయకుల ప్రజాకర్షక గారడీలకు అడ్డుకట్టవేసే శక్తులుగా ఉపయోగపడాలి. ఎందుకంటే రాజకీయ నాయకులలో కొందరు జాతి తదితర సంకుచిత అంశాల ప్రాతిపదికగా ప్రజలను రెచ్చగొట్టి లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తుంటారు. అలాంటివారిని అడ్డుకోవాలి"

– యు.యన్.డి.పి. నివేదిక

"అప్రజాస్వామిక ప్రభుత్వ విధానాలను తప్పుబట్టకుండా ప్రజాస్వామికహక్కులను పరిరక్షించుకునే సమ్మెహక్కును నిషేధించడం అన్యాయం. ప్రపంచీకరణ, సరళీకరణలు వేగంగా అమలవుతున్న నేపథ్యంలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులకు బాసటగా నిలవాల్సిన న్యాయమూర్తులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణం"

– సి.పి.ఐ.(ఎం-ఎల్) పీపుల్స్‌వార్ రాష్ట్రకమిటీ ప్రతినిధి చంద్రన్న

"పరిస్థితుల్ని అంతకుఅంత దిగజార్చి త్రాగునీరు లభ్యంకాని గ్రామాలకు సైతం మద్యాన్ని పదిలంగా చేర్చి, ప్రజల ఆరోగ్యంతో, ప్రాణాలతో చెలగాటమాడుతున్న నేరంలో రాష్ట్ర ప్రభుత్వమే తొలి ముద్దాయి... కాలే కడుపులపై బడుగుల బతుకులపై మద్యం మత్తును చిలకరించి లిక్కరు రక్కసులతో కలిసి ప్రభుత్వం క్రూర పరిహాస మాడుతుంది"

– ఈనాడు ఎడిటోరియల్

"మానవత్వమే సిగ్గుతో తలవంచుకునేలా ఘోర అకృత్యాలకు అంకురార్పణ చేసిన నరేంద్ర మోడి లాంటివారు మరెవరూ ఉండరు"

– బ్రిటన్‌లో దక్షిణాసియా సౌభ్రాతృత్వ సంఘానికి చెందిన ఆవాజ్, ఇండియన్ ముస్లిం కరపత్రం

"గోదావరి పుష్కరాలకు 172 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం వాటిని ఎక్కడ ఎట్లా ఖర్చుపెట్టారో వెల్లడించాలి"

– తెలంగాణా రాష్ట్ర సమితి నేత చంద్రశేఖరరావు

"ఇపుడు భాజపా, దాని అనుబంధసంస్థలు కలిసి యువతరాన్ని పక్కదోవ పట్టిస్తున్నాయి. మతాన్ని కులాన్ని రెచ్చగొడుతున్నాయి. ఆ విషాన్ని విద్యావ్యవస్థలోకి చొప్పిస్తున్నాయి"

– కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షురాలు సోనియాగాంధీ

"ప్రభుత్వోద్యోగులకు ఎలాంటి సమ్మెహక్కు లేదని పేర్కొనడం ఎమర్జెన్సీ కాలానికి సరితూగుతుంది"

– అటార్నీ జనరల్ సోలీ సొరాబ్జీ

"అవిశ్వాస తీర్మానం గతంలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, ప్రభుత్వరంగ సంస్థల చౌకబేరం సమయంలో పెట్టాల్సింది. ప్రస్తుత తీర్మానం ప్రతిపక్షాల రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నది"

– మాజీ ప్రధాని చంద్రశేఖర్

"ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైనవి ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వాల జవాబుదారీతనం"

– ఇంటర్ పార్లమెంటరీ యూనియన్

"హైదరాబాద్ సహా దేశంలోని అహ్మదాబాద్, బెంగుళూరు, చెన్నై, కాన్పూర్, లక్నో, సోలాపూర్ లాంటి మేటి నగరాల్లో వాహన కాలుష్యం ఆందోళనకర స్థాయికి చేరుకుంది"

– సుప్రీంకోర్టు

"దేశంలోని ఏడు ప్రధాననగరాల్లో (హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగుళూరు, చెన్నై, కాన్పూర్, లక్నో, సోలాపూర్) వాతావరణంలో హానికర రెసిడ్యువరీ సస్పెండ్ పార్టికల్ మేటర్ ఎక్కువగా వుంది"

– కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి

"మహిళలపై అపరిమితంగా పెరిగిపోతున్న నేరాలు దేశ సంస్కృతికి, ప్రభుత్వ పాలనకు గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్నాయి"

– సుప్రీంకోర్టు జస్టిస్ దొరైస్వామిరాజు

"సమ్మెనిషేధం ప్రభుత్వాన్ని అధిపతిగా, కార్మికులను బానిసలుగా మారుస్తుంది"

– వాయలార్ రవి

"పెప్సీ కోకాకోలా కంపెనీల శీతలపానీయాలన్నిటినీ నిషేధిస్తాం అవసరమైన లాంఛనాల అనంతరం చర్యలు చేపడతాం"

– బీహార్ ఆరోగ్యశాఖామంత్రి శకునిచౌదరి

"ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద కేంద్రం అమలు చేస్తున్న గృహనిర్మాణ కార్యక్రమానికి కేటాయించిననిధులలో 2002-03 నాటికి 93 కోట్ల 79 లక్షల 01 వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయింది"

– కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి అన్నాసాహెబ్ ఎం.కె. పాటిల్

"**ఆంధ్రప్రదేశ్‌లో** మంచినీటి సరఫరా విధానంలో అనేక లోపాలున్నాయి. పారిశుధ్య, సరఫరా వసతులు అధ్వాన్నంగా ఉన్నాయి. వాటికి సంబంధించిన కేంద్రపథకాలు చాలా మందకొడిగా అమలవుతున్నాయి"

– కేంద్ర మంచినీటిసరఫరా సీనియర్ కార్యదర్శి పి. మోహన్‌దాస్

"**కెల్లీ** హత్యోదంతంలో బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ పట్ల బ్రిటన్ జనాభాలో సగం మందికిపైగా నమ్మకం పోయింది"

– యూ గోవ్ సర్వే నివేదిక

"**పాలస్తీనా** ప్రజల పట్ల పాశవికంగా వ్యవహరిస్తున్న షరాన్‌ను మనదేశానికి ఆహ్వానించాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం తీవ్ర అవమానకరం"

– నాలుగు వామపక్షాలు, సమాజ్‌వాది, ఆర్.జె.డి., జనతాదళ్(ఎస్)

"**గ్లోబలైజేషన్ల** ప్రభావం వల్ల 2020 నాటికి ఆహారోత్పత్తి ఇంతకుముందు శాస్త్రవేత్తలు అంచనావేసిన దానికన్నా చాలా తక్కువ ఉంటుంది. ఇది ఆహార సంక్షోభానికి దారితీస్తుంది"

– డైరెక్టరేట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్, హైదరాబాద్

"**తమిళనాడులో** శ్రామిక సంబంధాలు పునరుద్ధరించాలి. కార్మిక సంఘాల హక్కులను భారత ప్రభుత్వం విస్పష్టంగా తెలియచేయాలి."

– అంతర్జాతీయ కార్మిక సంస్థ

"**అసంఖ్యాక** జనంత్యాగాలుచేసి, లాఠీదెబ్బలుతిని సాధించుకున్న మద్యనిషేధాన్ని ఈ ప్రభుత్వం నీరుగార్చింది. చంద్రబాబు ఆంధ్ర శకుని"

– మల్లాది సుబ్బమ్మ

"**తప్పుచేసిన** న్యాయమూర్తులను శిక్షించడానికి సరైన న్యాయవ్యవస్థ ఉండాలి. కొందరు జడ్జీలు, న్యాయమూర్తులపై వస్తున్న అవినీతి ఆరోపణలను విచారించడానికి ప్రత్యేక యంత్రాంగం ఉండాలి...వివాహేతర సంబంధాల విషయంలో భర్తను ప్రాసిక్యూట్ చేసే వీలు భార్యకు లేకుండా సిఫార్సులు చేయడం అన్యాయం"

– సోలి సోరాబ్జి

"**రాజకీయ నాయకుల్లో,** పోలీసు శాఖల్లో ప్రభుత్వ అధికారుల్లో అవినీతి గతంకంటే ఎక్కువైంది"

– తెలుగుదేశం పార్టీ సర్వే వెల్లడి

"**చాలా** అరుదుగానే, చివరి అస్త్రంగానే ఆర్టికల్ 356ను ప్రయోగించాలి"

– అంతర్ రాష్ట్ర మండలి సమావేశం

"**నల్లగొండ జిల్లాలో** వడదెబ్బ బారినపడిన పేదలకు సకాలంలో వైద్యసహాయం అందకపోవడం వల్లే అత్యధిక మరణాలు సంభవించాయి"

– ప్రభుత్వ వడగాల్పుల నిపుణుల కమిటి నివేదిక

"**అలహాబాద్** హైకోర్టు ఆదేశాల మేరకు అయోధ్యలో వివాదాస్పద ప్రాంతంలో తవ్వకాలు జరిపిన భారత పురావస్తుశాఖ పూర్తిగా తప్పుడు, మోసపూరిత విశ్లేషణతో కూడిన నివేదికను తయారుచేసింది"

– అలీఘర్ ముస్లిం యూనివర్సిటి మాజీ ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్

"**దేశంలో** అత్యవసర వైద్యరక్షణవ్యవస్థ ఉత్తమస్థాయిలోలేదు"

– జాతీయ మానవ హక్కుల సంస్థ

"**జార్జ్ బుష్** అధ్యక్షుడైన తర్వాత ఒక్క ప్రైవేటు రంగంలోనే 32 లక్షల ఉద్యోగాల్లో కోతపడింది. నిరుద్యోగులు, ఉద్యోగులు కోల్పోయినవారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు"

– బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్

"**బాలలు** మన అమూల్య ఆస్తి, సమాజం అభివృద్ధి చెందుతుంటే విద్య తదితర అన్ని విషయాల్లో ఆడ మగ పిల్లలకు సమాన హక్కులు కల్పించాలి... ఉన్నత స్థానాల్లో, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు ధర్మబద్ధంగా వ్యవహరించాలి. వారే అధర్మానికి పాల్పడితే ధర్మం వినాశనంగా మారుతుంది. ధర్మానికి దూరమైన వారు ఎవరైనా...వారు వ్యక్తులైనా...రాష్ట్రాలైనా... తమ చర్యలకు తామే బాధ్యత వహించాలి......భావితరాలు మనల్ని గుర్తుంచు కోవాలంటే మనం కొత్తగా ఎన్ని చర్చీలను, ఎన్ని మసీదులను, ఎన్ని ఆలయాలను, ఎన్ని గురుద్వారాలు కట్టామన్నది కొలమానంగా కానేకాదు. ఆర్థిక సౌభాగ్యంతో కూడిన సురక్షిత సుసంపన్న భారత దేశాన్ని అందించడమే ముఖ్యం"

– ఎ.పి.జె. అబ్దుల్ కలాం (భారత రాష్ట్రపతి)

"**స్వాతంత్ర్యానంతర** భారతదేశ చరిత్రలో అధికారపక్షాల అలక్ష్యాన్ని ఎండకట్టడంలో విపక్షాలు ఘోరంగా విఫలమయ్యాయి"

– అమర్త్యసేన్

"**ప్రజాస్వామ్యం** అంటే కేవలం ఎన్నికలు కాదు. ప్రజల వివేకమే ప్రజాస్వామ్యంలో కీలకమవుతుంది. ప్రభుత్వ విధానాలను, ప్రాథమ్యాలను నిర్ణయించడంలో, మార్చడంలో తద్వారా నిలకడైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడంలో పౌరులుచూపేచొరవే కీలకం"

– అమర్త్యసేన్

"**ప్రజాస్వామ్య** వ్యవస్థకు అత్యంత కీలకమైనవి ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వాల జవాబుదారీతనం"

– ఇంటర్ పార్లమెంటరీ యూనియన్

అసలు సమస్యలు విడిచి పౌరసత్వం మీద సాము!

— వి. గోపాల్

ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సమస్యల నుంచి దృష్టిని తప్పించడానికి భారత పార్లమెంటరీ రాజకీయవాదులకు లెక్కలేనన్ని ఎత్తుగడలున్నాయి. పేదరికం, నిరుద్యోగం, అవిద్య, అనారోగ్యం, అసమానత వంటి అసలు సమస్యల గురించీ, వాటి పరిష్కారాల గురించీ ప్రజలు ఆలోచించకుండా చేయడానికి ఎన్నెన్ని సమస్యలు కాని వాటిని ఈ రాజకీయ నాయకులు సమస్యలుగా మారుస్తున్నారో చూస్తే మన పాలకవర్గాల "సృజనాత్మకత" ఆశ్చర్యం కలిగిస్తుంది.

సమస్యలుకాని అంశాలను సమస్యలుగా చిత్రించే పనిని విజయవంతంగా చేసేవి ఎన్నికలు. ఎప్పుడో ఒకసారి ఎన్నికల్లో కూడ నిజమైన సమస్యలు ప్రస్తావనకు రావచ్చుగాని అప్పుడు అవి నిస్సారం చేయబడి, వక్రీకరించబడి, చిత్తశుద్ధిలేని నినాదాలుగా ప్రజల ముందుకు వస్తాయి.

రానున్న పార్లమెంటరీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో, జరిగేటప్పటికి మరెన్ని కుహనా చర్చలకు దారితీస్తాయో గాని ఇప్పటి కప్పుడే, ఎన్నికల ప్రకటన ఇంకా రాకముందే మూడు కుహనాచర్చలు ప్రారంభమయ్యాయి. ఈ కుహనా చర్చలను విరివిగా జరపడంలో అన్ని రాజకీయ పార్టీలకూ వాటి వాటి ప్రయోజనాలున్నాయి. మన మధ్యతరగతి బుద్ధిజీవులకైతే ఈ పైపై కుహనాచర్చలే జీవనాధారం. పడక కుర్చీల్లో పడుకుని ఈ లేని కోడిగుడ్ల మీద వెంట్రుకలు వెతకడం మన మధ్యతరగతి బుద్ధిజీవులకు ఇష్టమైన వ్యాపకం.

అయినా ఈ కుహనా చర్చలను కూడా వాటి పైపై విషయాలను పక్కనపెట్టి అంతస్సారాన్ని పరిశీలించవలసివుంది. ఆ చర్చల్లో మౌలికమైన ప్రశ్నలు వేయవలసివుంది. ఆ చర్చల్లో కూడా ప్రజలు ఎట్లా జోక్యం చేసుకోవచ్చునో, ప్రజలు ఆ చర్చలను ఎట్లా ధ్వంసం చేసి, కొత్త చర్చలు నిర్మించవచ్చునో ఆలోచించవలసి వుంది.

ప్రస్తుత ఎన్నికల గురించిన చర్చల్లో ఆలోచించవలసిన మూడు కుహనా చర్చలు సోనియాగాంధీ పౌరసత్వం గురించి, ఎన్నికల వ్యయం గురించి, ఎన్నికల సమయం గురించి జరుగుతున్నాయి.

సోనియాగాంధీ ఇటలీలో పుట్టినందువల్ల రాజీవ్‌గాంధీతో పెళ్ళయిన తర్వాత చాలా సంవత్సరాల వరకూ ఇటాలియన్ పౌరసత్వం వదులుకోనందువల్ల ఆమె విదేశీయురాలని, అందువల్ల ఆమె ప్రధాని కావడానికి వీలులేదని చాలా రాజకీయ పక్షాలు వాదిస్తున్నాయి. ఈవాదనలను మౌలికంగా ప్రశ్నించవలసివుంది.

సోనియాగాంధీ భారత ప్రధాని పదవికి అర్హురాలవునా కాదా అనేది వేరే చర్చ. ఆ చర్చకన్నా ఎక్కువగా ఆమె పుట్టుక గురించీ, పౌరసత్వం గురించీ చర్చ జరుగుతోంది. చాల విచిత్రంగా ఆమె ప్రధానమంత్రిత్వాన్ని "విదేశీ" కారణంతో వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలన్నీ గత పది సంవత్సరాలుగా రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ "విదేశీ" అనుకూల రాజకీయార్థిక విధానాలనే అమలుచేస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు, బహుళజాతి సంస్థలకు అనుకూలమైన పథకాలనే ప్రకటిస్తున్నాయి. దేశాన్నీ, రాష్ట్రాలనూ విదేశాలకు తాకట్టుపెట్టడానికి వీసమెత్తు కూడా సంకోచించడంలేదు. ప్రజాజీవనాన్ని తాకట్టు పెట్టడంలో అగ్రభాగాన ఉన్నవాళ్ళు 'విదేశీ' వనిత ప్రధానమంత్రి కాగూడదని ఇంత పెద్దఎత్తున ఎందుకు వాదిస్తున్నారో తెలియదు.

ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, సోనియాగాంధీని 'విదేశీ' వనిత పేరుతో వ్యతిరేకిస్తున్న భారతీయ జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీలనే చూద్దాం. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ఎన్రాన్ ఒప్పందాన్ని రద్దుచేస్తామనే పేరుతో పోటీచేసిన భారతీయ జనతాపార్టీ–శివసేన కూటమి అధికారంలోకి రాగానే మరింత ప్రమాదకరంగా ఎన్రాన్ ఒప్పందాన్నికొనసాగించి అమెరికన్ బహుళజాతిసంస్థ ప్రయోజనాలు నెరవేర్చింది. ఎన్నో సంవత్సరాలుగా స్వదేశీ నినాదాన్నిస్తూ, ఎన్నికల ముందు మరీ ఎక్కువగా స్వదేశీ ఆర్థిక విధానం గురించి మాట్లాడిన భారతీయ జనతాపార్టీ కేంద్రప్రభుత్వం అధికారం చేపట్టగానే 'స్వదేశీ వాదనకు తిలోదకాలొదిలింది. సంఘ పరివార్‌లో ఒకముక్క స్వదేశీ జాగరణ్‌మంచ్ ప్రపంచవాణిజ్యసంస్థనుంచి భారతదేశంవైదొలగాలని వాదిస్తుండగానే, బి.జె.పి. ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థతో, ప్రపంచ బ్యాంకుతో, ఐ.ఎం.ఎఫ్.తో పీటముడి వేసుకుంది. చివరికి, ప్రపంచ వాణిజ్య సంస్థ ఇంకో మూడేళ్ళలో చేయమని చెప్పిన పనులని ఈ సంవత్సరమే చేసేసి ప్రభువును మించిన ప్రభుభక్తిని నిరూపించుకుంది. భారత ప్రజల ప్రయోజనాలనూ, తన సొంత రాజకీయ, తాత్విక అభిప్రాయాలనూ విదేశీ గుత్త సంస్థలకు ఇంతలా తాకట్టుపెట్టిన భారతీయజనతాపార్టీకి ప్రశ్నించే అర్హత ఎక్కడ వుంది?

తెలుగుదేశం పార్టీ కూడా సోనియా విదేశీ వనిత గనుక భారత ప్రధాని పదవికి పనికిరాదనే వాదన మొదలుపెట్టింది. గత నాలుగు సంవత్సరాలలో ఈ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రాలలో, బడ్జెట్‌లలో, ఎన్నో అధికార పత్రాలలో ప్రపంచ బ్యాంకును, విదేశీ పెట్టుబడులను పొగడడం జరిగిందని అందరికీ తెలుసు. ప్రపంచంలోనే తొలిసారిగా ప్రపంచబ్యాంకు ఒకరాష్ట్రంతో లావాదేవీలు నడిపి, ఆ రాష్ట్ర ఆర్థిక విధానాలు, పాలనావిధానాలు ఎలా సాగాలో రహస్య ఆదేశాల నివేదిక ప్రకటించడం ఆంధ్రప్రదేశ్‌విషయంలోనే జరిగింది. చివరికి రానున్న రెండు దశాబ్దాలలో రాష్ట్రం ఏ దిశన సాగాలో సూచించే పత్రాన్ని ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడిచే విదేశీ సంస్థ తయారుచేసింది. మన వనరులను మనం ఎట్లా వాడుకోవాలో, మన ఆర్థిక, రాజకీయ, పరిపాలనా విధానాలు ఎట్లా ఉండాలో చెప్పే అధికారాన్ని పూర్తిగా విదేశీసంస్థలచేతుల్లో పెట్టిన తెలుగుదేశం ప్రభుత్వం, ప్రభుత్వాధికారం విదేశీ వనిత చేతికి చేరగూడదనడం కన్నా హస్యాస్పదమైన విషయం మరొకటుంటుందా?

సోనియాగాంధీకి ఈదేశ ప్రధానిఅయ్యే అర్హతఉందనికాదు. ఆమె భర్త ఇప్పుడు కొనసాగుతున్న నూతన ఆర్థికవిధానాలకు పునాదివేసి ఈ దేశ ప్రజల దారిద్ర్యానికి, దేశ ప్రయోజనాలు విదేశీ పెట్టుబడిదారుల లాభాల రథచక్రాలకు కట్టివేయడానికి కారకుడు. ఆయన దేశరక్షణ విషయాలలోకూడా కమిషన్లకు, ముడుపులకు ఆశపడి స్విస్ బ్యాంకు ఖాతాలో కోట్లు దాచుకున్నాడన్న ఆరోపణలను ఎదుర్కొన్నవాడు. ఆయన భార్యగా, తన బంధువుల ద్వారా బోఫోర్స్ కుంభకోణాన్ని నడిపిన వ్యక్తిగా ఆరోపణలున్న సోనియాగాంధీ దేశీ, విదేశీ సంపన్నుల ప్రయోజనాలు కాపాడడానికే ఢిల్లీ గద్దె ఎక్కదలుచుకున్నది తప్ప ఈ దేశ సాధారణ ప్రజలకు మేలుచేసేందుకు కాదు. ఇవాళ ఆమెను విదేశీ అంటున్నవాళ్ళు కూడా ఆ తానులో ముక్కలే గనుక అసలుసమస్యలు లేవనెత్తకుండా, మసిపూసి మారేడుకాయచేస్తున్నారు.

రెండో చర్చ ఎన్నికల వ్యయం గురించి జరుగుతున్నది. ఎన్నికలంటే కోట్లాది రూపాయల ప్రజాధనం వ్యర్థమవుతుంది కనుక మరోసారి ఎన్నికలు రాకూడదని కొన్ని రాజకీయ పార్టీలు, పేరున్న పత్రికలూ, మేధావి వర్గాలూ పెద్దఎత్తున వాదిస్తున్నాయి. ఎన్నికల వ్యయం 1980లో 37 కోట్ల రూపాయలుండేదని, 1998లో అది 664 కోట్ల రూపాయలైందని, ఈసారి ఎన్నికల్లో వ్యయం వెయ్యికోట్ల రూపాయలుకావచ్చునని ప్రకటిస్తున్నారు. ఇంతవ్యయాన్ని ప్రజలమీద అనవసరంగా రుద్దుతున్నారని అంటున్నారు.

ఈవాదనలు వింటుంటే, ఈ వాదనచేస్తున్నవాళ్ళ అమాయకత్వం గురించి జాలివేస్తుంది. ప్రజాధనంలో ఒక్కపైసాకూడా వ్యర్థం కానట్టు, ఇప్పుడు ఈ వెయ్యికోట్ల రూపాయల వ్యయం మాత్రమే వ్యర్థమవుతున్నట్లు వీళ్ళు మాట్లాడుతున్నారు. నిజానికి సుస్థిర ప్రభుత్వమంటూ ఏర్పడితే మంత్రులూ, అధికారులూ సక్రమంగానూ, అక్రమంగానూ వెనకేసుకునే వందల, వేలకోట్ల రూపాయల్లో ఈ ఎన్నికల వ్యయం పదోవంతు కూడా కాదు. ఈ దేశంలోనుంచి బహుళజాతి సంస్థలు కొల్లగొట్టుకుపోతున్న మనశ్రమసంపదలో ఈ వెయ్యికోట్లరూపాయలు సముద్రంలో కాకిరెట్ట. రక్షణ వ్యయం పేరుతో ఈ దేశ పాలకవర్గాలు సైన్యంమీద, పోలీసుల మీద పెడుతున్న ఖర్చులో, ఆ ఖర్చులోంచి సంపాదిస్తున్న ముడుపుల్లో ఈ వెయ్యికోట్లు ఏ మూలకని? 1980 నుంచి ఇప్పటివరకూ పాకిస్తాన్ గూఢచార చర్యల్ని అరికట్టడానికనే పేరుమీద భారతప్రభుత్వం పెట్టినఖర్చు 64,500 కోట్లరూపాయలు. ఇందులో ఎంత "సద్వినియోగమ"యిందో అందరికీతెలుసు. అందులో ఎన్నికల వ్యయం అరవైనాలుగో వంతు మాత్రమే.

మధ్యతరగతికీ, పత్రికలకూ, మేధావులకూ ఉండే చాలా విచిత్రమైన అలవాట్లలో ఒకటి ఏనుగుల్ని వదిలేయడం, దోమల్ని పట్టుకొని ఆత్మసంతృప్తి చెందడం. అందువల్లనే ఎన్నికల వ్యయం వెయ్యికోట్ల రూపాయల గురించి ఇంతగా చర్చించేవాళ్ళు, అసలు భారత ఆర్థిక వ్యవస్థలో లక్షలకోట్లరూపాయలు ఎట్లా దుర్వినియోగమవుతున్నాయో ఆలోచించరు. ప్రజాసంక్షేమానికి ఉపయోగపడవలసిన వేలాది కోట్ల రూపాయలు ఎట్లా అగ్రనాయకుల స్విస్ ఖాతాలకు చేరుతున్నాయో పట్టించుకోరు.

ఇక ఎన్నికలు ఎప్పుడుజరపాలనే చర్చ రాజ్యాంగ నిబంధనలను, సాంప్రదాయాలను పక్కనపెట్టి ఎప్పుడైతే సానుభూతి నిలుస్తుంది, ఎప్పుడైతే రెండు ఎన్నికలు కలిపి గెలవగలం అనే కారణాలమీద ఆధారపడి జరుగుతోంది. అంటే రాజకీయపక్షాలు తాము ప్రజలకు చేసిన, చేయబోయే మేలు గురించి మాట్లాడి ఎన్నికల్లో గెలవదలచుకోలేదన్నమాట. ఎంత తొందరగా ఎన్నికలు జరిపితే తమమీద సానుభూతి మిగిలిఉండి గెలుస్తామా అనేదే ఏకైక కారణమవుతున్నదన్న మాట.

ఇందుకోసం రాజకీయ నాయకులందరూ జ్యోతిష్యులూ, వాతవరణ శాస్త్రజ్ఞులూ అయిపోయి, లేని తుఫానుల్ని సృష్టిస్తున్నారు. సానుభూతి పవనాలు ఎప్పుడు వీస్తాయో, ఆ పవనాలమీద ఎప్పుడు గ్రహణం కమ్ముతుందో లెక్కలు కడుతున్నారు.

మొత్తంమీద భారత పార్లమెంటరీ రాజకీయాలు ప్రజలకు సంబంధించినంతవరకు ఎంత అసంబద్ధమైపోయాయి!? ○

(ఆంధ్రప్రభ 4, మే, 1999)

(12వ పేజీ తరువాయి)

త్రవ్వకం శుద్ధిచేసి యురేనియమ్ 328 ఎందుకు ఉపయోగించబడుతుంది అన్నది. అది కేవలం శాంతియుత ప్రయోజనాలకు అణువిద్యుత్ ఉత్పాదనకు మాత్రం ఉపయోగిస్తే ప్రజలకు ఎటువంటి అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు. కాని ఈ శుద్ధిచేసి 'ఎన్‌రిచ్' చేసిన యురేనియమ్ 328 అణుబాంబుతయారీకి ఉపయోగిస్తే ప్రజలు గర్హించక తప్పదు. అయినా జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల్లో ఏ దేశం అణుబాంబులను యుద్ధంలో ఉపయోగించే ప్రసక్తి లేదు. అందులోనూ భారతదేశం, పాకిస్తాన్ ఒకదానికి ఒకటి అంటుకొనిఉన్న భౌగోళిక పరిస్థితుల్లో ఏ దేశం అణుబాంబును ఉపయోగించినా దానివలన కలిగే నష్టం రెండుదేశాల ప్రజలు అనుభవించక తప్పదు. అందుచేత శుద్ధిచేసిన యురేనియమ్‌ని శాంతియుత ప్రయోజనాలకే ఉపయోగించబడుతుందని ముఖ్యంగా విద్యుత్ ఉత్పాదనకే ఉపయోగించబడుతుందని భావించడంలో ఎటువంటి సందేహం ఉండనవసరం లేదు.

కాని గర్హించవలసిన విషయం ఒకటి వుంది. అదేమిటంటే నల్లగొండ జిల్లా ప్రజలు, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ నిపుణులు ఈ యురేనియమ్ ఖనిజం త్రవ్వడం పట్ల, శుద్ధి కర్మాగారం నెలకొల్పడం పట్ల చాలా ఆందోళన చెందుతున్న సందర్భంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పెదవి కదపకుండా మూగనోము పట్టడం ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. అసలు ఈ విషయం శాసనసభలో చర్చించదగినది. దీనిపై ప్రభుత్వం వెంటనే కలుగచేసుకొని పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక, అటవీశాఖ వెనువెంటనే ఈ సమస్యను అన్ని కోణముల నుంచి పరిశీలించి ప్రజలకు సరియైన అవగాహన కలిగేవిధంగా తగిన నిర్ణయం తీసుకునేందుకు అన్నివిధాలా అన్ని ప్రచార సాధనాలను ఉపయోగించి ప్రజలకు వివేకం, చైతన్యం కలిగేటట్లు సహాయపడాలి. ○

(13వ పేజీ తరువాయి)

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ 9. చెంబులు, ఫర్నిచరు వగైరా రూ. 126 వేల మందికి ఇన్ని సౌకర్యాలంటే సోషలిజం వచ్చేసిందని పిస్తుంది. కేటాయింపు, ఖర్చు గురించి మాత్రం అడక్కండి. షరా మామూలే. తొమ్మిదో ప్రణాళికలో వెయ్యిలక్షలు (కేంద్రం వంతు) కేటాయిస్తే రూ. 48 లక్షల ఖర్చు ఆశ్రమ పాఠశాలల భవనాల నిర్మాణానికి గత ప్రణాళికలో కేంద్ర, రాష్ట్రపథకాలకు రూ. 95 లక్షలు కేటాయిస్తే, రూ. 25 లక్షలుమాత్రమే ఖర్చుచేయటం జరిగింది. గత సంవత్సరంలో అదే ధోరణి కొనసాగింది. కేటాయింపు పదికోట్లు. ఖర్చుమూడుకోట్లు. విశేషమేమంటే ఇందులో రాష్ట్రం రూపొందించిన పథకానికి అయిదుకోట్లకు గాను ఖర్చయింది 11 లక్షలు. గత ప్రణాళికలో 150 భవనాలు కట్టాలనుకుంటే పూర్తిచేసినవి 40 మాత్రమే. సంవత్సరానికి కేవలం 38 రూపాయల ఖర్చుతో ఇన్ని సౌకర్యాలు కల్పించగలిగే ప్రభుత్వం ప్రపంచంలో ఎక్కడైనా వుందా? ముఖ్యమంత్రి సాధించిన ఈ అద్భుతం గిన్నీస్‌బుక్‌లోకెక్కాల్సిన విషయం.

దౌర్జన్యాలకు గురైన గిరిజనుల సహాయానికి గత సంవత్సరం పదిన్నర లక్షలకు గాను రూ. 1.39 లక్షలు మాత్రమే ఖర్చయింది. గత ప్రణాళికాకాలంలో 300 మందికి సహాయం చేయాలనుకుంటే 197 మందికే సహాయం ఇచ్చారు. గత సంవత్సరం 200 మందికి సహాయంచేయాలనుకోగా 14మందికే సహాయం అందించగలిగారు. బహుశా గిరిజనులమీద దౌర్జన్యాలుతగ్గిపోయివుండాలి. స్కాలర్‌షిప్‌ల కోసం లక్షలు లక్షలు ఖర్చుచేస్తున్నామని ప్రచారం కొండంత, ఆచరణ పిసరంత. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం గత ప్రణాళికలో కేటాయింపు అయిదుకోట్లు, ఖర్చు 162 లక్షలు. గత సంవత్సరం కేటాయింపు 1200 లక్షలు, ఖర్చు 494 లక్షలు.

ప్రతి సంవత్సరం వందలమంది గిరిజనులు మలేరియా, తదితర రోగాలవల్ల చనిపోతున్నారని మనం వింటున్నాం. వారి ఆరోగ్యం బాగోగుల గురించి ప్రభుత్వం ఏమైనా పట్టించుకుందా అని చూడబోతే, జబ్బు మరీ ఎక్కువైనవారిని దగ్గరలోవున్న రిఫరల్ ఆసుపత్రులకు పంపటానికి గత సంవత్సరం రూ. 20 లక్షలకు గాను అయిదు లక్షలు మాత్రం ఖర్చయింది.

విదేశీ సహాయ సంస్థలు నిధులిస్తే ఖర్చుకావు. కేంద్రం పథకాలను రూపొందించి అందుకయ్యే ఖర్చుసొమ్ము కూడా చేతిలో పెడితే పూర్తిగా ఖర్చుచేయలేదు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు నిధుల కొరతతో లక్ష్యాలు పూర్తికావు. ఇదేనా గుడ్ గవర్నెన్స్?

ఇదీ గిరిజనాభివృద్ధికి ప్రభుత్వంప్రకటించిన పథకాల అమలుతీరు. తొమ్మిదో ప్రణాళిక అంతా ప్రస్తుత ముఖ్యమంత్రి హయాంలోనే జరిగింది. ఎనిమిది సంవత్సరాలు పండుగ చేసుకున్నారు ముఖ్యమంత్రి. గిరిజనదీపాలు ఇలా కొడిగట్టుకుపోతుంటే ఏమి సాధించానని ఈ పండుగ చేసుకున్నారో పాఠకులే వారి అభిప్రాయాలకు వారు రావచ్చు. ○

ఆలోచనలకు అక్షర రూపాన్నివ్వండి

రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలపై విశ్లేషణతో గూడిన వ్యాస రచనల్ని సమీక్ష ఆహ్వానిస్తుంది.

రచనలు పంపించాల్సిన చిరునామా: వి. హనుమంతరావు, సమతా పబ్లికేషన్స్

ఇం.నెం. 8-3-898/22, రోడ్ నెం. 3, నాగార్జుననగర్, హైదరాబాద్-500 073.